ఆదివారం
6•08•2017
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 60
• పేజీలు : 18 + 24+ 36 పేజీల ఆదివారం అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD




# ఇక న్యాయపోరాటమే

## జీఎస్టీ కౌన్సిల్ తీరుపై సీఎం కేసీఆర్ ఆగ్రహం



కొనసాగుతున్న ప్రాజెక్టులపై పన్ను భారం వద్దు
జీఎస్టీ కౌన్సిల్ భేటీలో పట్టుబట్టిన మంత్రి కేటీఆర్
బీజేపీ పాలిత రాష్ట్రాలు సహా వివిధ రాష్ట్రాల మద్దతు
కంటి తుడుపు చర్యగా 12% శ్లాబులోకి చేర్చిన కేంద్రం
ఐదు శాతం పన్నునే కొనసాగించాలన్న కేటీఆర్
రాష్ట్రం ఒత్తిడితో టెక్స్‌టైల్స్‌పై పన్ను 5 శాతానికి తగ్గింపు
కౌన్సిల్ తదుపరి భేటీ సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో

కేంద్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని వ్యాఖ్య
ప్రాజెక్టులపై 18% జీఎస్టీ భారం జాతీయ సమస్య
నేడు ప్రధాని మోదీకి లేఖ రాయనున్న కేసీఆర్

**న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ :** కొత్త పన్ను వ్యవస్థ ఉనికిలోకి రాకపూర్వమే ప్రారంభమైన రాష్ట్ర ప్రాజెక్టులకు జీఎస్టీ వర్తింపజేయడంపై తెలంగాణ ప్రభుత్వం న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నది. ప్రస్తుత ఐదు శాతం పన్నును కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నా కేవలం 12% శ్లాబులోకి మార్చేందుకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించడంపై సీఎం కే చంద్రశేఖర్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్‌చేశారు. లేకుంటే దీనిపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు. ఈ విషయంలో ఆదివారం ప్రధానికి సీఎం లేఖ రాయనున్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం కలిగించే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రోడ్ల నిర్మాణం తదితర పథకాలపై జీఎస్టీ పేరుతో 18% పన్నును విధించడం సహేతుకం కాదని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తున్న సంగతి తెలిసిందే. సీఎం కేసీఆర్ నుంచి ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, మున్సిపల్, ఐటీ మంత్రి కే తారకరామారావు, టీఆర్‌ఎస్ ఎంపీల వరకు అందరు అనేకమార్లు జీఎస్టీ విషయంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి విన్నవించారు. రాష్ట్రంపై భారం గురించి పార్లమెంటులో ఎంపీలు ప్రస్తావించారు. గత జీఎస్టీ కౌన్సిల్ భేటీల్లోనూ ఈ విషయాన్ని మంత్రులు లేవనెత్తారు. శనివారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ మరోసారి రాష్ట్రం తరపున గట్టిగా వాదనలు వినిపించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, రహదారుల నిర్మాణంలాంటి కార్యక్రమాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అయినా ఆశించిన ఫలితం రాలేదు. ఏదో దయతలిచినట్టు.. 18% పన్ను రేటును 12శాతానికి తగ్గిస్తున్నట్టు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించడంపై సీఎం కేసీఆర్ తీవ్ర నిరసన వ్యక్తంచేశారు.

**అన్ని రాష్ట్రాలకూ అన్యాయం**

జీఎస్టీ అమల్లోకి వచ్చిన ఈ ఏడాది జూలై 1వ తేదీకి ముందు ప్రారంభించిన ప్రాజెక్టులకూ జీఎస్టీ అమలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.19,200 కోట్ల మేరకు అదనపు భారం పడుతున్నదని సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే కాకుండా అన్ని రాష్ట్రాలకూ అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిని జాతీయ సమస్యగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. జీఎస్టీ అమలు విషయంలో కేంద్రం అనుసరిస్తున్న ఏకపక్ష విధానానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేయాలని సీఎం నిర్ణయించారు.

**బడ్జెట్‌లో మార్పులు సాధ్యంకావు**

రాష్ట్రప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు అయ్యే వ్యయాన్ని బట్టి వార్షిక బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందని, ఇప్పుడు జీఎస్టీ ద్వారా పడే అదనపు భారంతో వాటిని నిర్దిష్ట లక్ష్యం మేరకు అమలు

మిగతా 2వ పేజీలో



శనివారం ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన కేంద్ర మాజీ మంత్రి ఎం వెంకయ్యనాయుడిని ఆయన నివాసంలో అభినందిస్తూ స్వీటు తినిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

## 13వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ఘనవిజయం

11న ప్రమాణ స్వీకారం.. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ అభినందనలు

| | |
|---|---|
| మొత్తం ఓట్లు | 790 |
| ఖాళీలు | : లోక్‌సభలో 2, రాజ్యసభలో 3 |
| అనర్హులు | : ఒకరు |
| గైర్హాజరైనవారు | : 13 |
| పోలైన ఓట్లు | : 771 |
| చెల్లని ఓట్లు | : 11 |
| వెంకయ్యకు | : 516 |
| గోపాలకృష్ణ గాంధీకి | : 244 |
| వెంకయ్య మెజారిటీ | : 272 |

**న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:** ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఎన్నికయ్యారు. తన ప్రత్యర్థి ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి అయిన గోపాలకృష్ణ గాంధీపై ఆయన మూడింట రెండు వంతుల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. వెంకయ్యనాయుడికి 272 ఓట్ల మెజారిటీ లభించింది. 1967లో వీవీ గిరి తర్వాత ఉపరాష్ట్రపతి పదవిని చేపడుతున్న తెలుగు వ్యక్తి వెంకయ్యనాయుడే. పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికల్లో వెంకయ్యనాయుడికి 516 ఓట్లు లభించగా, యూపీఏ తరపున పోటీ

మిగతా 5వ పేజీలో

## కేశవరం, లక్ష్మాపూర్‌లకు 27 కోట్లు

అడిగినదానికంటే ఎక్కువే ఇచ్చిన సీఎం కేసీఆర్
హామీలపై 24 గంటల్లోగా జీవోలు జారీ

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రజలు అడిగినదానికంటే ఎక్కువ నిధులను.. అడిగిన వెంటనే మంజూరుచేయడం తన ప్రత్యేకత అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చాటుకున్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల అభివృద్ధి పనులకు రూ.27.75 కోట్ల నిధుల విడుదలలో ఇది మరోసారి రుజువైంది. రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులకు, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించి 24గంటలు గడువక ముందే ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ప్రత్యేక అభివృద్ధి నిధి) కింద లక్ష్మాపూర్‌కు రూ.15.50 కోట్లు, కేశవరం గ్రామానికి రూ.12.25 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య శనివారం మధ్యాహ్నం ఉత్తర్వులిచ్చారు. రెండు గ్రామాల ప్రజలు అడిగినదానికంటే ఎక్కువ నిధులను విడుదల చేయడం విశేషం. మేడ్చల్ జిల్లాలోని కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో ముఖ్యమంత్రి శుక్రవారం పర్యటించిన సందర్భంగా ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న విషయం తెలిసిందే. రెండు గ్రామాల్లో ఏర్పాటుచేసిన సభల్లో సీఎం పలు వరాలు ప్రకటించారు. రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధికారులు రూ.23 కోట్లు

మిగతా 2వ పేజీలో

వచ్చే రెండురోజుల్లో చిరుజల్లులు

7




## నీతిఆయోగ్ కొత్త సారథి రాజీవ్‌కుమార్



రాజీవ్‌కుమార్

**న్యూఢిల్లీ :** నీతిఆయోగ్ వైస్‌చైర్మన్‌గా పనగరియా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో ప్రముఖ ఆర్థికవేత్త రాజీవ్‌కుమార్ నియమితులయ్యారు. రాజీవ్‌కుమార్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో డీఫిల్ చేశారు. లక్నో యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ప్రముఖ ఆర్థికవేత్తగా పేరుగాంచిన ఆయన 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్'(ఐసీఆర్ఐఈఆర్)కు డైరెక్టర్‌గా, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. 2006 నుంచి 2008 వరకు జాతీయ భద్రతా సలహా బోర్డు

మిగతా 8వ పేజీలో



## ప్రభుత్వ ఉత్సవంగా జయశంకర్ సార్ జయంతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని ప్రభుత్వ ఉత్సవంగా ఏటా ఆగస్టు 6న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీచేసింది. జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వశాఖల అధిపతులు, జిల్లా కలెక్టర్లు స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, విద్యాసంస్థలు తగు ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోకు పూలమాల వేసి నివాళులు అర్పించి, శ్రద్ధాంజలి ఘటించాలని ఉత్తర్వుల్లో సూచించింది.











# ఆయన బాటలోనే మనం..!

- నేడు జయశంకర్ సార్ జయంతి
- మహోపాధ్యాయుడిని స్మరించుకునే సమయం

**వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'తెలంగాణ తప్పక చూస్తా. నాకు సందేహం లేదు. తెలంగాణ పునర్నిర్మాణమే ముఖ్యమైన ఎజెండాఅవుతుంది' అని రాష్ట్ర ఆవిర్భావానికి చాలా ముందే చెప్పిన దార్శనికుడాయన. తెలంగాణలో అద్భుతమార్పులు వస్తాయని, వ్యవసాయం, గ్రామీణార్థిక పరిపుష్టి, విద్య, వైద్య రంగాల సంస్కరణలతో రాష్ట్ర ముఖచిత్రం మారుతుందని గణాంకాలతో ఊరూరా చాటిన మహనీయుడాయన. ఆయనే తెలంగాణ మహోపాధ్యాయుడు జయశంకర్ సార్. సార్ జయంతి సందర్భంగా తెలంగాణ ఆయనను స్మరించుకుంటున్నది. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి ఉత్సవాలను నిర్వహించి గౌరవించుకుంటున్నది. ఆయన చూపిన బాటలోనే తెలంగాణ పయనిస్తున్నది.

పాత వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో 1934, ఆగస్టు 6న లక్ష్మీకాంతారావు, మహాలక్ష్మి దంపతులకు కొత్తపల్లి జయశంకర్ జన్మించారు. తండ్రినుంచి తెలంగాణ సాయుధపోరాట వారసత్వ స్ఫూర్తిని అందుకున్న జయశంకర్‌సార్, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు తానే చిరునామాగా మారారు. 1954లో ఫజల్‌అలీ కమిషన్ ఎదుట హాజరై విశాలాంధ్రను వ్యతిరేకించడంతో తెలంగాణ క్రియాశీల ఉద్యమంలో ప్రవేశించిన జయశంకర్, 1968– 69 తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. తెలంగాణ ఉద్యమ తొలిపాదంనుంచి చివరిదాక వివిధ దశలన్నీ చూసిన అతికొద్ది మందిలో జయశంకర్ సార్ ఒకరు. ఫజల్ అలీనుంచి శ్రీకృష్ణకమిటీ దాకా తెలంగాణ మీద వేసిన ప్రతి కమిటీ ముందు హాజరయ్యారు. ఇందిరనుంచి సోనియా వరకు ప్రతి ఒక్కరినీ ఆయన తెలంగాణ సాధన కోసం కలిశారు. తెలంగాణ కోసం జీవితకాలమంతా ప్రసంగాలు చేశారు. గత అనుభవాలు, వైఫల్యాల పునాదుల మీద మలిదశ ఉద్యమ సిద్ధాంతాన్ని ఆయన రూపొందించారు. ఉద్యమానికి ఆవేశం కాదు..ఆలోచనే ప్రధానమని బలంగా చాటిచెప్పారు. రాష్ట్రసాధనలో రాజకీయ ఎత్తుగడల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఉత్థానపతనాలు, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకుపోవాలో నిర్దేశం చేశారు. ఉద్యమ నిర్మాణంలో భావవ్యాప్తి ఎంత ప్రధానమో తెలియచెప్పారు. తొలి దశ ఉద్యమం నుంచి పాఠాలు నేర్చుకోవాలని హితబోధ చేశారు. తెలంగాణ కోసం జయశంకర్ సార్ నిర్దేశించిన భావజాల వ్యాప్తి, ప్రజా ఆందోళన, రాజకీయ ప్రక్రియ అనే పోరాట రూపాలతోనే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. ఆయన నిర్దేశంలోనే ప్రజా ఉద్యమాన్ని నిర్మించి కేంద్రం మెడలు వంచింది. ఆయన చెప్పిన రాజకీయ అనివార్యతనుంచే తెలంగాణ ఏర్పాటు సాధ్యపడింది. 2011, జూన్ 21న జయశంకర్ సార్ తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం చూడకుండానే ఆయన కన్నుమూసినా అప్పటికే తెలంగాణ రావడం ఖాయమైంది. 2009లో కేసీఆర్ దీక్షతో కేంద్రం తెలంగాణ ఏర్పాటుకు ముందుకు వచ్చి చేసిన ప్రకటన జయశంకర్‌సార్ రాసిందే. ఆనాడే తెలంగాణ ఖాయమైంది. ఆ తర్వాత తాత్కాలికంగా కేంద్రం వెనుకకు తగ్గినా..'ఇక తెలంగాణ ఆగదు.. ఔర్ ఏక్ ధక్కా తెలంగాణ పక్కా' అని జయశంకర్ నాడే విశ్వసించారు. విశ్వాసం విజయం సాధించింది. ఆయన కలలుగన్న పునర్నిర్మాణం కేసీఆర్ నేతృత్వంలోని తొలి తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్నది.

## సిస్టర్ ఫర్ చేంజ్‌కు సెహ్వాగ్ మద్దతు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన సిస్టర్స్ ఫర్ చేంజ్ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రముఖుల మద్దతు లభిస్తున్నది. ప్రముఖ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా ఈ జాబితాలో చేరారు. రాఖీలు కట్టినప్పుడు హెల్మెట్ బహుమతిగా ఇవ్వడమనే కార్యక్రమాన్ని ఎంపీ కవిత ప్రారంభించడం మంచి చొరవగా ఆయన అభివర్ణించారు. 'హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడమన్నా.. అధిక స్పీడ్‌తో వెళ్లడమన్నా.. శ్మశానానికి పాస్‌పోర్ట్ తీసుకోవడమే'నని ఆయన ట్వీట్ చేశారు. మీరు ప్రేమించేవారికి హెల్మెట్ బహూకరించండి అంటూ సోదరీమణులకు సూచించారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఎంపీ కవితకు కృతజ్ఞతలు తెలుపుతూ మంచి కార్యక్రమాన్ని చేపట్టారంటూ ట్వీట్ చేశారు.







## ఇరాక్‌లో మా వాళ్లను కాపాడండి

### కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్‌కు మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇరాక్‌లో చిక్కుకున్న తెలంగాణవాసిని రక్షించేలా చొరవ తీసుకోవాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు రాష్ట్ర ఐటీ, ఎన్నారై వ్యవహారాల మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'మా తండ్రి తోట మోహన్ ఇరాక్‌లో అదృశ్యమయ్యారు. స్వదేశానికి రప్పించేలా చూడండి' అని మంత్రి కేటీఆర్‌కు మోహన్ కుమారుడు లవణ్‌కుమార్ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ దృష్టికి మంత్రి కేటీఆర్ తీసుకెళ్లారు. ఇరాక్‌లోని విదేశాంగశాఖ అధికారులు ఈ విషయంలో సహాయం చేసేలా చూడాలని కోరారు.

## హైదరాబాద్‌ను అతిమనోహరంగా..!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో రహదారులు, జంక్షన్లు, పార్కులను అతిమనోహరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రి కే తారకరామారావు తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న కేటీఆర్ తాను బస చేసిన గదిలో నుంచి బయటికి చూసినపుడు చదును చేసిన రహదారులు, క్రమపద్ధతిలో పని చేసే జంక్షన్లు, సుందరమైన పార్కులతో ఢిల్లీ అందంగా దర్శనమిచ్చింది. ఈ విషయాన్ని శనివారం ట్విట్టర్ ద్వారా అందరితో పంచుకున్న కేటీఆర్, హైదరాబాద్‌ను ఇంతకన్నా మెరుగ్గా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యామని ట్వీట్ చేశారు.



### ముహూర్తం



సూర్యోదయం: 6.01 గంటలకు



సూర్యాస్తమయం: 6.43 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణమాసం, శుక్లపక్షం చతుర్దశి రాత్రి 10.31 వరకు, తదుపరి పూర్ణిమ. నక్షత్రం: ఉత్తరాషాఢ. అమృత ఘడియలు: సాయంత్రం 6.48 నుంచి 8.24 వరకు, రాహుకాలం: సాయంత్రం 5.08 నుంచి 6.43 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 5.01 నుంచి 5.52 వరకు, వర్జ్యం: ఉయదం 8.20 నుంచి 9.56 వరకు.

### లోకం పోకడ







ఢిల్లీలో శనివారం రాత్రి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు వివేక్







శనివారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్రమంత్రులు జైట్లీ, సంతోష్ గంగ్వార్, రాష్ట్ర మంత్రి కేటీఆర్, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్

# ఇక న్యాయ పోరాటమే

మొదటిపేజీ తరువాయి...

చేయడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత తీసుకున్న నిర్ణయం కావడం వల్ల అమలు కష్టమని అన్నారు. ప్రాజెక్టుల వ్యయాన్ని బడ్జెట్‌లో పొందుపర్చాల్సి ఉంటుందని, అది ఇప్పుడు సాధ్యం కాదని తెలిపారు. జీఎస్టీ వర్తింపు వల్ల ప్రాజెక్టుల అంచనా వ్యయాలు పెరుగుతాయని, ఈ అదనపు భారాన్ని ఇప్పుడు బడ్జెట్‌లో పొందుపర్చలేమని పేర్కొన్నారు. కాబట్టి కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయపోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

**కంటితుడుపు చర్యగా**

తెలంగాణ డిమాండ్‌ను లోతుల్లోకి వెళ్ళి అర్థం చేసుకుని జీఎస్టీ భారాన్ని తొలిగించడానికి బదులుగా ఏదో కనికరం చూపినట్లు ఆరు శాతం పన్నును తగ్గించడం కంటితుడుపు చర్యేనని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. వాస్తవానికి తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నది ఈ దయాదాక్షిణ్యాలను, పన్నురేటును తగ్గించడాన్ని కాదు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు కాబట్టి జీఎస్టీతో సంబంధం లేకుండా పాత పన్ను విధానాన్నే కొనసాగించాలన్నది తెలంగాణ డిమాండ్. జీఎస్టీ ఊసే లేనప్పుడు ఈ ప్రాజెక్టులను రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ పథకాలు దాదాపు ముగింపు దశకు వచ్చాయి. ఇప్పుడు జీఎస్టీ పేరుతో అదనపు భారాన్ని వేయడమంటే ఆ పనులకు బ్రేకులు వేయడమే. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన ప్రాజెక్టులను లబ్ధిదారులకు దక్కకుండా చేయడమేనని అధికారులు అంటున్నారు. వాస్తవానికి వన్ నేషన్ – వన్ ట్యాక్స్ అనే విధానానికి కేంద్రం శ్రీకారం చుట్టి పార్లమెంటులో బిల్లుకు ఆమోదం లభించిన వెంటనే అన్నింటికంటే ముందుగా అసెంబ్లీలో ఆమోదించింది తెలంగాణ ప్రభుత్వమే. కానీ ప్రజలకు ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులను సైతం జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి అదనంగా భారం వేయడాన్ని తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

**తెలంగాణ డిమాండ్‌కు అన్ని రాష్ట్రాల మద్దతు**

కొనసాగుతున్న ప్రాజెక్టులపై ఐదు శాతం పన్నునే అమలుచేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి కే తారక రామారావు చేసిన డిమాండ్‌కు బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, గుజరాత్, రాజస్థాన్‌లతోపాటు పశ్చిమబెంగాల్, పంజాబ్ తదితర రాష్ట్రాలు కూడా మద్దతు పలికాయి. బీజేపీ నేత, బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ సైతం కేటీఆర్ వాదనకు మద్దతు తెలిపారు. కేటీఆర్ డిమాండ్‌పై ఆర్థికమంత్రి జైట్లీ మాట్లాడుతూ మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తదితర ప్రాజెక్టులపై జీఎస్టీ కౌన్సిల్ విధించిన 18% పన్నును 12శాతానికి తగ్గిస్తున్నట్టు చెప్పారు. పాత ప్రాజెక్టులతోపాటు కొత్త ప్రాజెక్టులన్నింటికీ ఈ పన్ను రేటు వర్తిస్తుందని తెలిపారు. అయితే ఈ నిర్ణయంతో తాము సంతృప్తి చెందడంలేదని, ప్రస్తుతం అమలవుతున్న 5% పన్నునే కొనసాగించాలని కేటీఆర్ స్పష్టంచేశారు. తమ డిమాండ్ మేరకు 18% పన్నును 12శాతానికి తగ్గించడంతో ఒక మేరకు మాత్రమే ఉపశమనం కలుగుతుందన్నారు. కనుక అదనంగా పడిన భారం మొత్తాన్ని తొలిగించాల్సిందేనని కేటీఆర్ కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. దీంతో అన్ని రాష్ట్రాల నుంచి వివరాలను తెప్పించుకుని అధ్యయనం చేసిన తర్వాత హైదరాబాద్‌లో సెప్టెంబర్ 9న జరిగే జీఎస్టీ కౌన్సిల్ 21వ సమావేశంలో నిర్ణయం తీసుకుందామని జైట్లీ పేర్కొన్నారు. అయితే.. తాము కోరుతున్న విధంగా ఎట్టి పరిస్థితుల్లో 5% కొనసాగించాల్సిందేనని, ఈ దిశగా జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం రాకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పదని కేటీఆర్ సమావేశంలోనే తేల్చిచెప్పారు. దీంతో ఆయా రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు జీఎస్టీ ద్వారా 18% పన్నుతో పడే భారం ఏ స్థాయిలో ఉంది తదితరాలను పరిశీలించాలని కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. దీనితోపాటు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమపై 28% పన్ను విధించడం, బీడీ పరిశ్రమను కూడా సిగరెట్ పరిశ్రమతో సమానంగా చూస్తూ 28% పన్ను నిర్ణయించడం కూడా రాష్ట్రాలకు చాలా ఇబ్బంది కలిగిస్తుందని, వీటికి జీఎస్టీ వర్తింపజేయకుండా పాత విధానాన్నే కొనసాగించాలని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

**టెక్స్‌టైల్ జాబ్‌వర్క్స్‌పై 18శాతం నుంచి 5శాతానికి తగ్గిన పన్ను**

టెక్స్‌టైల్ రంగానికి కూడా పన్నును తగ్గించాలని తెలంగాణ డిమాండ్ చేస్తున్నదని, ఏ రాష్ట్రం నుంచీ పెద్దగా ఒత్తిడి లేకపోయినా తెలంగాణ ఒత్తిడి మేరకు ఈ రంగంలోని 'జాబ్‌వర్క్స్'పై విధిస్తున్న 18% పన్నును 5%కి కౌన్సిల్ తగ్గించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అదేవిధంగా చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమలకు జీఎస్టీని 28% నుంచి తగ్గించాలని, బీడీ పరిశ్రమపై కూడా అదనపు పన్ను భారం తొలిగించాలని సమావేశంలో కోరామని చెప్పారు. వాటిని పరిశీలిస్తామని జైట్లీ తెలిపారని పేర్కొన్నారు. తెలంగాణ కోరిక మేరకే తదుపరి సమావేశాన్ని సెప్టెంబర్ 9వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించడానికి కౌన్సిల్ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని కేటీఆర్ చెప్పారు.

## అదనపు భారంతో ఆటంకాలు

**తెలంగాణకు** సంబంధించి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రోడ్ల నిర్మాణం అనే ఐదు అంశాలను ప్రస్తావించామని సమావేశం అనంతరం మంత్రి కేటీఆర్ మీడియాకు చెప్పారు. ప్రజలకు రక్షిత తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు, సమాజంలో అట్టడుగున ఉన్నవారికి ఇండ్లు, నాణ్యమైన రోడ్లు తదితరాలను కల్పించడం ప్రజాస్వామ్య ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమన్నారు. ఈ దిశగా సీఎం కేసీఆర్ వినూత్నమైన పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు లబ్ధి చేకూర్చాలని ప్రయత్నిస్తుంటే జీఎస్టీ పేరుతో అదనపు భారం వేయడం ఆ పథకాలకు ఆటంకాలు సృష్టించడమేనని చెప్పారు. ఈ ప్రాజెక్టులకు తెలంగాణ ప్రభుత్వం రూ.2.30 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నదని, ఇందులో సాగునీటి ప్రాజెక్టులకే దాదాపు లక్ష కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నదని తెలిపారు. మిషన్ కాకతీయకు రూ.20 వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.43 వేల కోట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకానికి రూ.18 వేల కోట్లు, రోడ్ల నిర్మాణానికి రూ.25 వేల కోట్లకు పైనే ఖర్చు పెడుతున్నామని కేటీఆర్ వివరించారు. 'జీఎస్టీ ఉనికిలోకి రాకపూర్వమే వీటిని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. టెండర్లను పిలిచి కాంట్రాక్టులను అప్పజెప్పింది. పనులు కూడా తుది దశలో ఉన్నాయి. వ్యాట్ ప్రకారం వీటిపై 5% పన్ను విధానం ఉన్నది. ఇప్పుడు జీఎస్టీతో అది 18%కి చేరుకుంటుంది. ఈ కారణంగా అదనంగా రూ.19,200 కోట్ల మేరకు భారం పడుతున్నది' అని కేటీఆర్ తెలిపారు. జీఎస్టీ పేరుతో అదనపు పన్ను వేసే ప్రతిపాదనను ఈ సమావేశంలో తీవ్రంగా నిరసించామని, ఎట్టి పరిస్థితుల్లో యథాతథంగా 5% పన్ను కొనసాగించాలని స్పష్టం చేశామని చెప్పారు. ఒకవేళ తగ్గించకుంటే న్యాయస్థానానికి వెళ్లటం తప్ప తమకు మరో దారి లేదని వివరించామని తెలిపారు. తెలంగాణ ఒత్తిడి మేరకు జీఎస్టీ పన్నురేటును 18% నుంచి 12%కి తగ్గించడం ఆహ్వానించదగినదే అయినా తమ డిమాండ్ మాత్రం 5% వరకు తగ్గించాల్సిందేనని స్పష్టంచేశారు. కొనసాగుతున్న ప్రాజెక్టులతోపాటు కొత్త ప్రాజెక్టులకు కూడా 12% వర్తిస్తుందని జైట్లీ స్పష్టంచేశారని, తాను మాత్రం కొనసాగుతున్న ప్రాజెక్టుల పన్నురేటులో ఎలాంటి పెంపుదల ఉండకుండా యథాతథంగా 5% కొనసాగించాలని స్పష్టం చేశామని తెలిపారు. కొత్త ప్రాజెక్టులకు 12% విధించడాన్ని మరో అంశంగా చూడాలని, ప్రస్తుతానికి తాము కొనసాగుతున్న ప్రాజెక్టులపై న్యాయంకోసమే ఒత్తిడి చేస్తున్నామని వివరించారు. అన్ని రాష్ట్రాలు తమ డిమాండ్‌కు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుందామని జైట్లీ చెప్పారని, ఆ మేరకు సానుకూల నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నామని తెలిపారు. తగ్గించకపోతే న్యాయపోరాటం తప్పదని వ్యాఖ్యానించారు. తెలంగాణపైనే రూ.19,200 కోట్ల అదనపు భారం పడుతున్నదంటే మొత్తం అన్ని రాష్ట్రాలను కలుపుకొంటే అది ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఒక దశలో బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ వ్యాఖ్యానించారని కేటీఆర్ వెల్లడించారు.

## కేశవరం, లక్ష్మాపూర్‌లకు 27 కోట్లు

మొదటిపేజీ తరువాయి...

కావాలని ప్రతిపాదించగా అంతకంటే రూ.4.50 కోట్లు ఎక్కువే విడుదలచేశారు. కేశవరం గ్రామానికి వివిధ అభివృద్ధి పనులకు రూ.10.27 కోట్లు కావాలని అధికారులు ముఖ్యమంత్రికి విన్నవించారు. రూ.12 కోట్ల వరకు నిధులిస్తామని సీఎం చెప్పారు. కానీ శనివారం విడుదలచేసిన జీవోలో ప్రభుత్వం రూ.12.25కోట్లను మంజూరుచేసింది. లక్ష్మాపూర్‌కు రూ.13 కోట్లు అడిగితే రూ.15 కోట్లు ఇస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. కానీ జీవోలో మరో రూ.50లక్షలు అదనంగా మంజూరుచేశారు. రెండు గ్రామాల్లో పక్కాగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవసరమైన నిధులను మంజూరుచేయాలని, పనుల నాణ్యతలో రాజీపడవద్దని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్టు సమాచారం. రెండు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా చేపట్టనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు అభివృద్ధి పనుల వారీగా అంచనా వ్యయాలను రూపొందించి వెంటనే నివేదిక ఇవ్వాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మేడ్చల్ జిల్లా కేశవరంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు

**శామీర్‌పేట:** కోరినదానికన్నా ఎక్కువ నిధులు మంజూరుకావడంతో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని కేశవరం ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కోరినదానికి మించి నిధులు మంజూరుచేసే ఘనత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు దక్కుతుందని కేశవరం గ్రామ టీఆర్ఎస్ నేతలు కొంపల్లి రవిగౌడ్, హరిమోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలను కన్నబిడ్డలుగా ఆప్యాయంగా పలుకరించడంతోపాటు కోరినదానికి మించి నిధులు మంజూరు చేసిన సీఎంకు కేశవరం ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. ముఖ్యంగా సీఎంకు ఇచ్చిన మాట మేరకు గ్రామంలో ఇంటికి ఆరు మొక్కల చొప్పున నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు చేపడుతామని ప్రతినబూనారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్‌గౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు గత్వల మహేశ్, రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు మైసయ్యాయాదవ్, యూత్ అధ్యక్షుడు ప్రదీప్‌ముదిరాజ్, జగదీశ్వర్, ఇంద్రసేనారెడ్డి, యూ బలరాం, రమేశ్, సత్యనారాయణ, సంపత్, బాబు, తదితరులు పాల్గొన్నారు.


## భారీగా బీటెక్ సీట్లు ఖాళీ

- ట్యూషన్ ఫీజుకే యాజమాన్య కోటా సీట్లు
- మొదట్లో కృత్రిమ డిమాండ్‌ను సృష్టించిన కాలేజీలు
- 15 లక్షలకుపైగా క్యాపిటేషన్ ఫీజులు వసూలు
- ఆందోళనకు దిగుతున్న తల్లిదండ్రులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మెరుగైన విద్యాప్రమాణాలు పాటిస్తున్నామని ప్రచారం చేసుకొని టాప్ కాలేజీలుగా కొనసాగుతున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల అసలు బండారం బయటపడుతున్నది. ఎడ్యుకేషనల్ ఏజెన్సీలతో చేతులు కలిపి కృత్రిమ డిమాండ్ సృష్టించి సీట్లు అమ్ముకున్న ఆ కాలేజీల పరిస్థితి నేడు అధ్వాన్నంగా మారింది. ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందే మార్చిలోనే యాజమాన్య కోటా సీట్లకు బేరం పెట్టి రూ.15 లక్షలకుపైగా వసూలు చేసిన కాలేజీల్లో ఇప్పుడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 70 శాతం కన్వీనర్ కోటా, 30 శాతం యాజమాన్య కోటాలో సీట్లు భర్తీ చేస్తారు. టాప్ మోస్ట్ కాలేజీల్లో 30 శాతం యాజమాన్య కోటా కింద 20 శాతమే సీట్లు నిండాయి. 10 శాతం సీట్లు బ్రాంచీల వారీగా మిగిలాయి. క్యాపిటేషన్ ఫీజు కోసం లక్షలు కొల్లగొట్టేందుకు ఇన్నాళ్లూ వీటిని బ్లాక్‌చేశారు. తుదివిడుత ఎంసెట్ కౌన్సెలింగ్ తర్వాత కన్వీనర్ కోటాలో చాలా మందికి కంప్యూటర్ సైన్స్‌లో, ఈసీ, ఐటీ వంటి ప్రాధాన్యం ఉన్న కోర్సుల్లోనూ సీట్లు పుష్కలంగా మిగిలాయి. ఈ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని, విద్యార్థులు ప్రవేశాలు పొందాలంటూ ఆయా కాలేజీలు వ్యాపార ప్రకటనలు గుప్పిస్తున్నాయి. రెండు నెలల కిందట రూ.15 లక్షలకు అమ్మిన సీటు, ఇప్పుడు కేవలం కన్వీనర్ కోటా ఫీజుకే ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ విద్యార్థులు చేరడం లేదు. ఇప్పటికే తుది విడుత ఎంసెట్ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందడంతో సీట్లు నిండక కాలేజీలు విలవిల్లాడుతున్నాయి. యాజమాన్య కోటాలో సీట్లు మిగిలాయని తెలుసుకున్న తల్లిదండ్రులు, తొలుత తమ నుంచి రూ.15 లక్షల చొప్పున వసూలుచేయడంపై మండిపడుతున్నారు. కృత్రిమ డిమాండ్ సృష్టించి అధికంగా వసూలు చేసిన డబ్బును తిరిగి ఇవ్వాలని యాజమాన్యాలను నిలదీస్తున్నారు. మరోవైపు తక్కువ ఫీజుకే ఇతర కాలేజీల్లో సీట్లు పొందాలనుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వకుండా యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయి. టాప్ కాలేజీల అక్రమ దందాపై టీఏఎఫ్ఆర్‌సీకి రహస్యంగా తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారు.

**ప్రారంభమైన స్పాట్ కౌన్సెలింగ్**

ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలలో సీట్ల భర్తీ కోసం శనివారం స్పాట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. తుది విడుత కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం కాలేజీల వారీగా స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కానీ విద్యార్థులు కరువయ్యారు. కన్వీనర్ కోటా ఫీజుకే యాజమాన్య కోటా సీట్లు, కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లు ఇస్తామని కాలేజీలు ప్రకటిస్తున్నప్పటికీ ఎవరూ రావడం లేదు. స్పాట్ కౌన్సెలింగ్ ఈ నెల 9తో ముగియనున్నది. భర్తీ అయిన సీట్ల వివరాలను 16 లోగా ఎంసెట్ అడ్మిషన్ కన్వీనర్ కార్యాలయానికి పంపించాలి. ఆలోపు చేరిన విద్యార్థులకే పరీక్షలకు అనుమతి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎంత తక్కువ ఫీజుకైనా సీట్లు నింపుకునేందుకు కాలేజీ యాజమాన్యాలు ఆపసోపాలు పడుతున్నాయి.



శనివారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో టీఎంయూలో చేరుతున్న ఈయూ జోనల్ కార్యదర్శి రాఘవరెడ్డి, నాయకులు. చిత్రంలో టీఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# టీఎంయూతోనే హక్కుల సాధన

### కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు ఘనత సీఎం కేసీఆర్‌దే: మంత్రి హరీశ్‌రావు

### ఈయూ నుంచి టీఎంయూలో చేరిన నేతలు, కార్మికులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సకలజనుల సమ్మెలో పుట్టిన ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆశీస్సులు, అండదండలు ఎళ్లవేళలా ఉంటాయి. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, హక్కుల సాధనలో టీఎంయూ ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తుంది' అని భారీ నీటిపారుదలశాఖ మంత్రి, టీఎంయూ గౌరవ అధ్యక్షుడు హరీశ్‌రావు చెప్పారు. హైదరాబాద్‌కు సంబంధించిన ఈయూ జోనల్ కార్యదర్శి రాఘవరెడ్డి, నాయకులు, మద్దతుదారులు, మరికొన్ని సంఘాల కార్మికులు శనివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో టీఎంయూలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు సీఎం కేసీఆర్ 44 శాతం వేతనాలు పెంచారని, సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులందరినీ క్రమబద్ధీకరించారని గుర్తుచేశారు. కాంట్రాక్టు వ్యవస్థనే రద్దుచేసిన ఘనత సీఎందేనని పేర్కొన్నారు. సీసీఎస్ ద్వారా రూ.ఆరు లక్షల ప్రమాద బీమా, విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.5 లక్షలు మొత్తం రూ.11 లక్షలు ఇప్పించేందుకు కృషి చేశామని టీఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి చెప్పారు. కార్మికుల కోసం చేస్తున్న సేవలు, కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంప్లాయిస్ యూనియన్ నుంచి టీఎంయూ చేరుతున్నారన్నారు. దాదాపు 300 మందికిపైగా ఇతర సంఘాల నుంచి టీఎంయూ చేరడమే ఇందుకు నిదర్శనమన్నారు. టీఎంయూ చేరిన వారందరికి సముచితస్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీఎంయూ కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు మురళీయాదవ్, నేతలు రాజలింగం, జీఎల్ గౌడ్, వీఎస్ రెడ్డి, వీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ ఉద్యోగం వద్దంటే
# రూ. 5 లక్షలు

### అదనపు ఆర్థికసాయం పెంచిన టీఎస్‌ఆర్టీసీ.. సర్క్యులర్ జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వారసత్వ ఉద్యోగం కోరుకోని కుటుంబానికి ఇచ్చే అదనపు ఆర్థికసాయాన్ని టీఎస్‌ఆర్టీసీ రూ.5 లక్షలకు పెంచింది. ఆర్టీసీలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగిపై ఆధారపడిన అతని కుటుంబసభ్యులు తమకు వారసత్వ ఉద్యోగం అక్కరలేదని లిఖితపూర్వకంగా తెలియజేస్తే వారికి ఈ ప్రయోజనం దక్కుతుంది. కొంతకాలంగా సంస్థలో పెండింగ్‌లో ఉన్న ఈ విషయమై తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు టీఎస్‌ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు సర్క్యులర్ జారీచేశారు. వారసత్వ ఉద్యోగం వద్దన్న చనిపోయిన ఉద్యోగి కుటుంబానికి, ఆర్టీసీ ఇప్పటివరకు సదరు ఉద్యోగి క్యాటగిరీని బట్టి రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు అదనపు ఆర్థిక సాయం కింద ఇస్తున్నది. క్లాస్-3, 4 ఉద్యోగులకు రూ.లక్ష, క్లాస్-2కు రూ.1.25 లక్షలు, క్లాస్-1 వారికి రూ.1.50 లక్షల చొప్పున అందజేస్తున్నది. ఇప్పుడు ఈ మొత్తం రూ.5 లక్షలకు పెంచింది. ఏ తరగతి ఉద్యోగికైనా అందరికీ ఒకేవిధంగా ఇంతే మొత్తాన్ని అందిస్తామని, ఈ సహాయం ఈ నెల 4 నుంచి చనిపోయిన ఉద్యోగుల కుటుంబీకులకు మాత్రమే వర్తిస్తుందని ఎండీ సర్క్యులర్‌లో వివరించారు.

## పంచాయతీ నిధులపై సర్పంచ్, కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విధానం ఇప్పటికే అమలులో ఉన్నప్పటికీ ఇందుకు సంబంధించి జీవో నంబర్ 30లో అవసరమైన నిబంధన లేకపోవడంతో సవరణ చేస్తూ రూల్ 40ని చేర్చింది. శనివారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

## బంగారు తెలంగాణ నిర్మాణమే ఆచార్య జయశంకర్‌కు నివాళి

### డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని ఉద్యమాలకు అంకితం చేసిన మహోన్నతవ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ మలిదశ పోరాటంలో తెలంగాణ సిద్ధాంతకర్తగా కీలకపాత్ర పోషించి.. రాష్ట్ర సాధనకు బాటలు వేశారని కడియం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును చూడకుండానే ఆయన తుదిశ్వాసను విడువడం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్ కలలుకన్న బంగారు తెలంగాణ సాధనే ఆయనకు నిజమైన నివాళి అని శ్రీహరి చెప్పారు. జయశంకర్ జయంతి సందర్భంగా బంగారు తెలంగాణ సాధనకోసం పునరంకితం కావాలని రాష్ట్ర ప్రజలను కోరారు.

## బాధితులకు పూర్తి పరిహారం

### మిడ్‌మానేరు ముంపు ఇండ్లపై హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మిడ్‌మానేరు ప్రాజెక్ట్ ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ఉమ్మడి హైకోర్టుకు నివేదించింది. వాస్తవ పరిస్థితులను సరిపోల్చుకొని గృహాలకు పరిహారం చెల్లిస్తున్నామని తెలిపింది. గ్రామాల్లో లేని వ్యక్తులు శిథిలావస్థకు చేరిన ఇండ్లకు పరిహారం పెంచాలంటూ హైకోర్టుకు వచ్చారని నివేదించింది. మిడ్‌మానేరు ముంపులో ఉన్న తమ ఇండ్లకు తగిన పరిహారం చెల్లించకుండానే ఖాళీ చేయమంటూ తహసీల్దార్ నోటీసులు జారీచేశారంటూ వేములవాడ మండలం కొండుముంజ, నీలోజిపల్లి గ్రామాలకు చెందిన 46 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రామలింగేశ్వర్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ ఇండ్ల విలువను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తగ్గించారని నివేదించారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది విభేదిస్తూ పరిహారం కోసం విలువను ఎక్కువ చేసి చూపుతున్నట్టు విజిలెన్స్ నివేదికలు ఉన్నాయని నివేదించారు. పరిహారం కోరుతున్నవారి లెక్కలు, వాస్తవంగా గ్రామాల్లో ఉంటున్నవారి వివరాలు, కుటుంబ వివరాలు పోల్చిచూస్తే తేడాలు వస్తున్నాయని తెలిపారు. పరిహారంపై అభ్యంతరాలుంటే భూసేకరణ అధికారికి తెలుపుకునేందుకు ఈ నెల 9 వరకూ అవకాశముందని తెలిపారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 9వ తేదీన భూసేకరణ అధికారి వద్ద అభ్యంతరాలు తెలుపుకోవాలని, ఆ తర్వాత అభ్యంతరాలుంటే తమదృష్టికి తేవాలని పిటిషనర్లకు సూచిస్తూ విచారణను ఈ నెల 11వ తేదీకి వేసింది.

## 100% డిజిటల్ విలేజ్ @ గుజ్జ

### టిటాకు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, జయేశ్‌రంజన్ ప్రశంసలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని గుజ్జ గ్రామాన్ని వందశాతం సాంకేతిక అక్షరాస్యత పల్లెగా నిలిపిన టిటా(తెలంగాణ ఐటీ అసోసియేషన్)ను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ అభినందించారు. డిజిటల్ అక్షరాస్యతను సాధించిన తీరు అభినందనీయమన్నారు. గుజ్జను గ్రామానికే చెందిన ఎన్నారై రాంబాబు మంచికంటి దత్తత తీసుకున్నాక టిటా వలంటీర్లు గ్రామస్థులకు డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలోఉత్తీర్ణులయినవారికి శనివారం హైదరాబాద్‌లో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పత్రాలు అందజేశారు. తాను దత్తత తీసుకున్న సర్వేల్ గ్రామాన్ని కూడా డిజిటల్ విలేజ్‌గా మార్చాలని టిటా బృందాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కోరారు. గ్రామీణులు సాంకేతిక అక్షరాస్యతను అందిపుచ్చుకోగలుగడం అభివృద్ధికి చిహ్నంగా నిలుస్తుందని భావించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు టిటా వ్యవస్థాపకుడు, గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల వివరించారు. ఈ సందర్భంగా ఎన్నారై రాంబాబు తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో టిటా ఉపాధ్యక్షుడు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి అశ్విన్‌చంద్ర, సంయుక్త కార్యదర్శి విశ్వక్ లక్కిరెడ్డి, సమన్వయ కార్యదర్శి ప్రవీణ్ మడిపోజు తదితరులు పాల్గొన్నారు.

## వెటర్నరీ అసిస్టెంట్ ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పశుసంవర్ధకశాఖలోని వెటర్నరీ అసిస్టెంట్ల కొలువుల భర్తీకి జూన్ 23న నిర్వహించిన రాతపరీక్ష ప్రాథమిక 'కీ'ని తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 8 నుంచి 16 వరకు 'కీ'పై అభ్యంతరాలు స్వీకరిస్తామని, ఆ తదుపరి వచ్చినవాటిని పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది.

## మెరిట్ స్కాలర్‌షిప్‌లకు అక్టోబర్ 31 గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ప్రతిభావంతులైన విద్యార్థులకు అందిస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్పులకు అక్టోబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్ పూర్తిచేసిన (ద్వితీయ సంవత్సరంలో ప్రతిభచూపిన) విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుందని ఇంటర్‌బోర్డు సెక్రటరీ ఏ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు (scholarships.gov.in) వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 2015-16, 2016-17 బ్యాచ్‌లవారు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

# జయశంకర్ కలలు సాకారం

- సీఎం కేసీఆర్ సారథ్యంలో బంగారు తెలంగాణ: వీ ప్రకాశ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సార్ కలలను సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బంగారు తెలంగాణను నిర్మిస్తున్నారని జలవనరుల యాజమాన్య సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్ కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన జయశంకర్ 83వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాలను ప్రశ్నించి ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని చెప్పారు. స్వరాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామికం రంగాల్లో రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని, 17 శాతానికిపైగా వృద్ధి సాధించడమే నిదర్శనమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ ఉమ్మడిరాష్ట్రంలో వర్సిటీలో తెలంగాణ ప్రాంతానికి రూ.14కోట్ల బడ్జెట్ ఉండేదని, స్వరాష్ట్రంలో రూ.320 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయని చెప్పారు. వ్యవసాయశాఖలో 1400 పోస్టులను భర్తీ అయ్యాయని, మరో 500 పోస్టుల భర్తీకి అనుమతి లభించిందని వెల్లడించారు. 242 పోస్టుల భర్తీకి వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. హైకోర్టు న్యాయవాది గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రూపొందించిన తెలంగాణ పితామహ స్ఫూర్తిగీతాల సీడీ, వీ ప్రకాశ్ రచించిన తెలంగాణ మూవ్‌మెంట్స్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్ సుధీర్‌కుమార్, పాలకమండలి సభ్యులు మనోహర్‌రావు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జే సత్యనారాయణ పాల్గొన్నారు.



శనివారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీ ప్రకాశ్. చిత్రంలో వీసీ ప్రవీణ్‌రావు ఉన్నారు.

# సింగరేణిలోనూ సౌర విద్యుత్!

- టీఎస్‌ఆర్‌ఈడీసీఎల్ అధికారులతో సీఎండీ శ్రీధర్ సమీక్ష
- 50 లేదా 100 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుపై ఆసక్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సౌర విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పాలన్న ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సింగరేణి ఆధ్వర్యంలో కూడా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఆలోచిస్తున్నామని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. సౌరవిద్యుత్ అవకాశాలపై శనివారం సింగరేణి భవన్‌లో అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌ఆర్‌ఈడీసీఎల్) అధికారులు సింగరేణిలో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 15 నుంచి 100 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుపై పలు అంశాలను వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని సౌరవిద్యుత్ ప్లాంట్లు, పనితీరు, ప్రయోజనం, ఆదాయవ్యయాలను టీఎస్‌ఆర్‌ఈడీసీఎల్ వైస్ చైర్మన్, ఎండీ సుధాకర్, మేనేజర్ ఆర్ సునీల్‌కుమార్ వివరించారు. సౌర విద్యుత్‌ప్లాంట్లకు సాంకేతిక విడిభాగాలు తయారుచేసే బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులు కూడా ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్లాంట్ల ఏర్పాటుకు పట్టే సమయం, ఖర్చును వివరించారు. తర్వాత సింగరేణి విద్యుత్ అధికారులతో సంస్థ సీఎండీ శ్రీధర్ మాట్లాడుతూ సింగరేణిలోని 12 ఏరియాల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు అవకాశాలు ఉన్నచోట 50 లేదా లేదా 100 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుపై సమగ్ర నివేదిక అందించాలని కోరారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్‌ప్రాజెక్టు 95 నుంచి 100 శాతం పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధించడంపై హర్షం వ్యక్తంచేశారు. ఇకపైనా ఇదే ఒరవడి కొనసాగించాలని కోరారు. ఇప్పటివరకు 7,255 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిచేయగా, 6,757 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్రానికి అందించినట్టు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) ఎస్ శంకర్, కోఆర్డినేటింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఈడీ సంజయ్‌సూర్, జీఎం(ఎస్టీపీపీ) రాజేశ్, చీఫ్ ఓఅండ్‌ఎం జేఎన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.




చెత్తకుప్పలతో మేడ్చల్ జిల్లా దూలపల్లి పారిశ్రామిక ప్రాంతం (ఫైల్)




ప్రస్తుతం హరితవనంగా మారిన దూలపల్లి పారిశ్రామిక ప్రాంతం

## నాడు చెత్తమయం..
# నేడు హరితవనం

### మారిన దూలపల్లి పారిశ్రామిక ప్రాంత ముఖచిత్రం.. అధికారులకు మంత్రి కేటీఆర్ ప్రశంస

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చెత్తకుప్పలతో అమ్మో అనేలా ఉన్న ప్రాంతాలు హరితమయంగా మారుతున్నాయి. అటు వైపు ముఖం తిప్పాలంటేనే జంకే జనం.. నేడు అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతున్నారు. నగరాలు, పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో డంపింగ్ యార్డులను హరితవనాలుగా తీర్చిదిద్దే బృహత్ ప్రక్రియ ప్రారంభమయింది. ఈ క్రమంలోనే మేడ్చల్ జిల్లా పరిధిలో ఉన్న దూలపల్లి పారిశ్రామిక ప్రాంతం పచ్చని తివాచీ పరిచినట్టుగా మారిపోయింది. ఇందుకు కృషిచేసిన అటవీశాఖ అధికారులు.. పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు నుంచి శనివారం ప్రశంసలు అందుకున్నారు. నగరంలోని మరిన్ని చెత్త డంపింగ్ యార్డులను సైతం హరితవనాలుగా మార్చేందుకు అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం మేడ్చల్ పరిధిలోకి వచ్చే దూలపల్లిలో దాదాపు 25 ఎకరాల్లో ఉన్న డంపింగ్ యార్డు వల్ల కాలనీ ప్రజలు ఇబ్బందిపడేవారు. చెత్తకుప్పలతో నిండి, మురుగుపారుతూ అధ్వానంగా ఉండేది. ఈ ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులు నిర్ణయించి చుట్టూ గోడ నిర్మించారు. స్థలాన్ని శుభ్రం చేసి మొక్కలను నాటి సంరక్షించారు. ఇప్పుడు ఆ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతున్నది. అందులో నాలుగు కిలోమీటర్లలో వాకింగ్‌ట్రాక్, చిన్నారుల కోసం ఆటస్థలాన్ని అభివృద్ధి పర్చారు. బెంచీలను ఏర్పాటు చేశారు. నేచర్‌క్యాంపునకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం రోజూ ఐదువందల మంది వాకర్లు వస్తున్నారు. మేడ్చల్‌లోని కండ్లకోయలో దాదాపు 75 ఎకరాలను అటవీశాఖ అధికారులు హరితవనంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో వాకింగ్‌ట్రాక్‌తోపాటు మరిన్ని సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నారు. నెలాఖరులోగా పూర్తిచేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ తెలిపారు. ఈసీఐఎల్ నాగారంలోని 25 ఎకరాల్లో మరో ప్రకృతివనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మరిన్ని డంపింగ్‌యార్డులను ప్రకృతివనాలుగా తీర్చిదిద్దడానికి సీడీఎంఏ ముమ్మరంగా ప్రయత్నిస్తున్నది.










నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం, 6 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM

# సారు ఆశించిన సుపరిపాలన ఇదే

యాది



వి. ప్రకాశ్

తెలంగాణ మార్గదర్శి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 83వ జయంతిని నేడు రాష్ట్ర ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. విద్యార్థి దశ నుంచి ఆఖరి శ్వాస దాకా జయశంకర్ తెలంగాణే ధ్యాసగా జీవించారు. 1952 లో 'నాన్-ముల్కీ గోబ్యాక్' ఉద్యమం నుంచి 2010-11 లలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆందోళనల వరకు, ఫజల్ అలీ ఆధ్వర్యంలోని రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (1954) నుంచి శ్రీకృష్ణ కమిటీ (2010) వరకు, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్ వరకు, కొండా వెంకటరంగారెడ్డి నుంచి మన ప్రియతమ నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వరకు నాలుగు తరాల నేతలతో కలిసి తెలంగాణ కోసం పనిచేశారు. ప్రతీ కమిషన్, కమిటీ ముందు ఎంతో సమర్థవంతంగా తెలంగాణ ప్రజల మనోభావాలను గణాంకాల ఆధారాలతో వివరించారు.

ఎప్పటి కప్పుడు నేతలకు అవసరమైన సలహాలు, సూచనలిస్తూ, ఉద్యమ దిశను నిర్దేశిస్తూ తెలంగాణ మార్గదర్శిగా నిలిచారు ప్రొఫెసర్ జయశంకర్. ఆయన ఈ లోకాన్ని వీడి అప్పుడే ఆరేళ్ళు దాటినా ఇప్పటికీ మన మధ్యే ఉన్నట్లు జ్ఞాపకాలు మన వెన్నంటే ఉన్నాయి. ఎవరు చూసినా చూడకున్నా మరికొద్ది కాలంలోనే సాక్షాత్కరించబోయే తెలంగాణ రాష్ట్రాన్ని తాను కళ్ళారా చూస్తానని, బంగారు తెలంగాణ నిర్మాణంలో తాను చురుగ్గా పాల్గొంటానని జయశంకర్ సన్నిహితులతో అనేవారు. అంతలోనే క్యాన్సర్ ఆయనను మన నుంచి దూరం చేసింది. జయశంకర్ తెలంగాణ మహోదయాన్ని కళ్ళారా చూడలేకపోయినా, ఆయన ఆశయాలకు ప్రతిరూపంగానే బంగారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో నిర్మించబడుతున్నది. తెలంగాణ ప్రజలు సుమారు ఆరు దశాబ్దాలుగా ఏ లక్ష్యాల కోసం స్వయం పాలనను కోరుకున్నారో అవే లక్ష్యాలను గత మూడేళ్ళుగా కేసీఆర్ అమలు చేస్తున్నారు. కె.వి. రంగారెడ్డి ఆశించిన రాజకీయార్థిక సంస్కరణలు, కొండాలక్ష్మణ్ బాపూజీ స్వప్నించిన బడుగు బలహీనవర్గాల ఆర్థిక వికాసం, ప్రజాకవి కాళోజీ తపించిన సామాన్యపౌరుని హక్కులు, జయశంకర్ ఆశించిన ఆత్మగౌరవంతో కూడిన స్వయంపాలన కేసీఆర్ సారథ్యంలో విజయవంతంగా అమలు జరుగుతున్నాయి. 1997-2000 సంవత్సరాలలో వేలాదిగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు ప్రొఫెసర్ జయశంకర్ ఎంతో కలత చెందారు. చరిత్రలో ఏనాడు బలవన్మరణాలకు పాల్పడే దౌర్భాగ్యస్థితి తెలంగాణ రైతులకు రాలేదని బాధపడేవారు. 'సీమాంధ్రకు అక్రమంగా తరలించబడుతున్న కృష్ణా, గోదావరి నదుల నీళ్ళు తెలంగాణ పొలాలకు మలిపిన నాడు ఈ ప్రాంత రైతులు ఆత్మహత్యలకు పాల్పడాల్సిన అవసరం ఉండదు అని జయశంకర్ పలు ప్రసంగాల్లో అనేవారు. గత మూడేళ్ళుగా సాగునీటి రంగంలో కేసీఆర్ అనుసరిస్తున్న త్రిముఖ వ్యూహం ద్వారా జయశంకర్ స్వప్నం నిజం కాబోతున్నది. పాత ప్రాజెక్టులకు పూర్వ వైభవం తీసుకువచ్చి వాటి చరిత్రను మార్చడం, పెండింగ్ ప్రాజెక్టులకు అవసరమైన చోట రీ-డిజైనింగ్, రీ-స్ట్రక్చరింగ్ చేసి త్వరితగతిన పూర్తి చేయడం, అవసరమైన దగ్గర, అవకాశమున్న ప్రాంతంలో కొత్త ప్రాజెక్టులను, రిజర్వాయర్లను నిర్మించడం త్రిముఖ వ్యూహంలో భాగమే. మిషన్ కాకతీయ, శ్రీరాం సాగర్ పునరుజ్జీవం, కాళేశ్వరం రీ-డిజైనింగ్, డిండి, పాలమూరు-రంగారెడ్డి పథకాలు.

2014 ఎన్నికల ప్రణాళికలో టీఆర్ఎస్ హామీ ఇచ్చినట్లుగానే ప్రతి నియోజక వర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరివ్వడానికి శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నది. పరిశ్రమల్లో మూడు షిఫ్టుల పని విధానాన్ని చూశాం. కానీ సాగునీటి ప్రాజెక్టుల దగ్గర మూడు షిఫ్టులలో 24x 7 పనులు జరుగడం తెలంగాణలో మాత్రమే చూస్తున్నాం. కోటి ఎకరాలకు సాగునీరందించాలనే కేసీఆర్ స్వప్నాన్ని రాబోయే రెండు, మూడేళ్ళలో మంత్రి హరీశ్‌రావు, వేలాది ఇంజినీర్లు, సిబ్బంది నిజం చేయబోతున్నారు. 1998లో వాగుల్లో నిల్వవున్న కలుషితమైన నీళ్ళు తాగిన సుమారు 2500 మంది ఆదిలాబాద్ ఆదివాసీలు కలరా బారిన పడి మరణించడం జయశంకర్‌చే కన్నీళ్ళు పెట్టించింది. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రక్షిత మంచినీటి పథకాలపై వేల కోట్లు ఖర్చు చేసినా ఆదివాసీ గిరిజనులు కలరా, అతిసారా, అంటువ్యాధుల బారిన పడి మరణిస్తూనే ఉన్నారు. ఈ ఉపద్రవాన్ని శాశ్వతంగా రూపుమాపే ప్రయత్నమే మిషన్ భగీరథ. పల్లెలు, తండాలు, ఆదివాసీ గూడాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అతి త్వరలో అందుబాటులోకి రానున్నది. మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన 1996-2001 మధ్య కాలంలో వేలాది మంది తెలంగాణ యువతీ యువకులను నక్సలైట్ ముద్ర వేసి బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపడం, నెలల తరబడి రహస్య ప్రదేశాల్లో లాకప్‌లలో చిత్రహింసలకు గురి చేయడం, తప్పుడు కేసులు బనాయించి ఏళ్ళతరబడి బెయిల్ రాకుండా చేసి జైళ్ళలో నిర్బంధించడం, 'నక్సలైట్ల'కు సహాయం చేస్తున్నారని గిరిజన గూడాలను కాలబెట్టడం, పోలీసుల ఇనుప బూట్ల చప్పుళ్ళతో భయం భయంగా పల్లెలు నిద్ర లేవడం వంటి ఘటనలు జయశంకర్‌ను తీవ్రమైన మానసికక్షోభకు గురి చేసినవి. సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్. ఆర్. శంకరన్ వంటి పెద్దలతో కలిసి కన్సర్న్ సిటిజన్ కమిటీ తరపున రాజ్యహింసను ప్రశ్నించారు. ఇరువైపులా శాంతిని నెలకొల్పడానికి కృషి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడేళ్ళలో (ఒకే ఒక్క 'ఎన్‌కౌంటర్' సంఘటన తప్ప) ప్రశాంత పరిస్థితి నెలకొన్నది. పోలీసు వ్యవస్థను సమూలంగా మార్చాలన్న కేసీఆర్ ఆశయం ఆచరణ రూపం దాల్చింది. ఆవేశంతో అడవి బాట పట్టుతున్న వారెందరినో పోలీసులు



పట్టుకొని కౌన్సిలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాన్నిస్తుండటంతో అడవి బాట పట్టాల్సిన అవసరం యువతకు కలుగడం లేదు.

ఆర్థిక శాస్త్రాన్ని అధ్యయనం చేసి బోధించిన ప్రొఫెసర్ జయశంకర్ అణగారిన వర్గాలకు అభివృద్ధిలో వాటా లభించాలనేవారు. ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు అణగారినవర్గాల ఆర్థిక వికాసానికి ఎంతో దోహదపడుతున్నాయి. నేత కార్మికులకు చేయూత, సబ్సిడీపై 21 గొర్రెలు, ఉచితంగా చేప పిల్లలను చెరువుల్లో వదలడం, కల్లు దుకాణాలు తెరవడం, ఈత, తాటి చెట్ల పెంపకం, వ్యవసాయానికి పెద్దపీట, రైతు రుణాల మాఫీ, దళితులకు మూడు ఎకరాల భూమి, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రగతి నిధి, విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, పారిశ్రామికవేత్తలకు రాయితీలిచ్చే టీఎస్ ప్రైడ్, వృద్ధుల, వితంతువుల, వికలాంగుల పెన్షన్ల పెంపు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కేసీఆర్ కిట్లు, ఆరోగ్య లక్ష్మి, దీపం పథకం, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులకు అడుగకుండానే జీతాల పెంపు, తెలంగాణ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్, వెల్‌నెస్ సెంటర్లు, జర్నలిస్టుల, న్యాయవాదుల సంక్షేమనిధి, ఎం.బి.సి కార్పొరేషన్ ఏర్పాటు, మైనారిటీల సంక్షేమం, 200 లకు పైగా మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీలు, పారిశ్రామిక వేత్తల కోసం టీఎస్ ప్రైమ్, 12 శాతం రిజర్వేషన్ల అమలుకై కృషి యాభైశాతం సబ్సిడీపై ఆటోలు ఇలా సుమారు రెండు వందలకు పైగా సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నది కేసీఆర్ ప్రభుత్వం. 'చదువుకు పరమార్థం ఉద్యోగం' అని ఏనాడు జయశంకర్ భావించలేదు. తెలంగాణలోని సుమారు కోటి కుటుంబాల్లో కుటుంబానికొక్కరైనా చదివి ఉద్యోగాన్వేషణలో ఉన్నవారో, లేక భవిష్యత్తులో ఉద్యోగాన్ని పొందాలనే తలంపుతో చదువుకుంటున్న వారో ఉన్నారు. వీరందరికీ ఉద్యోగాల కల్పన అనేది అసాధ్యం. ఎవరి సామర్థ్యానికి తగినట్లు వారు స్వయం ఉపాధి కల్పన చేసుకోవాలి. ఏ దేశంలోనైనా జనాభాలో ఒక్క శాతానికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయి. తెలంగాణలోని వివిధ శాఖల్లో వున్న సుమారు లక్ష ఉద్యోగాల ఖాళీలను ఈ ఐదేళ్ళలో పూర్తి చేస్తామని కేసీఆర్ శాసనసభలో ప్రకటించారు. ఈ దిశలో ఇప్పటికే వేలాది ఉద్యోగాలు భర్తీ అయి మరెన్నో నోటిఫికేషన్ల దశలో ఉన్నాయి. 'టీఎస్ఐపాస్' వంటి విధానాలను అనుసరించడం ద్వారా వేలాది పరిశ్రమలు హైదరాబాద్, తెలంగాణ జిల్లాల్లో ఏర్పాటవుతున్నవి. ఐటీ రంగంపై మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టడం వలన వేలాదిమందికి పరిశ్రమల్లో ఐటీ రంగంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తున్నవి. ఒకప్పటి కల్లోలిత ప్రాంతాల్లో తీవ్రవాద ప్రభావిత గ్రామాల్లోని యువకులు ప్రభుత్వ సహకారం పొందుతూ వ్యవసాయాన్నే జీవనాధారంగా చేసుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కొందరు విదేశీ ఉద్యోగాలు వదిలి ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేపట్టుతూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అంధకారంలో మగ్గుతుందనుకున్న తెలంగాణను అనతి కాలంలోనే పవర్‌కట్ లులేని రాష్ట్రంగా మార్చడం, గత రెండేళ్ళుగా సుమారు 19 శాతం ఆర్థిక ప్రగతిని సాధించి దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలుపడం ముఖ్యమంత్రి కేసీఆర్ సమర్థతకు నిదర్శనం. కొత్తరూపును సంతరించుకుంటున్న తెలంగాణ వర్తమానం, భవిష్యత్తు చిత్రపటాన్ని కనులారా వీక్షించి ఉంటే జయశంకర్ సారు ఎంతో ఆనందించి ఉండేవారో!

**అంధకారంలో మగ్గుతుందనుకున్న తెలంగాణను అనతి కాలంలోనే పవర్‌కట్ లులేని రాష్ట్రంగా మార్చడం, గత రెండేళ్ళుగా సుమా రు 19 శాతం ఆర్థిక ప్రగతిని సాధించి దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలుపడం ముఖ్యమం త్రి కేసీఆర్ సమర్థతకు నిదర్శనం. కొత్తరూపును సంతరించుకుంటున్న తెలంగాణ వర్తమానం, భవిష్యత్తు చిత్రపటాన్ని కనులారా వీక్షించి ఉంటే జయశంకర్ సారు ఎంతో ఆనందించి ఉండేవారో!**

(రచయిత: తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్)

*(నేడు ప్రొఫెసర్ జయశంకర్ సారు జయంతి)*

# చేనేతకు పూర్వ వైభవం

సామాజికం



డాక్టర్ చిక్కాదేవదాసు

తెలంగాణ చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉన్నది. అగ్గిపెట్టెలో ఆరు గజాల చీరను ప్రపంచానికి అందించిన ఘనత తెలంగాణకు దక్కింది. కుట్టు లేని అంగీలు, కటింగు లేని గాంధీ టోపీలు, స్వాతంత్ర్య పోరాటానికి అందించిన గొప్పతనం తెలంగాణ నేతన్నది. పోచంపల్లి, 'టై అండ్ డై' రకం వస్త్రాలు, పట్టు చీరలు, గద్వాల్ చీరలు, నారాయణపేట చీరలు,సిద్దిపేటలోని గొల్లభామ చీరలు, దుబ్బాక, కరీంనగర్ టవల్స్, బెడ్‌షీట్స్, లుంగీలు, దోతులు, టస్సర్ పట్టు చీరలు, వరంగల్ జిల్లా డర్రీలు, చత్రంజీలు మొదలైన వస్త్రాలు గ్రామాలు, ప్రాంతాల పేరుతో ప్రసిద్ధి చెందినవి. హైదరాబాద్, ఢిల్లీ, కలకత్తా, చెన్నై బెంగళూరు, ముంబైలతో పాటు అమెరికా, లండన్, బ్రిటన్ వంటి దేశాలకు కూడా మన రాష్ట్రం నుంచి చేనేత వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయి.

లక్షలాది చేనేత కార్మికులకు జీవాధారమైన చేనేత రంగాన్ని గత ప్రభుత్వాలు, పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ప్రతిసారి ఎన్నికలప్పుడే చేనేతకు చేయూతనిస్తామని మాటలతో మోసం చేసి ఓట్లు, సీట్లు దండుకొనేవారు. ఆ తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేసిన దాఖలాలు లేవు. బడ్జెట్లో చేనేత రంగానికి నిధులు కేటాయించకపోవడం, చేనేత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం వల్ల ఎందరో చేనేత కార్మికులు చేతినిండ పని దొరకక వీధిన పడి ఆకలి చావులు, ఆత్మహత్యలకు గురయ్యారు.

సీమాంధ్ర పాలకుల అలసత్వం, అవినీతి, వివక్షతో చేనేత రంగం సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నది. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహకాలు అందకపోవడం వల్ల మహారాష్ట్రంలోని షోలాపూర్, భీమండి, ముంబై, గుజరాత్‌లోని సూరత్ నగరాలకు చేనేత కార్మికులు వలసపోయారు. ఫలితంగా ఇక్కడ ఉన్న చేనేత కార్మికులకు చేతి నిండ పని దొరుకక, నేసిన బట్టకు గిట్టుబాటు ధర రాక, ఆకలి చావులు, ఆత్మహత్యలతో చేనేత పరిశ్రమ క్షీణించింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేనేత రంగానికి పూర్తి స్థాయిలో అండగా నిలువాలని ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశ పెడుతున్నది. చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు సమగ్ర విధానం ప్రకటించింది. చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడకుండా వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృతనిశ్చయంతో ఉన్నది. చేనేత కార్మికులకు నెలకు 15 వేలకు తక్కువ కాకుండా వేతనం వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

చేనేత కార్మికులకు నూలు సబ్సిడీ ఇస్తారు. కానీ చాలామంది కార్మికుల దగ్గర సబ్సిడీ కార్డులు లేవు. అవి దళారుల వద్ద, ఆధిపత్యం చలాయిస్తున్న కొందరు మాస్టర్ వీవర్స్ వద్ద ఉన్నాయి. వీటికి చెక్ పెట్టాలి. అర్హులకే నేరుగా కార్డులు ఇవ్వాలి. తెలంగాణ ఉద్యమ కాలంలో చేనేత కార్మికుల దైన్యాన్ని కండ్లారా చూసి చలించిన కేసీఆర్ ఆనాడే పోచంపల్లి, సిరిసిల్ల చేనేత కార్మికుల ఆకలి చావులను ఆదుకున్న ఆపద్బాంధవుడు.

చేనేత రంగానికి ఏదో కంటితుడుపు చర్యలు కాకుండా చేనేత కార్మికుల సమస్యలకు ఒక శాశ్వత సమగ్ర పరిష్కారం చూపెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదలగా ఉండటం అభినందనీయం. అంతేగాకుండా చేనేత మగ్గాల వారికి నూలు, రసాయనాలకు సబ్సిడీలు అందించడంతో పాటు నేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలన్నిటిని ప్రభుత్వమే కొనుగోలు చేయటం ఎంతో మేలు చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమయ్యే దుస్తులను, హాస్టళ్ళలోకి దుప్పట్లు, ఇతర యూనిఫారాలు తదితర అన్ని వస్త్రాలను తెలంగాణ నేత కార్మికులు ఉత్పత్తి చేసేవే వాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల చేనేత మగ్గాలకు, మర మగ్గాలకు గిరాకీ ఏర్పడి వారికి చేతినిండా పని దొరుకుతుంది. ఈ విధంగా చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో ప్రభుత్వం కృషి చేయటం ఎంతో అభినందనీయం.

చేనేతరంగం రూపురేఖలు మార్చటానికి త్రిముఖ వ్యూహం రచిస్తున్న కేసీఆర్ ఏ పథకానికి శ్రీకారం చుట్టినా అది వినూత్నంగా ఉపయుక్తంగా ఉంటున్నది. థ్రిఫ్ట్ పథకానికి 75కోట్లు కేటాయించి, ఒక వంతు చేనేత కార్మికులు చెల్లిస్తే, మిగతా సొమ్మును ప్రభుత్వమే కార్మికుని ఖాతాలో జమచేయటంతో పాటు, మునుపెన్నడూ లేని విధంగా ఈ రంగానికి ఈ ఏడాది బడ్జెట్‌లో 1283కోట్లు కేటాయించటం చేనేత రంగానికి శుభ సూచకం.

అలాగే రాష్ట్రంలో చేనేత కార్మికుల స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహించడం ప్రతిమగ్గానికి జియో ట్యాగింగ్ చేయడం చాలా మంచిది. కానీ, మగ్గం నేసే చేనేత కార్మికుడిని ఒక్కడినే లెక్కల్లో తీసుకోకుండ దీనికి అనుబంధంగా ఉన్న రంగుల అద్దకం, కండెలు చుట్టడం, ఆసు పోయడం, చిటికీలు కట్టడం తదితర వృత్తులలో ఉన్న వారందరినీ లెక్కలోకి తీసుకొని న్యాయం చేయాలి. చేనేత సహకార రంగంలో ఎంత మంది శ్రామికులు పని చేస్తున్నారు, సహకారేతర రంగం (మాస్టర్ వీవర్స్ వద్ద, స్వతంత్రంగా నేసేవారు) ఎంతమంది ఉన్నారో నిర్దిష్టంగా లెక్కలు తేల్చి వారి అభ్యున్నతి కోసం కృషి చేయాలి.

ఆధునికీకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే చేనేత విధానం ఉండాలి. మార్కెటింగ్‌ను అంచనా వేసి, డిమాండుకు తగ్గ ఉత్పత్తులను అందించాలి. సంప్రదాయ మగ్గాలను ఆధునీకరించాలి. తెలంగాణ చేనేత ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో కొత్త, పాతల మేలు కలయికగా కంచి పట్టు చీరలకు దీటుగా వచ్చిన తెలంగాణ పద్మాంజలి పట్టుచీరలను ప్రోత్సహించాలి. టెస్కో, లెనిన్ విభిన్నరకాలైన ఉత్పత్తులను సొసైటీల ద్వారా నేస్తే మార్కెటింగ్‌కు ఇబ్బంది ఉండదు. కార్మికులకు రోజూ పని దొరికేటట్టు ప్రొక్యూర్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలి.

తెలంగాణ బ్రాండ్ పితాంబరి పూర్వం బంగారం కన్నా విలువైన చీరలుగా హోదాకు చిహ్నంగా ఉండేవి. తెలంగాణ చేనేత కార్మికులు సృష్టించిన అనేక అద్భుతాలలో పీతాంబరం చీరలు ఒకటి. పూర్వం సిద్దిపేట, ఆమనగల్లు, కొలుకులపల్లి ప్రాంతాలలో ఈ చీరలు నేసేవాళ్ళు. టెస్కో పీతాంబరం స్ఫూర్తిగా పీతాంబరి బ్రాండ్‌ను మార్కెట్లో తీసుకెళ్లి యువతరానికి నచ్చేలా సంప్రదాయంలోనే ఆధునికతను జోడించాలి.

జమ్దాని, పీతాంబరి, తెలంగాణ పద్మాంజలి, కంచిపట్టు, రాజస్థాని కోట, ఉప్పాడ, లెనిన్ లాంటి చీరలు నేసే నైపుణ్యాలున్న కార్మికులు అంతా మాస్టర్ వీవర్స్ చేతి కింద ఉన్నారు. పెట్టుబడి సమకూర్చితే వీరు ఏరకం ఉత్పత్తులనైనా నేయడంలో కళా నైపుణ్యంగలవారు. ఈ చీరలకు జాతీయ మార్కెట్లో మంచి గిరాకీ ఉన్నది. దీంతో కొత్త తరం మాస్టర్ వీవర్స్ మార్కెట్లోకి వస్తారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహించాలి. చేనేత పరిశ్రమను వారసత్వ సంపదగా కాపాడాలి. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగులు వేసి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలి. చేనేతకు పూర్వ వైభవం తెస్తున్న తీరు చరిత్రాత్మకం.

**చేనేత పరిశ్రమను వారసత్వ సంపదగా కాపాడాలి. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగులు వేసి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలి. చేనేతకు పూర్వ వైభవం తెస్తున్న తీరు చరిత్రాత్మకం.**


(రచయిత: జాతీయ అధ్యక్షులు, చేనేత వర్గాల చైతన్య వేదిక )

*(ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా)*



ఆసియా ఖండంలో వేల ఏళ్లుగా నెలకొని ఉన్న చర్చ, వాగ్వాద సంప్రదాయమే ఇవ్వాళ ప్రపంచం ఎదుర్కొంటున్న ఉగ్రవాదం, వాతావరణ సమస్యలకు పరిష్కారం చెబుతుంది.

**నరేంద్రమోదీ**



నవాజ్ షరీఫ్ పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యానికి ప్రతీకగా ఖ్యాతిగాంచారు. అందుకోసమే అతనిపై ప్రజాస్వామ్య వ్యతిరేకులంతా 1993నుంచి కత్తిగట్టారు. ఇప్పుడు షరీఫ్‌ను పదవి నుంచి తప్పించటం కూడా అందులో భాగమే.

**శేఖర్ గుప్తా**



ప్రభుత్వం అక్టోబర్ ఒకటి నుంచి చావుకు కూడా ఆధార్‌ను తప్పని సరి చేసింది! ఇవ్వాళ.. మనిషి బతుకులోనూ, చావులోనూ ఆధార్ నుంచి తప్పించుకునే స్థితి లేదు!!

**రాజ్‌దీప్ సర్దేశాయ్**



కశ్మీర్ సమస్యను చర్చించాలనుకున్న యశ్వంత్‌సిన్హాను ప్రధాని మోదీ కలువటానికే నిరాకరించారు! తన పార్టీ సీనియర్ సహచరులనే కలువటానికి తిరస్కరించిన మోదీ, కశ్మీర్ సమస్యను చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరిస్తారట!!

**రామచంద్రగుహ**

# కాంగ్రెస్‌తో కాస్త జాగ్రత్త!

పాయింట్ బ్లాంక్

- సవాల్ రెడ్డి

ఎనభయ్యవ దశకంలో టీడీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నిజాంకాలేజీలో గ్రౌండ్‌లో భారీ సభ ఒకటి జరిగింది. కిటకిటలాడుతున్న జనం మధ్య సభా ప్రాంగణంలోకి టీడీపీ నేతలతో కలిసి వచ్చిన ఓ వ్యక్తి అందర్నీ ఆకర్షించాడు. అచ్చు చంబల్‌లోయలోని బందిపోటులా తలకు పాగా చుట్టుకుని భుజం మీది నుంచి నడుము వరకు తూటాల తోలు బెల్టు వేలాడేసుకుని, డబుల్ బ్యారెల్ గన్ ధరించి నడుస్తున్నాడు. నక్సలైట్ల సమస్య అతలాకుతలం చేస్తున్న ఆ సమయంలో తుపాకీ పట్టుకుని వచ్చిన ఆ వ్యక్తిని అంతా వింతగా చూశారు. తెలంగాణ సంస్కృతిలో ఎక్కడాలేని విధంగా దాడులు, హత్యలతో అట్టుడుకుతున్న ఓ ఫ్యాక్షన్ గ్రామానికి ఆయన సర్పంచ్. ప్రత్యర్థివర్గానికి చెందిన ఎమ్మెల్యే వర్గం ఏ క్షణాన మట్టుబెడుతుందోనన్నే ప్రాణభయం. స్నానానికి వెళ్లినా పక్కన గన్ లేకుండా ఉండలేని పరిస్థితి. అంగరక్షకుడు ఉన్నా..నమ్మకం లేక తానే గన్ పట్టుకు తిరుగుతున్నాడు. ఆయన గ్రామం బతికేపల్లి.

బతికేపల్లి గ్రామ ప్రజలు ఒక వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అయితే ప్రత్యర్థివర్గం ఆయనను పాలన చేయనివ్వడం లేదు. రెండు వర్గాలకు హోరాహోరీగా యుద్ధవాతావరణం. అధికారులు అడకత్తెరలో పోకలయ్యారు. నియోజకవర్గంలో కూడా అంతే. ప్రత్యర్థి పార్టీల నాయకులు, మద్దతుదారుల వ్యాపారాలమీద దాడులు చేయించి ఆర్థికంగా దెబ్బతీసే విధానాలు. మొత్తంగా తేలిందేమంటే ప్రజలు ఎవరినో ఎన్నుకుంటారు. అంతమాత్రాన వాళ్ల చేతికి పాలన అందదు. రాజకీయాల్లో పాతుకుపోయిన పెత్తందారీశక్తులు పాలన చేయనివ్వవు.

1983లో ఎన్టీరామారావు నేతృత్వంలో రాష్ట్రంలో తొలిసారి కాంగ్రేసేతర ప్రభుత్వం ఏర్పడింది. కేంద్రంలో ఇందిర నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కేంద్రం దయాదాక్షిణ్యాల మీద బతికే పరిస్థితి. 1985లో రాష్ట్రానికి కుముద్ బెన్ జోషి గవర్నర్‌గా వచ్చారు. నాడు ఎన్టీఆర్ అంటే రాష్ట్ర రాజకీయాల్లో ఒక మేరు పర్వతం. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ నుంచి మండల ఎన్నికల దాక ఎక్కడా చిరునామా దక్కని స్థితి. అంతటి ఎన్టీఆర్‌కు కుముద్‌బెన్ నిద్ర లేకుండా చేసింది. ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు. ఉన్నతాధికారులంతా గవర్నర్ దగ్గరే అటెండెన్స్ వేసుకునే పరిస్థితి. ప్రభుత్వం పంపే ప్రతి ఫైలుకు కుంటిసాకులతో బ్రేకులు. ప్రభుత్వం ఒకరిని లోకాయుక్తగా ఎంపిక చేసి ఫైలు పంపితే ఆయన మీద విచారణ జరిపించి తిరస్కరించారు. తలకిందులుగా తపస్సు చేసినా ఎన్టీఆర్ ప్రభుత్వం తాను ఎంపిక చేసిన వ్యక్తిని లోకాయుక్తగా నియమించుకోలేకపోయింది. గవర్నర్ పూర్వాశ్రమంలో కాంగ్రెస్ మనిషి. దీంతో రాజ్‌భవన్ కాంగ్రెస్ కార్యాలయంగా మారింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ యాక్షన్ పేరిట వంద స్వచ్ఛంద సంస్థలతో గవర్నర్ మిషన్ పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేసి ఊరూరా సభలు పెట్టారు. ప్రతిచోట వేదికల మీద కాంగ్రెస్ నాయకులే. వెళ్లిన ప్రతిచోటా కార్యక్రమంలో వివిధ పథకాల కింద రుణ వితరణలు. కాంగ్రెస్ నేతలను వేదిక ఎక్కించి మైకులు ఇచ్చేవారు. ఇవిగాక డీఏవీపీ ఆధ్వర్యంలో భారతరత్న ఇందిరమ్మ పేరిట సాంస్కృతిక ప్రదర్శనలు. తమ ప్రతిపక్షపార్టీకి తమ సర్కారు డబ్బుతోనే ప్రచారం జరుగడం టీడీపీకి మింగుడు పడలేదు. రిపబ్లిక్ ఉత్సవాల్లో అనవాయితీగా ప్రస్తావించాల్సిన రాష్ట్ర ప్రగతి కార్యక్రమాల వివరాలను గవర్నర్ తన ప్రసంగం నుంచి తొలిగించారు. కడుపు మండిన ఎన్టీఆర్...'ఆమె తీసుకునే జీతంలో ప్రతిపైసా... ఆఖరుకు పొద్దున తాగే కాఫీ డబ్బు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాదే' అని కటువుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో లేదన్న మాటేగానీ.. వారి గౌరవానికి ఏమాత్రం లోటు ఉండేది కాదు. మాజీ ముఖ్యమంత్రి అంజయ్య మరణం తర్వాత ఆయన పార్థివ దేహం ఎయిర్‌పోర్టుకు వస్తే ఆయన స్థాయికి తగిన ఏర్పాట్లు చేయలేదన్న ఆరోపణ మీద ఆనాటి నగర పోలీస్ కమిషనర్‌కు రాజ్‌భవన్‌లో అక్షింతలు పడ్డాయి. చీఫ్ సెక్రటరీ కూడా బాధితుడయ్యాడు.

ఎన్టీఆర్ ప్రభుత్వానికి నాటి కాంగ్రెస్ పార్టీ కల్పించిన అడ్డంకులు అన్ని ఇన్నీ కావు. నాదెండ్ల ఎపిసోడ్ అందరికీ తెలిసిందే. గవర్నర్ రాంలాల్‌తో నాటకాలు ఆడించి ప్రభుత్వాన్ని కూల్చగలిగారు తప్ప నాదెండ్లను నిలబెట్టలేక పోయారు. ఎన్టీఆర్‌ను ఏ రకంగానూ దెబ్బ కొట్టలేక చివరికి కోస్తాంధ్రలో కులాలను ఎగదోసి నిప్పు రాజేశారు. విజయవాడలో దగ్గరుండి విధ్వం సం సృష్టించారు. కమ్మ, కాపుల మధ్య ఆజన్మ జాతివైరాన్ని సృష్టించారు. ఇందిర, రాజీవ్‌గాంధీ హత్యలు జరిగితే ఇక్కడ దాడులు, గృహదహనాలతో కల్లోలం సృష్టించారు. అబిడ్స్‌లో ఎన్టీఆర్ థియేటర్లకు నిప్పుపెట్టించారు. రంగా హత్యానంతరం విజయవాడలో విధ్వంసం సాగుతుంటే.. ఓ కేంద్రమంత్రి అక్కడే అడ్డావేసి 'మరో వారంపాటు అల్లర్లు కొనసాగిస్తే ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన తెస్తా'.. అంటూ ప్రోత్సహించినట్టు వార్తలు వచ్చాయి.

ఇవిగాక న్యాయస్థానాల ద్వారా కల్పించిన ఇబ్బందులు ప్రత్యేకం. ఎన్టీఆర్ పాలన అంతా కోర్టుల చుట్టూ తిరుగడానికి సరిపోయింది. ప్రభుత్వం ఇలా ఓ జీవో తీయడం ఆలస్యం.. అలా కోర్టుల నుంచి స్టే రావటంగా ఉండేది. పిటిషన్లన్నీ కాంగ్రెస్ పార్టీవే. మండల వ్యవస్థ ఏర్పాటు అంశం కోర్టులోనుంచి బయటకు రావడానికి ఎన్టీఆర్ ప్రభుత్వం చెమటలు కక్కాల్సి వచ్చింది. ఎన్టీఆర్ ఎంతో ముచ్చటపడి సృష్టించిన వ్యవస్థ కర్షకపరిషత్. దాని చైర్మన్ పదవిని ముఖ్యమంత్రి తర్వాత అంత పవర్‌ఫుల్ పోస్టుగా రూపొందించారంటారు. దానికి చంద్రబాబును చైర్మన్‌గా నియమిస్తూ కనీసం మూడుసార్లు జీవోలిచ్చారు. ప్రతిసారీ కోర్టులో కాంగ్రెస్ అడ్డం పడింది. చంద్రబాబు తన జీవితకాలంలో దానికి అధ్యక్షుడు కాలేకపోయారు. అదే జరిగి ఉంటే ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి దింపడం జరిగేదా? చరిత్ర ఎట్లా ఉండేదో! కాంగ్రెస్ నాయకుడు ద్రోణంరాజు సత్యనారాయణ ఎన్టీఆర్‌మీద ఆరోపణలతో కోర్టు కెక్కినందుకు నజరానాగా రాజ్యసభ సీటు దక్కింది. ఇలా న్యాయస్థానాల్లో అనేక ఎదురుదెబ్బలు తిన్న గుణపాఠాలతో కావచ్చు.. ఆ తర్వాత టీడీపీ న్యాయపరమైన అంశాల్లో గణనీయమైన 'నైపుణ్యాన్ని' సంపాదించి రాటుతేలింది.

ఎన్టీఆర్‌ను దెబ్బకొట్టేందుకు ఆయన పార్టీనుంచే దక్షిణ కోస్తాకు చెందిన ఒక నేతను లాగేసి రాష్ట్రమంతా సభలు పెట్టించి అవినీతి ఆరోపణలు చేయించారు. టొబాకో బోర్డు వంటి సంస్థల్లో అడ్డా వేసిన కాంగ్రెస్ జరిపిన రాజకీయం చివరికి టంగుటూరులో పోలీసు కాల్పులకు దారి తీసింది. రాజీవ్‌గాంధీ నెలకోసారి రాష్ట్రంలో పర్యటించి బురద చల్లుతూ పోయేవారు. కారంచేడు, నీరుకొండలకు వరుసకట్టి వచ్చిన గాంధీలు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నారాయణఖేడ్ హాస్టల్‌లో అమ్మాయిల మీద అత్యాచారాలు జరిగినపుడు.. వారిలో14 మంది అమ్మాయిలు గర్భవతులయ్యారన్న ఆరోపణలు గుప్పుమన్నపుడు, చుండూరులో దళితులను క్రూరమృగాల్లా వెంటాడి చంపి కాల్వల్లో విసిరేసిన దారుణ మారణకాండ జరిగినపుడూ కిమ్మనలేదు.

ప్రజలతో ఎన్నికైన సర్పంచ్‌ను గానీ.. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల ను గానీ కాంగ్రెస్ ఏనాడూ పనిచేయనివ్వలేదు. కేంద్రంలో జనతా, జనతాదళ్ ప్రభుత్వాలను కూల్చేసిన దుష్టరాజకీయం కాంగ్రెస్ సొంతం. స్వాతంత్ర్యానంతరం అత్యధిక రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేసిన ఘనత కాంగ్రెస్‌దే. కశ్మీర్ సంక్షోభంలో కూరినా...పంజాబ్ అల్లకల్లోలమై తమ నేతనే బలి తీసుకున్నా ఆ పార్టీ మారలేదు. కాంగ్రెస్‌పార్టీకి ప్రజాస్వామ్యం మీద, ప్రజల తీర్పుల మీద నమ్మకం లేదు. అడ్డదారుల్లో ప్రభుత్వాలను కూల్చివేయడం.. కులమత భేదాలు సృష్టించి రెచ్చగొట్టడం..దుష్ప్రచారాలతో బురద చల్లటం ఇదే కాంగ్రెస్ చరిత్ర. ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నది దానికి కొనసాగింపే. ప్రత్య ర్థి ప్రభుత్వాలను దెబ్బకొట్టడానికి న్యాయస్థానాలనైనా...వీధులనైనా విచ్చలవిడిగా వాడుకోవడానికి కాంగ్రెస్ వెనుకాడదు. ప్రజలు గమనించాల్సింది..ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాల్సింది ఈ విషయంలోనే. తస్మాత్ జాగ్రత్త.

దేవుడు దయతలిచి ఇపుడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. అదొక్కటే కాస్త ఊరట!

**అడ్డదారుల్లో ప్రభుత్వాలను కూల్చివేయడం.. కులమత భేదాలు సృష్టించి రెచ్చగొట్టడం..దుష్ప్రచారాలతో బురద చల్లటం ఇదే కాంగ్రెస్ చరిత్ర. ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నది దానికి కొనసాగింపే. ప్రత్యర్థి ప్రభుత్వాలను దెబ్బకొట్టడానికి న్యాయస్థానాలనైనా...వీధులనైనా విచ్చలవిడిగా వాడుకోవడానికి కాంగ్రెస్ వెనుకాడదు. ప్రజలు గమనించాల్సింది..ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాల్సింది ఈ విషయంలోనే. తస్మాత్ జాగ్రత్త.**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ఉపరాష్ట్రపతిగా గెలిచిన వెంకయ్యకు విజయ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి



ఫలితాల అనంతరం వెంకయ్యను అభినందిస్తున్న ప్రధాని మోదీ



గెలిచిన అనంతరం భార్య ఉష, కుమార్తె దీపా వెంకట్‌తో వెంకయ్య



అక్క కౌసల్యమ్మ నుంచి ఆశీస్సులు అందుకుంటూ..



# 13వ ఉపరాష్ట్రపతిగా
# వెంకయ్య ఘన విజయం

మొదటిపేజీ తరువాయి


చేసిన గోపాలకృష్ణ గాంధీకి 244 ఓట్లు లభించాయి. ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఈ నెల 11న ప్రమాణం చేయనున్నారు. ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ పదవీకాలం ఈ నెల 10వ తేదీతో ముగియనున్నది. ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవటానికి జరిగిన పోలింగ్ శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. మొత్తం 785 మంది ఎంపీలకు గాను 771 మంది ఓటు హక్కు వినియోగించుకోగా వాటిలో 11 ఓట్లు చెల్లలేదు. 14 మంది వివిధ కారణాలతో ఓటు వేయలేకపోయారు. ఉపరాష్ట్రపతి పదవికి 15వసారి ఎన్నికలు జరిగినప్పటికీ ఆ పదవిని అధిష్టిస్తున్న 13వ వ్యక్తి వెంకయ్యనాయుడు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, హమీద్ అన్సారీ రెండేసి పర్యాయాలు ఉపరాష్ట్రపతిగా ఉన్నారు. ఎన్నికల ఫలితం వెలువడగానే ప్రధాని మోదీ సహా, పలువురు కేంద్ర మంత్రులు, తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఎంపీలు వెంకయ్యను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'వెంకయ్యగారు దేశానికి శ్రద్ధ, అంకితభావంగల ఉపరాష్ట్రపతిగా సేవలందిస్తారని, దేశ నిర్మాణం అనే లక్ష్యానికి కట్టుబడి ఉంటారని విశ్వసిస్తున్నాను' అని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వెంకయ్యనాయుడుకు రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, సీఎం కేసీఆర్ అభినందనలు తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవికి మరింత వన్నె తేవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

**మద్దతునిచ్చిన వారందరికీ ధన్యవాదాలు**

'భారత రాజకీయాలలో వ్యవసాయానికి సరైన ప్రాధాన్యం లేదు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నేను ఈ స్థాయికి ఎదుగుతానని ఊహించలేదు' అని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. తనకు మద్దతునిచ్చిన ప్రధానమంత్రికి, పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 'పార్టీలకు అతీతంగా నా అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన ప్రతి ఎంపీకి వినయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని చెప్పారు. 'ఉపరాష్ట్రపతి పదవిని తొలుత రాష్ట్రపతి హస్తాలను పటిష్ఠం చేసేందుకు, తర్వాత రాజ్యసభ గౌరవాన్ని నిలబెట్టేందుకు ఉపయోగిస్తాను' అని పేర్కొన్నారు. 'సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన నేను ఉపరాష్ట్రపతిగా ఎన్నికవడం నాకెంతో గౌరవం. ఇది మన ప్రజాస్వామ్య సౌందర్యం, శక్తికి నిదర్శనం' అని వెంకయ్య ట్వీట్ చేశారు. తనకు ముందున్నవారు నెలకొల్పిన ప్రమాణాలను, రాజ్యాంగాన్ని కాపాడుతానని వాగ్దానం చేశారు.

**మొదటి గంటలోనే ప్రముఖుల ఓటు**

పోలింగ్ ప్రారంభం కావడానికి అరగంట ముందే వెంకయ్యనాయుడు ఇంటినుంచి బయలుదేరారు. రాజ్యసభ సభ్యుడిగా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. వెంకయ్యనాయుడు తర్వాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ ఓటు వేశారు. ప్రధాని నరేంద్రమోదీ, ఎల్‌కే అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్ తదితర సీనియర్ నేతలంతా తొలి గంటలోనే ఓటు వేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రతిపక్షాల అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీతో కలిసి వచ్చి ఓటు వేశారు. రాహుల్‌గాంధీ తదితరులు కూడా ప్రారంభంలోనే ఓటు వేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం కేశవ్‌ప్రసాద్ మౌర్య కూడా ఎంపీగా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ కూడా ఓటువేశారు.



**ఉత్సాహంగా పోలింగ్**

ఉదయం నుంచే పోలింగ్ ఉత్సాహంగా ప్రారంభమైంది. పార్లమెంటు సమావేశాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం సభా కార్యక్రమాలు ముగియగానే ఎంపీలంతా వారివారి రాష్ట్రాలకు వెళ్లిపోవడం ఆనవాయితీ. కానీ వారు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడం కోసం ఢిల్లీలోనే ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకే దాదాపు 96.94% ఓట్లు పోలయ్యాయి. బీజేపీకి చెందిన సన్వర్‌లాల్ జాట్, విజయ్ గోయల్ (క్రీడా మంత్రి) అనారోగ్యంతో దవాఖానలో చేరినందున ఓటు వేయలేకపోయారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ పదవీకాలం ఈ నెల 10వ తేదీతో ముగుస్తున్నందువల్ల కొత్త ఉపరాష్ట్రపతి ఈ నెల 11వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. యాదృచ్ఛికంగా ఆ రోజు పార్లమెంటు సమావేశాల చివరి రోజు కావడంతో ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే వెంకయ్యనాయుడు రాజ్యసభ చైర్మన్‌గా సభా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**ఓటేసిన మాజీ క్రికెటర్ సచిన్, నటి రేఖ**

రాజ్యసభకు పెద్దగా హాజరుకారని విమర్శలను ఎదుర్కొంటున్న బాలీవుడ్ నటి రేఖ, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ శనివారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటేశారు. కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ రాజీవ్‌శుక్లాతో కలిసి వీరు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 11.15 గంటలకు ఓటేసిన తర్వాత ఎస్పీ లోక్‌సభ ఎంపీ డింపుల్‌యాదవ్‌తో రేఖ కాసేపు ముచ్చటించారు. ఆ తర్వాత టెండూల్కర్ వచ్చి ఓటేశారు. వీరితోపాటు బాక్సర్ మేరీ కోమ్, బీజేపీ నేత రూపాగంగూలీ, సుబ్రమణ్యస్వామి కూడా ఓటుహక్కు వినియోగించుకున్నారు. సచిన్, రేఖ 2012 నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సభలో సచిన్ హాజరుశాతం 7శాతం ఉండగా.. రేఖ కేవలం 5శాతంతో సరిపెట్టుకున్నారు.

**ముఖాముఖి పోరులో నారాయణన్‌దే రికార్డు!**
**మూడోస్థానంలో వెంకయ్య**

1974 నుంచి ఉపరాష్ట్రపతి పదవికి ఇంతవరకూ జరిగిన ఎన్నికల్లో అత్యధిక ఓట్లు పొందిన రికార్డు కేఆర్ నారాయణన్ పేరిట ఉంది. 1992లో జరిగిన ఎన్నికల్లో 701 ఓట్లకు గాను నారాయణన్‌కు 700 ఓట్లు వచ్చాయి. ఆయనపై పోటీ చేసిన టెక్స్‌టైల్ పరిశ్రమాధిపతి కాకా జోగిందర్ సింగ్ అలియాస్ ధర్తీపకడ్‌కు ఒకే ఒక్క ఓటు వచ్చింది. ఇక రెండో స్థానంలో బీడీ జట్టీ ఉన్నారు. 1974లో జరిగిన ఎన్నికల్లో జట్టీకి 521 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి ఎన్ఈ హొరోకు 141 ఓట్లు పోలయ్యాయి. హమీద్ అన్సారీకి 2012లో 490 ఓట్లు, 2007లో జరిగిన ముక్కోణపు పోర్లు 455 ఓట్లు వచ్చాయి. తాజాగా వెంకయ్య 516 ఓట్లు తెచ్చుకొని మూడోస్థానంలో నిలిచారు.

## క్రాస్ ఓటింగ్ జరిగిందా!

- **అనుకున్నదానికన్నా అధిక ఓట్లు**

**న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:** ఎన్డీయే కూటమి తరపున పోటీ చేసిన వెంకయ్యనాయుడికి పార్లమెంటు ఉభయ సభల సభ్యుల నుంచి గణాంకాల ప్రకారం 496 ఓట్లు వస్తాయన్నది అంచనా. గణాంకాల ప్రకారం చూస్తే బీజేపీకి చెందిన ఎంపీలు లోక్‌సభలో281 మంది, రాజ్యసభలో 56 మంది ఉన్నారు. ఉభయ సభల్లోనూ ఎన్డీయే కూటమికి చెందిన ఇతర పార్టీల సభ్యులు 82 మంది ఉన్నారు. వీరుకాకుండా టీఆర్‌ఎస్ (17), అన్నాడీఎంకే (50), వైఎస్సార్సీపీ (10) కలిపి మొత్తం 77 మంది ఎంపీలు వెంకయ్యకు మద్దతు తెలిపారు. దీంతో వెంకయ్యకు మొత్తం 496 ఓట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ ఆయనకు 516 ఓట్లు వచ్చాయి. దీంతో వెంకయ్యకు అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు స్పష్టమవుతున్నది. ఈ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఎంపీలు జేడీయూ, బిజూ జనతాదళ్‌కు చెందిన వారై ఉంటారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అంచనాలకంటే ఇరవై ఓట్లు ఎక్కువే వచ్చాయి. తొలి నుంచీ వెంకయ్యనాయుడి గెలుపు ఖాయమని తెలుస్తున్నా ఎంత ఎక్కువ మెజారిటీ వస్తుంది, ఎన్ని ఎక్కువ ఓట్లు వస్తాయన్నదానిపైనే ఆసక్తి నెలకొంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ పరిచయాలు కలిగి ఉండడం, వరుసగా నాలుగుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంటులోని పలువురు ఎంపీలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడంతో పార్టీలకు అతీతంగా వెంకయ్యమీద అభిమానంతో ఓట్లు ఆశించినదానికంటే ఎక్కువే వచ్చాయి. గోపాలకృష్ణ గాంధీకి వెంకయ్య సాధించిన మెజారిటీ (272) కన్నా తక్కువ ఓట్లు 244 వచ్చాయి. యూపీఏ కూటమి తరపున పోటీ చేసిన గోపాలకృష్ణగాంధీకి కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, తృణమూల్‌కాంగ్రెస్, ఎన్సీపీ, బిజూ జనతాదళ్, జేడీయూ, జేడీఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే, బహుజన్ సమాజ్ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీలు మద్దతు ఇచ్చాయి. బీజేపీతో జేడీయూ జత కట్టినప్పటికీ తొలుత తీసుకున్న నిర్ణయం ప్రకారం గోపాలకృష్ణ గాంధీకి మద్దతు తెలియజేసింది. యూపీఏ పక్షాన రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన మీరాకుమార్ కన్నా గోపాలకృష్ణకు 19 ఓట్లు అధికంగా వచ్చాయి. రాష్ట్రపతి ఎన్నికల్లో కోవింద్‌కు మద్దతు తెలిపిన బీజేడీ (28), జేడీయూ(12) ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మాత్రం గోపాలకృష్ణకు మద్దతు తెలిపాయి. ఆ లెక్కన ఆయనకు 40 ఓట్లు అదనంగా రావాలి. కానీ అన్ని రాలేదు.



పోలింగ్ అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న యూపీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీ



ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు పార్లమెంటు ప్రాంగణానికి వచ్చిన టీఆర్‌ఎస్ ఎంపీలు నగేశ్, జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, కే కేశవరావు, బీబీ పాటిల్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్

## ఉదయమే ఓటేసిన టీఆర్‌ఎస్ ఎంపీలు

**న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ ఎంపీలు మొత్తం 17 మంది ఉదయం 11.30 గంటలకల్లా వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎంపీలు కవిత, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు తొలి గంటలోనే ఓటు వేయగా, కే కేశవరావు, జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, జీ నగేష్, బీబీ పాటిల్, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, మల్లారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాం నాయక్, పసునూరి దయాకర్, బాల్క సుమన్ తదితరులంతా 11 గంటల తర్వాత ఓటు వేశారు. టీఆర్‌ఎస్ ఎంపీలు ఒక్కరు కూడా గైర్హాజరుకాలేదు. టీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీఎం కేసీఆర్ ఆదేశానుసారం తాము ఓటు వేశామని, తొలి నుంచీ వెంకయ్యనాయుడు అభ్యర్థిత్వాన్ని తమ పార్టీ బలపరుస్తున్నదని జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్ మీడియాతో వ్యాఖ్యానించారు. పార్టీ నిర్ణయానుసారమే తామంతా ఓటు వేశామని తెలిపారు.


## అన్సారీ, సోనియా అభినందనలు

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడును ప్రస్తుత ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ప్రతిపక్షాల అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీ అభినందించారు. ఫలితం వెలువడిన వెంటనే అన్సారీ వెంకయ్యకు ఫోన్ చేసి భారత ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షించారు. రాజ్యసభను మరింత బలోపేతం చేయడంలో వెంకయ్యకు తమ సహకారం ఉంటుందని సోనియాగాంధీ పేర్కొన్నారు. 'పక్షపాతం లేకుండా పెద్దల సభను నడిపించడం కీలకమైన సవాల్' అని సోనియా తెలిపారు.

## ఇప్పటి వరకు ఉప రాష్ట్రపతులుగా పనిచేసిన వారు..

| పేరు | పనిచేసిన కాలం |
|---|---|
| 1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ | మే 13, 1952 నుంచి 1962 వరకు(రెండు సార్లు) |
| 2. డాక్టర్ జాకీర్ హుస్సేన్ | మే 13, 1962 నుంచి మే 13, 1967వరకు |
| 3. డాక్టర్ వరహగిరి వెంకటగిరి | మే 13, 1967 నుంచి 1969వరకు |
| 4. గోపాల్ స్వరూప్ పాఠక్ | ఆగస్టు 31, 1969 నుంచి ఆగస్టు 31, 1974 వరకు |
| 5. బసప్ప దనప్ప జెట్టి | ఆగస్టు 31, 1974 నుంచి ఆగస్టు 31, 1979 వరకు |
| 6. జస్టిస్ మహ్మద్ హిదాయతుల్లా | ఆగస్టు 31, 1979 నుంచి ఆగస్టు 31, 1984 వరకు |
| 7. డాక్టర్ రామస్వామి వెంకటరామన్ | ఆగస్టు 31, 1984 నుంచి జూలై 1987 వరకు |
| 8. డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ | సెప్టెంబర్ 3, 1987 నుంచి ఆగస్టు 21, 1992 వరకు |
| 9. కేఆర్ నారాయణన్ | ఆగస్టు 21, 1992 నుంచి ఆగస్టు 21, 1997 వరకు |
| 10. కృష్ణకాంత్ | ఆగస్టు 21, 1997 నుంచి ఆగస్టు 19, 2002 వరకు |
| 11. బైరాన్‌సింగ్ షెకావత్ | ఆగస్టు 19, 2002 నుంచి ఆగస్టు 11, 2007 వరకు |
| 12. మహ్మద్ హమీద్ అన్సారీ | ఆగస్టు 11, 2007 నుంచి కొనసాగుతున్నారు. |
| 13. వెంకయ్యనాయుడు ఈ నెల 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరిస్తారు. | |

## పోస్టర్లు వేసిన కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి వరకూ



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** భారత రాజకీయాలలో చిరపరిచితుడైన ముప్పవరపు వెంకయ్యనాయుడు బీజేపీలో పోస్టర్లు వేసే సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఉపరాష్ట్రపదవిని అలంకరించే వరకూ ఎదిగారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా, చవటపాలెం గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో 1949, జూలై ఒకటిన ఆయన జన్మించారు. బీజేపీకి అధ్యక్షునిగా, కేంద్ర మంత్రిగా, సుదీర్ఘకాలం రాజ్యసభ సభ్యునిగా సేవలందించారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం ఆయనది. బీజేపీకి మాతృసంస్థ అయిన జనసంఘ్‌లో కార్యకర్తగా 1970లో వెంకయ్య దిగ్గజ నేతలైన అటల్‌బిహారీ వాజపేయి, ఎల్‌కే అద్వానీల పోస్టర్లు వేసేవారు. వాక్చాతుర్యంతో అందరినీ ఆకట్టుకొనే వెంకయ్య అనతికాలంలోనే నాయకునిగా ఎదిగారు. ఆయన రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. 1978లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో దాదాపు క్లీన్‌స్వీప్ చేసినప్పటికీ వెంకయ్య జనతాపార్టీ అభ్యర్థిగా ఉదయగిరి నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తిరిగి 1983లో ఎన్టీ రామారావు ప్రాబల్యాన్ని తట్టుకొని అదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించారు. వెంకయ్య కర్ణాటక నుంచి మూడుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ఎన్నికయ్యే ముందు ఆయన రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒకప్పుడు అద్వానీ ముఖ్యఅనుచరునిగా ఉన్న వెంకయ్య 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని అభ్యర్థి మోదీకి మద్దతు పలికారు. మోదీ ప్రభుత్వంలో సమాచార, ప్రసార శాఖలు, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖకు కూడా మంత్రిగా పనిచేశారు. వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్‌లో వెంకయ్య గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షునిగా 2002 జూలై నుంచి అక్టోబర్ 2004 వరకు పనిచేశారు. 2004 ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. ఎమర్జెన్సీ కాలంలో ఏబీవీపీ కార్యకర్తగా ఉన్న వెంకయ్య అరెస్టయి జైలు జీవితం గడిపారు.

పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఉభయ సభల్లో ప్రతిపక్షం ప్రభుత్వంపై లేదా ప్రధానిపై దాడిని ఎక్కుపెట్టినప్పుడు ఆయన సమర్థవంతంగా తిప్పికొట్టేవారు. ప్రభుత్వానికి, ప్రతిపక్షానికీ మధ్య ఎప్పుడు ప్రతిష్టంభన నెలకొన్నా, దానిని తొలిగించేందుకు ఆయన ప్రయత్నించారు. ఇందుకోసం ఆయన కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాతో పలుమార్లు భేటీ అయిన సందర్భాలున్నాయి. వెంకయ్య పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన శాఖల మంత్రిగా ఉన్నప్పుడే స్మార్ట్ సిటీ మిషన్, అటల్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, అందరికీ ఇండ్లు వంటి పథకాలు ప్రారంభమయ్యాయి. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్య 'ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన' ఆవిష్కరణలో కీలకపాత్ర పోషించారు. శనివారం ఉదయం పోలింగ్ ప్రారంభం కావడానికి ముందు ఆయన 'ఇక నా పార్టీ, మీ పార్టీ అనేది లేదు. నేను పార్టీ రహిత వ్యక్తిని' అన్నారు.

## చవటపాలెంలో సంబురాలు

**అమరావతి, నమస్తేతెలంగాణ:** వెంకయ్యనాయుడు గెలుపుపై నెల్లూరు జిల్లాలోని ఆయన స్వగ్రామం వెంకటాచలం మండలంలోని చవటపాలెం గ్రామ ప్రజలు పటాకులు కాల్చి ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. శ్రీరామపురం ఆలయంలో పూజలు నిర్వహించడంతోపాటు, నెల్లూరు బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, నేతలు మిఠాయిలు పంచి ఆనందం పంచుకున్నారు.



భోపాల్‌లో బీజేపీ కార్యకర్తల విజయోత్సవ సంబురాలు




హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌కు మిఠాయిలు తినిపిస్తున్న నేతలు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారావు తదితరులు




ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేస్తున్న కాంగ్రెస్ అధినేత్రి సోనియా




ఓటు హక్కు వినియోగించుకుంటున్న లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్



నగరంలోని యూసుఫ్‌గూడ పోలీస్ లైన్‌లో శనివారం మెగా హరిత హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ప్రముఖ సినీ హీరో రానా, హీరోయిన్ క్యాథరిన్, రచ్చరవి, సుమారు 100 పాఠశాలలకు చెందిన వేల మంది విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.



నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు 'సిస్టర్ ఫర్ చేంజ్'లో భాగంగా శనివారం నగరంలోని నారాయణగూడలో గల జాహ్నవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు స్పందించారు. పలువురికి హెల్మెట్లను పంపిణీ చేసి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్రవాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిలుపునిచ్చారు.



## 300 లీటర్ల నకిలీ పాలు స్వాధీనం

- ఆదిభట్ల, కర్మన్‌ఘాట్‌లో ఎస్‌వోటీ పోలీసుల దాడి

**ఇబ్రహీంపట్నం/ఎల్‌బీనగర్, నమస్తేతెలంగాణ:** నకిలీలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా అక్రమవ్యాపారుల్లో మాత్రం మార్పు రావడంలేదు. తాజాగా శనివారం రంగారెడ్డి జిల్లాలోని ఆదిభట్ల, కర్మన్‌ఘాట్ ప్రాంతాల్లో ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి పాల పౌడర్, మంచి నూనెతో తయారు చేసిన 300 లీటర్ల నకిలీ పాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకులను అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల అనుబంధ గ్రామమైన మమ్మరాజుగూడలో శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తి కొంతకాలంగా నకిలీ పాలను తయారుచేస్తూ నగరంతోపాటు వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఎస్‌వోటీ పోలీసులు శ్రీధర్‌రెడ్డిపై నిఘావేశారు. ఇంట్లోనే మంచినూనె, పాలపౌడర్‌తో నకిలీ పాలను తయారుచేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సుమారు 100 లీటర్ల నకిలీ పాలు, రెండు మిక్సింగ్‌మిషిన్లు, మంచినూనె డబ్బాలు, పాలపౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీధర్‌రెడ్డిని ఆదిభట్ల పోలీసులకు అప్పగించారు. కర్మన్‌ఘాట్ ప్రాంతంలో ఆరు నెలలుగా సాగుతున్న నకిలీ పాల తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. కర్మన్‌ఘాట్ దుర్గానగర్‌కాలనీకి చెందిన కొత్త సుభాష్‌గౌడ్(55) గత 30 ఏండ్లుగా రావిర్యాల, ఆదిభట్ల, తిమ్మాపూర్ గ్రామాల నుంచి పాలు సేకరించి నగరంలో అమ్మేవాడు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో సేకరించిన బర్రె పాలల్లో నీళ్లు కలుపడం, పౌడర్‌తో నకిలీ పాలు తయారు చేసి అమ్మాలనే ఆలోచనకు వచ్చాడు. తాను ఉంటున్న ఇంట్లోనే ఆరు నెలలుగా పాలపౌడర్‌తో నకిలీ పాలు తయారు చేసి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడి చేశారు. 29 పాల పౌడర్ ప్యాకెట్లు, 200 లీటర్ల నకిలీ పాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు సుభాష్‌గౌడ్‌ను అరెస్ట్ చేసి సరూర్‌నగర్ పోలీసులకు అప్పగించగా వారు రిమాండ్‌కు తరలించారు.



మమ్మరాజుగూడలో పట్టుబడిన నకిలీ పాలు, నూనె ప్యాకెట్లు

## భారీగా గుట్కా ప్యాకెట్లు సీజ్

**కొండాపూర్:** నిషేధిత గుట్కా ప్యాకెట్లతోపాటు విదేశీ సిగరెట్లు, హుక్కా ఫ్లేవర్లను అమ్ముతున్న పాన్‌షాపుపై ఎస్‌వోటీ పోలీసులు శనివారం ఆకస్మిక దాడి చేశారు. నగరంలోని మాదాపూర్ సాయినగర్‌లో గల పాన్‌షాపులో కొంతకాలంగా నిషేధిత గుట్కాలను అమ్ముతున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి గుట్కాలు, విదేశీ సిగరెట్లు, పలు రకాల హుక్కా ఫ్లేవర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.లక్షకుపైగా ఉన్నట్టు సమాచారం. నిర్వాహకుడిని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు.

## యూజీసీ ఉన్నత కమిటీ సభ్యుడిగా ప్రొఫెసర్ భట్టు సత్యనారాయణ



**ఉస్మానియా యూనివర్సిటీ:** దేశవ్యాప్తంగా యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టుల భర్తీకి సంబంధించిన విధివిధానాలను నిర్ణయించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ సభ్యుడిగా ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) అధ్యక్షుడు ప్రొఫెసర్ భట్టు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం యూజీసీ అధికారులు ఆయనకు వర్తమానం అందించారు. వర్సిటీలలో అధ్యాపకులకు కనీస అర్హత, ఇతర ప్రమాణాలు నిర్దేశించేందుకు, ఉన్నత విద్యాప్రమాణాలను పరిరక్షించేందుకు ఈ కమిటీ తగిన సూచనలు చేయాల్సి ఉంటుంది. హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ గుప్తా చైర్మన్‌గా మరో నలుగురు సభ్యులుగా ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భట్టు మాట్లాడుతూ కమిటీ నివేదికను రెండు, మూడు నెలల్లో సమర్పించాలని చెప్పారు. ఆ సిఫార్సులు 2016 నుంచి 2026 వరకు అమలులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, ఔటా నాయకులు, విద్యార్థులు అభినందించారు.

# నిలోఫర్‌లో తల్లిపాల నిధి

- రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటుకు సన్నాహాలు
- రోజుకు 400 మంది శిశువులకు అందుబాటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వహణ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఇప్పటి వరకు బ్లడ్ బ్యాంక్‌ల గురించి మాత్రమే విన్నాం. ఇక నుంచి మదర్స్ మిల్క్ బ్యాంక్‌లు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ హెల్త్‌మిషన్, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఆరోగ్యశాఖతో కలిసి 'యూత్ ఫర్ సేవా' అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా 'దాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్' పేరుతో శనివారం హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానలో తల్లిపాల నిధిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసింది. ఈ సందర్భంగా నిలోఫర్ దవాఖానలో తల్లిపాల వారోత్సవ ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సాధారణంగా తల్లి నుంచి దూరంగా ఉన్న శిశువులకు, అనారోగ్యం కారణంగా తల్లికి పాలు రాక, డబ్బా పాలు పట్టే శిశువుల కోసం ఈ నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ కారణాల వల్ల శిశువులకు పుట్టగానే తల్లిపాలు పట్టకపోవడంతో వారికి ఎన్ని టీకాలు ఇచ్చినప్పటికీ వ్యాధి నిరోధక శక్తి లేక పలురకాల వ్యాధులకు గురవడం, మృత్యువాత పడుతున్నారని వివరించారు. ఈ క్రమంలోనే ప్రతిరోజు దేశవ్యాప్తంగా వెయ్యిమంది శిశువుల్లో సుమారు 30 మంది మరణిస్తున్నట్టు ఆందోళన వ్యక్తంచేశారు. శిశువు జన్మించగానే వచ్చే ముర్రుపాలు వంద టీకాలతో సమానమన్నారు. చాలా మందికి ఈ విషయం తెలియక తల్లిపాలు ఇవ్వడం మానేసి డబ్బాపాలు పడుతున్నారని, దీని వల్ల దేశంలో శిశుమరణాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదన్నారు. ఐఎంఆర్(శిశు మరణాల రేటు)తగ్గించేందుకే విదేశాల మాదిరిగా మన దేశంలో కూడా 'తల్లిపాల నిధి'ని ఏర్పాటు చేయాలని సంకల్పించామని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహాయ, సహకారాలు అందించడం సంతోషకరమన్నారు. చనుపాల నిధులు ఇప్పటికే దేశంలోని గుజరాత్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.



నిలోఫర్ దవాఖానలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న 'యూత్ ఫర్ సేవా' స్వచ్ఛంద సంస్థ సభ్యులు

**రక్తదానంలాగే.. పాలదానం**

రక్తదానం ఎలా చేస్తున్నారో అదేవిధంగా పాలదానం చేసే మహిళల నుంచి చనుపాలను సేకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఒక ఆరోగ్యవంతమైన తల్లిలో రోజు 250 నుంచి 300 మిల్లీ లీటర్ల పాలు ఉత్పత్తవుతాయన్నారు. ఇందులో రోజుకు 150 నుంచి 200 మిల్లీ లీటర్ల పాలు మాత్రమే బిడ్డకు పడుతారన్నారు. ఈ మిగిలిన పాలనే 'దాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్' నిర్వాహకులు సేకరిస్తారన్నారు. స్వచ్ఛందగా ముందుకు వచ్చే తల్లుల నుంచి ఈ పాలను సేకరిస్తామన్నారు. తల్లులు స్వచ్ఛందంగా పాలను దానం చేయడంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన, ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**రోజుకు సుమారు 400 మందికి..**

నిలోఫర్‌లో ఏర్పాటు చేయనున్న 'దాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్' నుంచి రోజూ 300 నుంచి 400 మంది శిశువులకు తల్లిపాలను ఉచితంగా అందించనున్నట్టు నిర్వాహకులు వివరించారు. పాల దానంపై ముఖ్యంగా మహిళల్లో అవగాహన రావాల్సిన అవసరం ఉన్నదని, ఆదిశగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. వారు ఇచ్చే పాలు ఎంతో మంది పసికూనల ఆకలి తీరుస్తుందనే విషయాన్ని పాలిచ్చే తల్లులు గమనించాలని విజ్ఞప్తిచేశారు.

### ఏ రోజు సేకరించిన పాలు ఆరోజే సరఫరా

సాధారణంగా మహిళల నుంచి సేకరించిన చనుపాలను ముందుగా పరీక్షిస్తామని నిర్వాహకులు తెలిపారు. పరీక్షించిన పాలను ఎలాంటి ఇన్‌ఫెక్షన్స్ లేకుండా యంత్రాల ద్వారా శుద్ధిచేసి, 'పాశ్చరైజ్'(శీతలీకరణం)చేస్తామన్నారు. ఈ విధంగా శుద్ధిచేసిన పాలను తల్లి శరీర ఉష్ణోగ్రత వద్ద నిలువ చేస్తామన్నారు. ఏ రోజు సేకరించిన పాలు అదే రోజు సరఫరా చేస్తామని, రోజుల తరబడి నిల్వ చేయడం ఉండదని స్పష్టంచేశారు. తల్లిపాలను శుద్ధిచేయడం, శీతలీకరణం చేయడం, నిల్వచేయడానికి అవసరమైన యంత్రాలను యూకే నుంచి కొనుగోలు చేసినట్టు దాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ ప్రతినిధి డాక్టర్ సంతోష్ తెలిపారు. రూ.25 లక్షల వ్యయంతో పాశ్చరైజ్ యంత్రాలను తెప్పించినట్టు వివరించారు. రెండుమూడు వారాల్లో యంత్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. నిర్ణీత సమయంలో ఏర్పాట్లు పూర్తయితే ఈనెల 24న తల్లిపాల నిధిని ప్రారంభించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

# స్కూల్ బ్యాగ్ బరువు తగ్గాల్సిందే

- పరిమితికి మించితే పాఠశాల మూతే
- 11 నుంచి విద్యాశాఖ క్షేత్రస్థాయి తనిఖీలు
- రంగంలోకి 32 ప్రత్యేక బృందాలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** స్కూల్ బ్యాగు బరువు తగ్గించడంపై హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ దృష్టిసారించింది. ఈ విషయంపై కఠినంగా వ్యవహరిస్తున్నది. పరిమితికి మించితే స్కూళ్లను మూసివేయడానికి వెనుకాడబోమని హెచ్చరిస్తున్నది. ఈ నెల 10వ తేదీ వరకు అవకాశమిచ్చిన అధికారులు, 11వ తేదీ నుంచి 32 ప్రత్యేక బృందాలను నియమించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించబోతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తనిఖీల కోసం 24, ఉన్నత పాఠశాలల్లో తనిఖీలకు 8 బృందాలను ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల్లో తనిఖీలకు డిప్యూటీ ఈవో, సీనియర్ హెడ్‌మాస్టర్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తనిఖీలకు డిప్యూటీ ఐవోఎస్, సీనియర్ హెడ్‌మాస్టర్లతో బృందాలను నియమించారు. బ్యాగ్ బరువు పరిమితికి మించితే ఏ మాత్రం రెండో ఆలోచన లేకుండా స్కూళ్లను సీజ్‌చేస్తామని విద్యాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**గడువు మరో నాలుగు రోజులే..**

బ్యాగ్ బరువుపై స్పష్టతనిస్తూ ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ జీవోను జారీచేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ముందడుగేస్తున్నారు. తొలుత ప్రభుత్వం జీవోను కచ్చితంగా పాటించాలని కోరుతూ స్కూళ్లన్నింటికీ నోటీసులు జారీచేసింది. ఈ నెల 10వ తేదీలోపు యాజమాన్యాలే చొరవ తీసుకుని బరువును తగ్గించుకోవాలని కోరారు. 11వ తేదీ తర్వాత ఏ మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరికలు పంపించారు. జిల్లా విద్యాశాఖ విధించిన గడువుకు మరో నాలుగు రోజుల మాత్రమే మిగిలి ఉన్నది. ఇప్పటి వరకు ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోని వారిలో ఆందోళన కనిపిస్తున్నది. మొదటి వేటు ఎవరిపై పడుతుందోనని యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.



### మార్పు కనిపిస్తున్నది

విద్యాశాఖ ఆదేశాలు, హెచ్చరికలను జిల్లాలోని చాలా వరకు ప్రైవేట్ స్కూళ్లు పాటిస్తున్నాయి. ఇక తప్పనిసరి కావడంతో స్కూళ్ల వైఖరిలో కొంతలో కొంత మార్పు కనిపిస్తున్నది. అవసరమున్న మేరకే తప్ప.. అవసరం లేని పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను బ్యాగ్‌ల నుంచి తొలిగిస్తున్నారు. ఇప్పటివరకు హోంవర్క్‌ను తప్పనిసరిగా ఇచ్చేవారు. ప్రస్తుతం చాలావరకు హోంవర్క్ ఇవ్వడమే మానేశారు. కొన్ని స్కూళ్లు మాత్రం తరగతి గదిలోనే హోంవర్క్ చేయించి, నోట్‌బుక్స్‌ను అక్కడే భద్రపరుస్తున్నాయి. మరికొన్ని స్కూళ్లు మాత్రం వర్క్‌బుక్స్‌ను సైతం అవసరంలేదంటూ పక్కనపెట్టేస్తున్నాయి. కొన్ని స్కూళ్లు కేవలం టిఫిన్‌బాక్స్, వాటర్‌బాటిళ్లను మాత్రమే ఇంటికి పంపిస్తూ, పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పాఠశాలలకే పరిమితం చేస్తున్నాయి.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

## నెలలో ఓటర్ల జాబితా సవరణ పూర్తి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని నెలరోజుల్లో పూర్తిచేయనున్నట్టు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 41.32 లక్షల మంది ఓటర్లకుగాను ఇప్పటివరకు 5.17 లక్షల మంది ఓటర్ల పరిశీలన పూర్తయిందన్నారు. జాబితా సవరణపై శనివారం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో కమిషనర్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకుడు విష్ణు ఈ సమావేశానికి ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాబితా సవరణ కార్యక్రమం మరింత సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్లను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయడంవల్ల అవకతవకలు జరుగవని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పలు పార్టీల ప్రతినిధులు కమిషనర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ, ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని, వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోనే మొదటిసారి మన నగరంలో ఓటర్ల నమోదుకు వెళ్లే సిబ్బందికి ట్యాబ్‌లెట్ పీసీలను అందజేసినట్టు కమిషనర్ చెప్పారు. ఇంటివద్దే ఓటర్ల ఫొటోలను తీసి జీపీఎస్‌కు అనుసంధానం చేయడంవల్ల ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా తయారయ్యే అవకాశమున్నదన్నారు. గ్రేటర్‌లోని 24 అసెంబ్లీస్థానాల్లో ఈ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని వివరించారు.

# లక్నోలో వైద్య సీటు.. నమ్మితే చేటు!

**కమీషన్ కోసం.. తక్కువ ఫీజంటూ ఏజెంట్ల మోసం**

**అక్కడికెళ్లాక ఎక్కువ మొత్తం చెల్లించలేక తల్లిదండ్రుల సతమతం**

**కట్టిన డబ్బు తిరిగివ్వలేమంటున్న యూపీ కళాశాలలు**

**పూర్తి వివరాలు తెలుసుకున్నాకే ఫీజు కట్టాలంటున్న పోలీసులు**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** 'యూపీలో రూ.45 లక్షలకే ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తా. ఒక్కపైసా కూడా ఎక్కువ కట్టొద్దు. ముందు రూ.5 లక్షల డీడీ తీయండి. అక్కడంతా మనోళ్లే' అని నమ్మించి తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. హైదరాబాద్ అమీర్‌పేట్‌కు చెందిన అనిల్‌కుమార్ తన కుమారుడిని ఎంబీబీఎస్ చదివించాలని ఏజెంట్ రమణ మాటలు విని మోసపోయారు. రూ.5 లక్షలు యూపీలోని కాలేజీ పేరుపై డీడీ తీసి, సీటు బుక్ చేయించుకున్నాక, ఫీజు రూ.45 లక్షలు కాదని, మొత్తం రూ.75 లక్షలు చెల్లించాల్సిందేనని యాజమాన్యం చెప్పడంలో ఖంగుతిన్నారు. చేసేది లేక అమీర్‌పేట్‌లోని ఇంటిని అమ్మేసి కళాశాలలో చేర్పించారు. హైదరాబాద్‌కు చెందిన నాగేందర్ తన కుమార్తెను ఎంబీబీఎస్‌లో చేర్పించేందుకు లక్నో వెళ్లారు. దళారుల చేతిలో మోసపోయారు. సీటు రిజిస్ట్రేషన్ కోసం డీడీ తీయించిన రూ.5 లక్షలను వదులుకుని తిరిగి వచ్చేశారు. హైదరాబాద్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చేయాలనే ఔత్సాహికులైన విద్యార్థుల తల్లిదండ్రులకు దళారులు గాలం వేస్తున్నారు. తక్కువ ఫీజులని నమ్మించి, అక్కడికి వెళ్లాక ముంచేస్తున్నారు. ఇక్కడ ప్రైవేట్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీటు దొరుకడం కష్టం కావడంతో, ఇతర రాష్ట్రాల్లో చదివించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే ఆసరాగా ఏజెంట్లు మోసం చేస్తున్నారు. ఏజెంట్లు కమీషన్‌కు కక్కుర్తి పడి.. తక్కువ ఫీజులంటూ నమ్మించి, డీడీలు తీయించి అక్కడికి తీసికెళ్తున్నారు. కాలేజీలో పేరు రిజిస్ట్రేషన్ అయ్యిందంటే దళారులకు రావాల్సిన కమీషన్ వచ్చేస్తుంది. కొన్ని కాలేజీలు.. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కాలేజీ వద్దకు తీసుకొచ్చి సీటు బుక్ చేయించండి, తర్వాత మీ కమీషన్ మీ ఖాతాలోకి వచ్చేస్తుంది అని ఏజెంట్లకు భరోసా ఇస్తున్నాయి. కొన్ని కాలేజీలు.. దళారులతో రహస్య ఒప్పందం చేసుకోవడంతో, అక్కడికి వెళ్లగానే కళాశాల సిబ్బంది.. ఏజెంట్ చెప్పిందే నిజమని నమ్మిస్తుంటారు. ఇలాంటి మోసాలు తమ దృష్టికి వచ్చాయని, ఎవరూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. కళాశాలల్లో చేరాలనుకుంటున్నవారు ముందుగానే యాజమాన్యాన్ని సంప్రదించి, అనుమతులు, క్యాంపస్‌ను పరిశీలించాలని సూచిస్తున్నారు.

# ఉపాధి అవకాశాల గని.. న్యాక్

- నిరుద్యోగులకు శిక్షణ.. వందశాతం ప్లేస్‌మెంట్
- 800 మంది సివిల్ ఇంజినీర్లకు అత్యుత్తమ ట్రైనింగ్
- కాంట్రాక్టర్లుగా మారిన ఎస్సీ, ఎస్టీ ఇంజినీర్లు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్).. నిరుద్యోగుల పాలిట అవకాశాల గనిగా మారుతున్నది. ఇందులో శిక్షణ పొందినవారికి వందశాతం ఉద్యోగాలతోపాటు, అనేక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సీఎం కేసీఆర్ స్వయంగా చైర్మన్ హోదాలో పర్యవేక్షిస్తుండడంతో సంస్థకు చాలా కలిసి వస్తున్నది. దీంతో ఉద్యోగాలు లేవని ఆవేదన చెందుతున్న యువతకు న్యాక్ ఆశాకిరణంగా మారుతున్నది. ఉపాధి కోసం ఇందులో చేరుతున్న అభ్యర్థులకు జీవితంపై భరోసా కల్పిస్తున్నది. శిక్షణతోపాటు ఇక్కడ కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు, ఉచిత భోజన వసతి ప్రధాన ఆకర్షణగా మారాయి. న్యాక్ గతంలో ఏదో తూతూ మంత్రంగా నడిచేది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రక్రియ ఒక యజ్ఞంలా సాగుతున్నది. 5వ తరగతి నుంచి ఎంటెక్ విద్యార్థుల వరకు శిక్షణ ఇస్తూ నిర్మాణరంగానికి ఉత్తమ వనరులను అందజేస్తున్నది.

**సివిల్ ఇంజినీర్లకు పెద్దపీట**

నిర్మాణరంగంలో నిపుణులైన మానవ వనరుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సివిల్ ఇంజినీర్లకు అత్యుత్తమ శిక్షణ ఇవ్వడానికి న్యాక్ గత ఏడాది నుంచి శ్రీకారం చుట్టింది. ఏడాది కాలంలో సుమారు 800 మంది ఇంజినీరింగ్ పూర్తయిన యువతకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 82 శాతం మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులే కావడం విశేషం. సివిల్ ఇంజినీరింగ్ పూర్తయిన 72 మంది ఎస్సీ, ఎస్టీ యువతకు ఇటీవలే శిక్షణ ఇచ్చారు. మంత్రి కే తారక రామారావు సూచనల మేరకు న్యాక్ డీజీ భిక్షపతి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులను కాంట్రాక్టర్లుగా తయారు చేశారు. క్లాస్-5 కాంట్రాక్టర్లుగా లైసెన్స్ తీసుకొని రూ.50 లక్షల వరకు కాంట్రాక్ట్ పనులు చేసుకునే అవకాశం కల్పించారు. కాంట్రాక్ట్ టెండర్లలో 15 శాతం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే న్యాక్‌లో గత బ్యాచ్‌లలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇచ్చారు. వారందరికీ ప్లేస్‌మెంట్స్ కల్పించారు.



న్యాక్‌లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

### ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగానే..

ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగానే న్యాక్ పనిచేస్తున్నది. రాష్ట్రంలో నిరుద్యోగాన్ని పోగొట్టాలన్న సీఎం కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం. మా సంస్థలో మూడు నెలలపాటు శిక్షణ పొందిన వారికి కచ్చితంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మా దగ్గర శిక్షణ పొందినవారికి ఉపాధి కల్పించేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ ఇంజినీర్ల కోసం ప్రత్యేక బ్యాచ్‌లు ఏర్పాటు చేసి వారిని కాంట్రాక్టర్లుగా తయారుచేసిన ఘనత న్యాక్‌కే దక్కుతుంది.

- భిక్షపతి, న్యాక్ డైరెక్టర్ జనరల్


సిస్టర్స్ ఫర్ చేంజ్ కార్యక్రమ ప్రచారం కోసం డెన్మార్క్‌లో సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తున్న టీఆర్ఎస్ డెన్మార్క్ శాఖ సభ్యులు

## డెన్మార్క్‌లో 'సిస్టర్స్ ఫర్ చేంజ్' సైకిళ్ల ర్యాలీ

సిస్టర్స్ ఫర్ చేంజ్ కార్యక్రమ ప్రచారం కోసం డెన్మార్క్‌లో టీఆర్ఎస్ డెన్మార్క్ శాఖ ఆధ్వర్యంలో సైకిళ్ల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ డెన్మార్క్ శాఖ అధ్యక్షుడు శ్యామ్‌కు కల్వకుంట్ల ప్రతిమ రాఖీ కట్టి హెల్మెట్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాదరావు, దామోదర్ కనుకుల, జయచందర్, శ్రీనివాసులు, సతీశ్, సంతోశ్, ఖాజా, పుల్లారావు, సుధాకర్, గంగాధర్, విగ్నేశ్ పాల్గొన్నారు.


తిరుమలలో శ్రీమలయప్ప స్వామివారు శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం అనంతరం హారతి నివేదిస్తున్న రుత్వికులు

## తిరుమలలో ముగిసిన పవిత్రోత్సవాలు

**తిరుమల, నమస్తే తెలంగాణ:** తిరుమల శ్రీవారి ఆలయంలో మూడురోజుల పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. తొలి రెండురోజుల్లాగానే శనివారం ఉదయం యాగశాలలో రుత్వికులు హోమాలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకించి చివరగా చందనపూత పూశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనమిచ్చారు. ఇక రాత్రి 7గంటలకు పూర్ణాహుతిని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం శ్రీమలయప్ప స్వామివారు శ్రీదేవి, భూదేవితో కూడి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు, అధికారులు పాల్గొన్నారు.


విక్టోరియా నగరంలో మీడియాతో మాట్లాడుతున్న ఆస్ట్రేలియా టీఆర్ఎస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, విక్టోరియా రాష్ట్ర ఇన్‌చార్జి సాయిరాం తదితరులు

# ఆస్ట్రేలియా ఉద్యోగాల పేరుతో మోసపోవద్దు

### సంప్రదిస్తే సలహాలిస్తామని టీఆర్ఎస్ ఆస్ట్రేలియాశాఖ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు.. నెలకు రూ. 70,000–1,00000 వరకు వేతనం. కేవలం రూ.6 లక్షలు కట్టండి. ఆస్ట్రేలియాలో కొలువు చేసుకోండి..' ఇలా తెలంగాణ జిల్లాల్లో నకిలీ ఏజెంట్లు చేసే ప్రకటనలను చూసి యువత మోసపోవద్దని టీఆర్ఎస్ ఆస్ట్రేలియాశాఖ విజ్ఞప్తి చేసింది. ఆస్ట్రేలియాలో పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయని అనేకమంది యువకుల నుంచి రూ.6 లక్షల చొప్పున వసూలుచేసి మోసగించారని తెలిపింది. సోషల్ మీడియా ద్వారా తమను ఆశ్రయిస్తే సరైన సలహాలు, సూచనలు చేస్తామని పేర్కొన్నది. ఈ మేరకు ఆస్ట్రేలియా టీఆర్ఎస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి కాసర్ల, విక్టోరియా రాష్ట్ర ఇన్‌చార్జి సాయిరాం ఉప్పు విక్టోరియా నగరంలో శనివారం మీడియాకు వెల్లడించారు. నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మి పలువురు నిరుద్యోగులు మోసపోయి వివిధ దేశాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఆస్ట్రేలియాలోని వివిధ కంపెనీల పేరుతో నకిలీ జాబ్ ఆఫర్ లెటర్లు ముద్రించి ఆస్ట్రేలియా పంపిస్తున్నామని నమ్మబలికి సముద్రమార్గం ద్వారా మలేషియా, థాయిలాండ్, ఇండోనేషియా దేశాలకు పంపించారని చెప్పారు. అక్కడికి వెళ్లిన తర్వాత ఇరుకుగదుల్లో అభ్యర్థులను ఉంచారని తెలిపారు. ఫుట్‌పాత్‌లపై నిద్రించే దుస్థితి వారికి ఎదురైందని పేర్కొన్నారు. కొందరు జైలు జీవితం గడిపి అష్టకష్టాలు పడి స్వదేశానికి తిరిగి వెళ్లారని వివరించారు. తగిన విద్యార్హత, ఇంగ్లిష్ పరీక్షలో అర్హత సాధించడంతోపాటు వృత్తివిద్య, ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసిన వారు గుర్తింపు పొందిన కన్సల్టెన్సీల ద్వారామాత్రమే నిబంధనల మేరకు ఉద్యోగాలు పొందే అర్హత ఉందని వివరించారు. ఆస్ట్రేలియాలో విద్య, ఉద్యోగ అవకాశాల కోసం ఈ దేశ ఇమ్మిగ్రేషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. టీఆర్ఎస్ ఆస్ట్రేలియాను ఫేస్‌బుక్ పేజీ, ట్విట్టర్ ద్వారా సంప్రదిస్తే నిపుణులతో సందేహ నివృత్తి చేయించడంతోపాటు తగు మార్గదర్శకాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అనీల్‌రావు చీటి, ప్రధాన కార్యదర్శి అర్జున్ చల్లగుళ్ల, విక్టోరియా యూత్ సంఘం ఉపాధ్యక్షుడు సునిల్ బాసిరెడ్డి, అధికార ప్రతినిధి సత్యంరావు గురిజాపల్లి, సభ్యులు వేణునాథ్, సాయియాదవ్, రాకేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై ఘనంగా వ్యర్థాల నిర్వహణ

### రాష్ట్రస్థాయి సలహాకమిటీ ఏర్పాటుకు సన్నాహాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఘనవ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం)ను రాష్ట్రాలన్నీ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కేంద్రం ఆదేశించింది. ప్రత్యేకంగా 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్–2016'ని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో ఘనవ్యర్థాల నిర్వహణను మెరుగ్గా నిర్వహించాలి. ఈ పనులను పర్యవేక్షించడానికి, పక్కాగా అమలుచేయడానికి రాష్ట్రస్థాయి సలహా కమిటీ ఏర్పాటుచేయాలని కేంద్రం సూచించింది. ఇప్పటికే పురపాలకశాఖ మంత్రి కే తారక రామారావు ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థలన్నీ ఘన వ్యర్థాలను సమర్థంగా నిర్వహిస్తున్నాయి. కేంద్రం ఆదేశాలతో పురపాలకశాఖ రాష్ట్రస్థాయి సలహా కమిటీని ఏర్పాటుచేయడానికి పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఇటీవల పురపాలక శాఖ జీవోను విడుదల చేసింది. ఇందులో రాష్ట్రస్థాయి సలహా కమిటీ చైర్మన్‌గా పురపాలక శాఖ కార్యదర్శి, కన్వీనర్‌గా డీఎంఏ (డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) వ్యవహరిస్తారు. సభ్యులుగా పంచాయతీరాజ్, రెవెన్యూ, కాలుష్యనియంత్రణ మండలి, డీటీసీపీ, వ్యవసాయం, కార్మికశాఖల అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్ లేదా అదనపు కమిషనర్ కంటే తక్కువ స్థాయిగల అధికారి సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా కేంద్ర పర్యావరణ, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, కాలుష్య నియంత్రణ మండలి, ఐఐటీ తదితర శాఖల అధికారులు ఉంటారు. రొటేషన్ పద్ధతిలో పట్టణ స్థానిక సంస్థల నుంచి ముగ్గురు సభ్యులు, సీడీఎంఏ నుంచి ఇద్దరు, ఎన్జీవో సంఘం నుంచి ఒకరు, పరిశ్రమలశాఖ నుంచి ఒకరు, వ్యర్థాల రీసైక్లింగ్ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. దాదాపు ఇరవై మంది సభ్యులు గల ఈ సలహా కమిటీ ప్రతి మూడునెలలకోసారి తప్పనిసరిగా సమావేశం కావాలి.

# రాష్ట్రంలో ఎకో-సెన్సిటివ్ జోన్ల ఏర్పాటు

- కిన్నెరసాని, పాకాల, ఏటూరునాగారం, శివ్వారం, హరిణవనస్థలి, మృగవని, మంజీర, పోచారం, ప్రాణహిత అభయారణ్యాలు.. పార్కుల చుట్టూ జోన్ల పరిధి నిర్ధారణ
- తుది నోటిఫికేషన్లు జారీచేసిన కేంద్రం


మెదక్ జిల్లాలోని మంజీర అభయారణ్య సరస్సులో కొంగల సందడి


ఖమ్మం జిల్లా కిన్నెరసాని అభయారణ్యం దృశ్యం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలోని అభయారణ్యాలు, జాతీయపార్కుల చుట్టూ ఎకో–సెన్సిటివ్ జోన్ల (పర్యావరణ సున్నిత ప్రాంతాలు) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్లను విడుదల చేసింది. కిన్నెరసాని, పాకాల, ఏటూరునాగారం, మంజీర, పోచారం, ప్రాణహిత, శివ్వారం, హరిణవనస్థలి, మృగవని జాతీయపార్కుల చుట్టూ సున్నిత ప్రాంతాల పరిధిని కేంద్రం అధికారికంగా నిర్ధారించింది. హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్‌పార్కుతోపాటు అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం, ఆదిలాబాద్ కవ్వాల్ టైగర్ రిజర్వుల సెన్సిటివ్ జోన్ల పరిధి త్వరలో ఖరారు చేయనున్నది. కేబీఆర్ పార్కు చుట్టూ 3 నుంచి 26 మీటర్ల వరకున్న ప్రాంతాన్ని ఎకో–సెన్సిటివ్ జోన్ పరిధిలోకి తేవాలని రాష్ట్ర అధికారులు తాజాగా నిర్ణయించారు. కేబీఆర్ పార్కు చుట్టూ 3నుంచి 8మీటర్ల వరకు సున్నిత ప్రాంతంగా ప్రకటించే అవకాశమున్నా వివాదాలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వ సూచన మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

**పాత జిల్లాల ప్రకారం సెన్సిటివ్ జోన్ల వివరాలు:**

రాష్ట్రంలో ప్రస్తుతం తొమ్మిది అభయారణ్యాలు, మూడు జాతీయపార్కులున్నాయి. చాలా వరకు అడవులు తరిగిపోయి, చుట్టూ జనావాసాలు పెరిగిపోవడం వల్ల పది కిలోమీటర్ల వరకు సెన్సిటివ్ జోన్ల ఏర్పాటు సాధ్యం కాదని గతంలోనే అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కిన్నెరసాని అభయారణ్యం చుట్టూ తూర్పు నుంచి పడమర వరకు ఒక కిలోమీటరు నుంచి 17 కిలోమీటర్ల వరకు సున్నితమైన జోన్‌గా ప్రకటించారు. వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం అభయారణ్యం చుట్టూ 3నుంచి 10కిలోమీటర్ల వరకు, ఇదే జిల్లాలోని పాకాల అభయారణ్యంతోపాటు మెదక్ జిల్లాలోని మంజీర, పోచారం అభయారణ్యాలు, ఆదిలాబాద్ జిల్లా ప్రాణహిత, రంగారెడ్డి జిల్లా చిలుకూరు మృగవని జాతీయ పార్కు చుట్టూ 3నుంచి 5కిలోమీటర్ల వరకున్న ప్రాంతాలను, మహావీర్ హరిణ వనస్థలి చుట్టూ రెండు కిలోమీటర్ల వరకున్న ప్రాంతాన్ని ఎకో–సెన్సిటివ్ జోన్లుగా పరిగణిస్తూ కేంద్రం తుది నోటిఫికేషన్లను విడుదల చేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నది. ఆయా జిల్లా కలెక్టర్లు జోనల్ మాస్టర్ ప్లాన్లు,మేనేజ్‌మెంట్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

**ఎందుకీ సెన్సిటివ్ జోన్లు?**

దేశవ్యాప్తంగా చాలావరకు అభయారణ్యాలు, అడవులు కబ్జాకు గురికావడం, జనావాసాలు పెరిగిపోవడం వల్ల వన్యప్రాణులకు రక్షణ కరువవుతున్నది. రక్షిత ప్రాంతాలలో మనుషుల ప్రవేశం పెరిగి వన్యప్రాణుల జనావాసాల్లోకి పరుగులు తీస్తున్నాయి. దీంతో చాలాచోట్ల జంతు, జనజీవన సంఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అభయారణ్యాలు, రక్షిత ప్రాంతాల చుట్టూ దాదాపు 10 కిలోమీటర్ల వరకున్న ప్రదేశాలను పర్యావరణ సున్నిత ప్రాంతాలుగా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే మొదట్లో దీనిపై చాలా రాష్ట్రాలు అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. జనావాసాలు పెరిగిపోయి, పట్టణాలు అభివృద్ధి చెందిన క్రమంలో ప్రతి అభయారణ్యం చుట్టూ 10కిలోమీటర్ల వరకు సెన్సిటివ్ జోన్‌ను ప్రకటించడం సాధ్యంకాదని పేర్కొన్నాయి. దాంతో ఆయా ప్రాంతాల పరిస్థితుల ఆధారంగా ఎంత మేరకు సున్నిత ప్రాంతాలుగా ప్రకటిస్తారనే విషయంపై వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని సుప్రీంకోర్టు సూచించింది. లేకపోతే అభయారణ్యాల చుట్టూ 10కిలోమీటర్ల వరకున్న ప్రాంతాల్ని సున్నిత ప్రాంతాలుగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీంతో తెలంగాణతోపాటు అన్ని రాష్ట్రాలు ఆ మేరకు ప్రతిపాదనలు పంపాయి. ఎకో–సెన్సిటివ్ జోన్లలో జన సంచారం, ఇతర సాధారణ కార్యక్రమాలకు అభ్యంతరాలుండవు. కానీ గనుల తవ్వకం, ప్రాజెక్టులు వంటి భారీ నిర్మాణ పనులకు అనుమతి ఉండదు. జోన్ల పరిధిలో పెద్ద ఎత్తున రోడ్లు వేయాలన్నా కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

# మిథనాల్‌తో కాలుష్యానికి చెక్!

- ఏటా వంద బిలియన్ డాలర్లను ఆదా చేయొచ్చు
- సీఎస్ఐఆర్-ఐఐసీటీ వార్షికోత్సవ సదస్సులో నీతిఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్


శనివారం హైదరాబాద్‌లో కౌన్సిల్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ సైంటిఫిక్ రిసర్చ్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ వార్షికోత్సవ సదస్సులో మాట్లాడుతున్న నీతిఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్

**తార్నాక:** క్రూడాయిల్ దిగుమతిని తగ్గించుకొని మిథనాల్ ఉత్పత్తిపై దృష్టిపెట్టాలని నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ సైంటిఫిక్ రిసర్చ్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్- ఐఐసీటీ) వార్షికోత్సవం సందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలోని బొగ్గునిక్షేపాల ద్వారా 200 ఏండ్లకు సరిపడా మిథనాల్‌ను ఉత్పత్తి చేయొచ్చన్నారు. దీనిపై శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టిపెడితే క్రూడాయిల్‌పై ఖర్చు పెడుతున్న నిధుల్లో ఏటా 100 బిలియన్ డాలర్లను ఆదా చేసుకోవచ్చని చెప్పారు. ఏటా 470 లక్షల (47 మిలియన్) టన్నుల మిథనాల్‌ను ఉత్పత్తిచేస్తూ ప్రపంచంలోనే చైనా అగ్రస్థానంలో ఉన్నదని, మన దగ్గర ఉన్న బొగ్గునిక్షేపాలు, బయోగ్యాస్ వంటి వాటిని ఉపయోగించుకుంటే ఆ స్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. పెట్రోల్, డీజిల్‌ను ఉపయోగిస్తే వాతావరణం కలుషితమవుతుందని, మిథనాల్ వల్ల పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని సారస్వత్ పేర్కొన్నారు. దీనిపై ప్రధాని ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. అదే స్ఫూర్తితో శాస్త్రవేత్తలు పరిశోధనలు విస్తృతం చేసి విదేశాల నుంచి క్రూడాయిల్ దిగుమతులను తగ్గించుకోవడానికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మిథనాల్‌ను డీఎంఈ ( డై మీథెల్ ఈథర్) ద్వారా ఎల్పీజీ గ్యాస్‌లోనూ వాడటానికి అవకాశం ఉన్నదని, దీని ఉత్పత్తి పెంచితే ఎల్పీజీ గ్యాస్ దిగుమతి కూడా తగ్గించుకోవచ్చని వివరించారు. ప్రస్తుతం రోజుకు 100 టన్నుల మిథనాల్ ఉత్పత్తిచేసే ప్లాంట్ ఏర్పాటుకు రూ.300 కోట్లు, 1600 టన్నుల మిథనాల్ ఉత్పత్తికి రూ.1200 కోట్లు అవసరం అవుతుందని పేర్కొన్నారు. జియోథర్మల్ పవర్‌తోనూ మిథనాల్ ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు. ఒక గ్యాలన్ మిథనాల్ ఉత్పత్తికి గంటకు 40 కిలోవాట్ల శక్తి కావాలని, మిథనాల్‌ను ఇంధనంగా ఉపయోగిస్తే దేశంలో 30 నుంచి 35 శాతం కాలుష్యం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. బొగ్గు నిక్షేపాలపై పరిశోధనల్లో ఐఐసీటీకి అనుభవం ఉండటంతో.. దీని సహకారం తీసుకోవాలని నిర్ణయించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, మాజీ డైరెక్టర్ జేఎస్‌యాదవ్, సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా, సీనియర్ సైంటిస్టు డాక్టర్ శైలజ, పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

## వచ్చే రెండురోజుల్లో చిరుజల్లులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రాబోయే 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో పాటు ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు, కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా ద్రోణి ఏర్పడినట్టు అధికారులు తెలిపారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే రెండురోజుల్లో అక్కడక్కడ చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

## ఏపీ సీఎంవోలో ఇష్టారాజ్యం

### నిబంధనలకు విరుద్ధంగా ఫైళ్ల నిర్వహణ

### అధికారుల తీరుపై చంద్రబాబుకు ఏపీ మాజీ సీఎస్ ఐవైఆర్ లేఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో కార్యకలాపాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని ఆ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు వెల్లడించారు. సీఎంవోలో ఉన్నతాధికారులు నిబంధనలను పాటించడంలేదంటూ ఏపీ సీఎం చంద్రబాబుకు శనివారం బహిరంగ లేఖ రాశారు. సీఎంవోలో జరుగుతున్న అక్రమ పద్ధతులను ఏకరువు పెట్టారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ హోదాలలో అధికారులు ఉన్నప్పటికీ, వీరెవ్వరూ ఫైళ్లపైన సంతకాలు చేయడంలేదని, పర్మినెంట్ రికార్డులు, వాటికి నోట్స్‌కూడా రూపొందించకుండానే నేరుగా సీఎంకు పంపిస్తున్నారని తెలిపారు. ఒక మంచి పద్ధతికి కేంద్రంగా ఉండాల్సిన సీఎంవో తగిన విధానాలు పాటించకపోవడం సంప్రదాయాలకు, చట్టాలకు విరుద్ధమని ఘాటుగా స్పందించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతీ పని, ఫైళ్ల నిర్వహణ పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ప్రతీశాఖ కార్యదర్శి, ఆ శాఖకు సంబంధించిన వ్యవహారాలపై మంత్రులకు లిఖితపూర్వక సమాచారం అందించాలన్నారు. సెక్రటేరియట్ మాన్యువల్ ప్రొసీజర్‌ను ఏపీ సీఎంవోలో అనుసరించడంలేదన్నారు. దీనివల్ల అధికారులు రాజకీయ నాయకత్వం కోరిన ఫైళ్లను మాత్రమే సీఎంకు పంపించి మిగతా ఫైళ్లను వెనుకకు నెట్టే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీ సీఎం వెంటనే ఈ విషయమై దృష్టి సారించి తన కార్యాలయాన్ని చక్కదిద్దుకోవాలని ఐవైఆర్ కృష్ణారావు హితవు చెప్పారు.

## 14న సౌదీకి హజ్ తొలి బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 14న రాష్ట్రం నుంచి హజ్ యాత్రికుల తొలి బృందం సౌదీ అరేబియాకు బయలుదేరి వెళ్లనుంది. హజ్ కమిటీ ద్వారా యాత్రకు వెళ్లేవారి ఎంపిక కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. 14వ తేదీ తెల్లవారుజామున 2.55 గంటలకు విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరుతుందని హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఎస్ఏ షుకూర్ తెలిపారు. ఎంపికైన యాత్రికులు ప్రయాణానికి 48గంటల ముందుగా హజ్ శిబిరానికి చేరుకోవాలని శనివారం హజ్ శిక్షణా శిబిరంలో సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్తలు మౌలానా షా మహ్మద్, జమాలుర్ రహ్మాన్, మౌలానా ముఫ్తీ తజమ్ముల్ హుస్సేన్, మౌలానా ఉబేదుర్ రహ్మాన్ అథర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో ఈవో తనిఖీలు

### సాలకట్ల బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

**తిరుమల, నమస్తే తెలంగాణ:** తిరుమలలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ ఒకటి వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో శ్రీవారి ఆలయ మాడవీధుల్లో శనివారం టీటీడీ ఈవో అనిల్‌మార్‌సింఘాల్ తనిఖీలు నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈవో తెలిపారు.

# 'రెరా' నిర్మాణాలకు బ్యాంకుల తోడ్పాటు!

### రెరాకు అనుగుణంగా నిర్మాణ సంస్థల ప్రణాళికలు

### కొనుగోలుదారుల సొమ్ముపై ఆధారపడకుండా నిర్మాణాలు

### 50-60 శాతం ఫైనాన్స్ ఇచ్చేలా బ్యాంకులను ఒప్పించే ప్రయత్నాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (రెరా)కి అనుగుణంగా రాష్ట్ర నిర్మాణ సంస్థలు తమ ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ మేరకు ప్రాజెక్టులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. 2017 జనవరి ఒకటి తర్వాత అనుమతులు తీసుకున్న ప్రాజెక్టులు ఈ చట్టం పరిధికి వస్తాయి. కాకపోతే, ఇప్పటికే నిర్మాణ సంస్థలన్నీ తమ అపార్టుమెంట్ల డిజైన్లు, విస్తీర్ణాన్ని ఖరారు చేసుకున్నాయి. అందుకు అనుగుణంగా అనుమతుల్ని కూడా తీసుకున్నాయి. ఈ క్రమంలో కొనుగోలుదారులకు ఇచ్చిన గడువు ప్రకారమే ప్రాజెక్టును పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో, నిర్మాణ పనులపై కూడా అంతే శ్రద్ధ చూపెడుతున్నాయి. గతంలో మాదిరిగా ప్రస్తుతం అమ్మకాలపై డెవలపర్లు ఆధారపడకుండానే నిర్మాణ పనుల్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. కొనుగోలుదారులిచ్చే సొమ్ముతో కాకుండా సొంత నిధులో, బ్యాంకు నుంచి అప్పు తీసుకునో పనులను చేపట్టాల్సి ఉంటుంది. దీంతో, ప్రాజెక్టును సకాలంలో అందించడం మీదే అధిక దృష్టి సారిస్తున్నాయి. 2017 జనవరి 1 నుంచి నేటివరకు రాష్ట్రవ్యాప్తంగా పలు నిర్మాణ సంస్థలు దాదాపు మూడు కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్నాయి. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, డీటీసీపీ పరిధిలో ఇవి ఆరంభమయ్యాయి. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి నగరాల్లో అధికశాతం అపార్టుమెంట్లు, విల్లాలు, వ్యక్తిగత గృహాలు ప్రారంభమయ్యాయి.

**70 శాతం జమ చేయాలి!**

2017 జనవరి ఒకటి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆరంభమైన ప్రాజెక్టుల్లో కొనుగోలుదారుల నుంచి వసూలుచేసిన సొమ్ములో 70 శాతాన్ని ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలో జమచేయాలి. ఈ నిబంధనను ప్రతి నిర్మాణ సంస్థ కచ్చితంగా పాటించాల్సిందే. దీంతో, నిర్మాణ సంస్థలన్నీ తమ ప్రణాళికలను మార్చుకుంటున్నాయి. ఇక నుంచి అమ్మకాలతో సంబంధం లేకుండా నిర్మాణ పనులను పూర్తి చేసేదిశగా ఆలోచిస్తున్నాయి. ఇప్పటివరకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ప్రతి ప్రాజెక్టులో కేవలం 30 నుంచి 35 శాతమే రుణంగా మంజూరు చేసేవి. ఇప్పుడు ఫైనాన్స్‌ను 50 నుంచి 60 శాతం ఇచ్చేందుకు బ్యాంకులను ఒప్పించే ప్రయత్నంలో నిర్మాణ సంస్థలు ఉన్నాయి. నిర్మాణానికెంత ఖర్చవుతుందో కొనుగోలుదారులతోపాటు బ్యాంకులకు తెలుస్తుంది. కాబట్టి, బ్యాంకులు విరివిగా రుణాలిచ్చేలా ఒప్పించే ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

**బ్యాంకుల మద్దతు అవసరం**

రెరా చట్టం వల్ల నిర్మాణ రంగంలో పారదర్శకత పెరుగుతుంది. బ్యాంకులు, ఆర్థికసంస్థలు ఇప్పటివరకు దాదాపు 30–35 శాతం రుణాలిచ్చేవి. 70 శాతం సొమ్మును ఎస్క్రో ఖాతాలో జమ చేయాలన్న నిబంధన ఉంది కాబట్టి.. ఇక నుంచి బ్యాంకులు తమ ఆలోచన విధానం మార్చుకోవాలి. కొనుగోలుదారుల నుంచి వసూలు చేసే సొమ్ము పక్కదారి పట్టే అవకాశం లేదు కాబట్టి.. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ధైర్యంగా నిర్మాణ ప్రాజెక్టులకు 60 శాతం దాకా ఫైనాన్స్ చేయాలి. అప్పుడే, మార్కెట్లో ఏ డెవలపర్ అయినా, అమ్మకాలతో సంబంధం లేకుండా నిర్మాణాల్ని పూర్తిచేయగలరు. **- ఎం విజయ్‌సాయి, ఉపాధ్యక్షుడు, ట్రెడా**

## తుమ్మలకు మంత్రి హరీశ్ పరామర్శ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సోమాజిగూడ యశోద దవాఖానలో చికిత్సపొందుతున్న రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. స్వల్ప అస్వస్థతతో తుమ్మల శుక్రవారం దవాఖానలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు దవాఖానకు వచ్చి తుమ్మల ఆరోగ్యపరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## వీడిన వైద్యురాలి అదృశ్యం మిస్టరీ

- రైవస్ కాలువలో శవమై తేలిన సూర్యకుమారి


మృతదేహాన్ని తరలిస్తున్న ఎన్టీఆర్ఎఫ్ బృందం, (ఇన్‌సెట్) సూర్యకుమారి (ఫైల్)

**అమరావతి, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో అదృశ్యమైన వైద్యురాలి ఉదంతం విషాదంగా ముగిసింది. ఐదు రోజుల క్రితం విజయవాడ లో అదృశ్యమైన డాక్టర్ కొర్లపాటి సూర్యకుమారి మృతదేహం శనివారం రైవస్ కాలువలో తేలింది. కాలువ వద్దున ఆమె స్కూటీని చూసినట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎన్డీఆర్ఎఫ్ బృందం కాలువలో గాలింపు చర్యలు చేపట్టింది. 27 మంది 14 కిలోమీటర్ల మేర గాలించగా రైల్వేగేటుకు సమీపంలోని రైవస్ కాలువలో ముళ్లకంపలో చిక్కుకొని ఉన్న సూర్యకుమారి మృతదేహాన్ని వెలికితీశారు. ఐదురోజులుగా నీళ్లలో ఉండటం వల్ల మృతదేహం గుర్తుపట్టలేకుండా మారిపోవడంతో తమ కుమార్తెను ఆ స్థితిలో చూడలేక సూర్యకుమారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సూర్యకుమారిది ఆత్మహత్యగా పోలీసులు భావిస్తున్నారు.

# జీఎస్టీ బిల్లు ఇవ్వాల్సిందే!

- 200 దాటితే తప్పనిసరి
- అంతకు తక్కువ ఉన్నా వినియోగదారులు కోరితే ఇవ్వాలి
- కంపోజిషన్ డీలర్లు జీఎస్టీ వసూలు చేయరాదు
- వాణిజ్య పన్నుల అధికారుల ఆదేశం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెండువందల రూపాయలకు మించి ఏ వస్తువును, లేదా సరుకును అమ్మినా జీఎస్టీ రిజిస్టర్డ్ డీలర్లు కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అధికారులు స్పష్టంచేశారు. వినియోగదారులు కోరితే స్టేట్ జీఎస్టీ యాక్ట్ సెక్షన్ 31(3)(బీ) ప్రకారం బిల్లు తప్పనిసరి. బిల్లు రెండువందల రూపాయల కన్నా తక్కువ ఉన్నా ఇన్వాయిస్ ఇవ్వాలని సూచించారు. ప్రతి వ్యాపారి జీఎస్టీ టిన్ నంబర్‌ను తమ వ్యాపార, వాణిజ్య కేంద్రాలలో ప్రముఖంగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. వాస్తవానికి ఏడాదికి రూ.20లక్షలలోపు టర్నోవర్ ఉన్న వ్యాపారులు జీఎస్టీ పరిధిలోకి రారు. వారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నది తప్పనిసరికాదు. టర్నోవర్ 20లక్షలు దాటితే రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వార్షిక టర్నోవర్ రూ.20లక్షల నుంచి రూ.75లక్షలలోపు ఉన్న వ్యాపారులు కంపోజిషన్ డీలర్ కిందకు వస్తారు. వీరు ఒక శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఉత్పత్తిదారులైతే 2%, హోటల్ వ్యాపారులు 5% జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. రూ.75 లక్షల టర్నోవర్ దాటినవారు పూర్తిస్థాయిలో జీఎస్టీ పరిధిలోకి వస్తారు. కంపోజిషన్ డీలర్ 'కంపోజిషన్ ట్యాక్సెబుల్ పర్సన్ నాట్ ఎలిజిబుల్ టు కలెక్ట్ ట్యాక్స్ ఆన్ సప్లయీస్' అని రాసి ఉంచాలని సూచించారు. కంపోజిషన్ డీలర్ ఇతర డీలర్ల మాదిరిగా జీఎస్టీని వినియోగదారుల నుంచి వసూలు చేయకూడదని దీని అర్థం. ఆ విషయాన్ని దుకాణాలు, లేదా వ్యాపారసంస్థల్లో స్పష్టంగా వినియోగదారులకు అర్థమయ్యేలా రాసి ఉంచాలని కోరారు. ఎస్‌జీఎస్టీ నిబంధన 10 ప్రకారం ప్రతి వ్యాపారి జీఎస్టీ టిన్ నంబర్‌ను ప్రదర్శించాలని వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ వీ అనిల్ కుమార్ స్పష్టంచేశారు.

## చట్టానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాను!

- కాగ్ వివాదంపై వివరణ ఇచ్చిన ఎన్టీఆర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తాను ఎల్లప్పుడూ చట్టానికి కట్టుబడి ఉంటానని సినీనటుడు ఎన్టీఆర్ శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. 'నాన్నకు ప్రేమతో' చిత్రాన్ని లండన్‌లో చిత్రీకరించగా ఈ సినిమాకు సంబంధించిన పన్నును ఎగుమతి సేవల కింద చూపుతూ చిత్ర కథానాయకుడు ఎన్టీఆర్ సర్వీస్‌ట్యాక్స్ ఎగవేసినట్లు కాగ్ నివేదిక బయటపెట్టిన విషయం తెలిసిందే. 'నాన్నకు ప్రేమతో లండన్‌లో నిర్మించిన చిత్రం. విదేశాల్లో అందించిన సర్వీస్‌కు భారతదేశంలో ట్యాక్స్ వర్తించదు అని నాకు చెప్పడంతోనే సినిమా నిర్మాతలవద్ద సర్వీస్ ట్యాక్స్ వసూలు చేయలేదు. 2016 సంవత్సరంలో ఇదే విషయంపై కాగ్ ప్రశ్నించగా మా ఆడిటర్లు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత ఎటువంటి నోటీసులు అందలేదు. ఏండ్లుగా ఆదాయం పన్ను, సర్వీస్‌ట్యాక్స్ క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాను. భారత పౌరుడిగా నా చట్టపరమైన బాధ్యతలను ఎప్పుడూ మరువలేదు. ఈ విషయంలో సంబంధిత అధికారుల నుంచి ఆదేశాలు అందిన వెంటనే నేను చట్టపరంగా చెల్లించాల్సిన రుసుము ఏమైనా ఉంటే అణాపైసలతో సహా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాను' అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.

## మెడిసిన్ సీ క్యాటగిరీ కౌన్సెలింగ్‌లో అంతరాయం

- సాంకేతికలోపమే కారణమంటున్న అధికారులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** మెడిసిన్ కోర్సుల్లో సీ క్యాటగిరీ సీట్ల భర్తీకోసం ఉస్మానియా యూనివర్సిటీలోని పీజీఆర్‌ఆర్సీడీఈలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌లో శనివారం కొంతసేపు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపంతోనే కౌన్సెలింగ్ నిలిచిపోయినట్లు అధికారులు ప్రకటించారు. కానీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వాదన మరోవిధంగా ఉంది. ఎన్నారై కోటాలో కొంతమంది దరఖాస్తు చేసుకోకపోవడంతో వారికి తరువాతి రోజు తిరిగి అవకాశం కల్పించారు. వారికి అవకాశం కల్పించకూడదని, ముందు దరఖాస్తుచేసుకున్నవారికే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ఎన్వీఎస్సెస్ ప్రభాకర్ అధికారులను డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు కౌన్సెలింగ్‌ను నిలిపివేశారని వారు తెలిపారు.



## రాష్ట్ర క్యాడర్‌లో మెజారిటీ వాటా ఇవ్వాలి

**90 శాతం తెలంగాణ ఉద్యోగులకే అవకాశాలు కల్పించాలి**

**రెవెన్యూ ఉద్యోగిపై ఐఏఎస్ దాడిని ఖండిస్తున్నాం: ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్**




హైదరాబాద్‌లో టీజీవో కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర క్యాడర్‌లో 90 శాతం తెలంగాణ ఉద్యోగులకే అవకాశాలు ఇవ్వాలని, పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని ప్రభుత్వానికి టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తిచేశారు. శనివారం హైదరాబాద్‌లో టీజీవో కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. కొత్త జిల్లాల్లో ఖాళీలను భర్తీ చేయాలని సర్కారును కోరారు. మహబూబ్‌నగర్‌లో రెవెన్యూ ఉద్యోగిపై ఐఏఎస్ అధికారి చేయిచేసుకోవడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఉద్యోగుల నిరసనలను ఆంధ్రా అధికారులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెల్‌నెస్ సెంటర్లు బాగా పనిచేస్తున్నాయని, అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుచేయాలని కోరారు. టీజీవో అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ 11వ పీఆర్సీ కోసం కమిటీని నియమించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులు, అధికారులకు మళ్లీ అవకాశాలు ఇవ్వొద్దని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు జీ విష్ణువర్ధన్‌రావు, కే పురుషోత్తంరెడ్డి, ఎస్ సహదేవ్, టీ రవీందర్‌రావు, మధుసూదన్‌గౌడ్, ఓంప్రకాశ్, మిర్జాఅలీబేగ్, డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్టభూములకు నీటివసతి కల్పించండి

- ఎస్సీ సహకార,అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ లచ్చిరాం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'దళితులకు ఇచ్చిన భూముల్లో పంట ఖర్చు కింద ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజేయాలి. మెట్టభూముల్లో బోర్లువేసి, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. మోటర్లు అందజేసి లబ్ధిదారులకు ఖర్చులేకుండా సాగు చేసుకునే ఏర్పాట్లు చేయాలి' అని అధికారులను ఎస్సీ సహకార, అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీ భూక్య లచ్చిరాం ఆదేశించారు. శనివారం కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, వికారాబాద్, సూర్యాపేట జిల్లాల ఈడీలతో హైదరాబాద్‌లో ఆయన సమావేశమయ్యారు. వ్యవసాయ భూమి కొనుగోలు పథకం, బ్యాంకుల సహకారంతో అమలుచేస్తున్న ఆర్థిక సహాయ పథకాలు, గుడుంబా తయారీదారుల పునరావాస, స్వయం ఉపాధి పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో నిరుద్యోగ యువతకు వివిధ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు అభ్యర్థులను ఎంపికచేయాలని ఆదేశించారు.

## • మెగాస్టార్‌తో కవిత సెల్ఫీ



శనివారం పార్లమెంట్‌లో ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ అనంతరం రాజ్యసభ సభ్యుడు, మెగాస్టార్ చిరంజీవితో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సెల్ఫీ దిగారు. ఈ ఫొటోను కవిత తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

## నీతిఆయోగ్ కొత్త సారథి రాజీవ్‌కుమార్


మొదటిపేజీ తరువాయి...


సభ్యుడిగా విధులు నిర్వర్తించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్(సీఐఐ)కు చీఫ్ ఎకనామిస్ట్‌గానూ పనిచేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, భారత పరిశ్రమల శాఖ, కేంద్ర ఆర్థికశాఖల్లో ఉన్నతహోదాల్లో విధులు నిర్వర్తించారు. అంతేగాక పలు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో సభ్యుడిగా పనిచేశారు. రియాద్‌లోని కింగ్ అబ్దుల్లా పెట్రోలియం స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్, జకార్తాలోని ఎకనామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఏషియాన్ అండ్ ఆసియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర బోర్డుల్లో సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. మరోవైపు నీతిఆయోగ్ సభ్యుడిగా ఎయిమ్స్‌లో పనిచేస్తున్న పిల్లల వైద్యుడు డాక్టర్ వినోద్ పాల్ ఎంపికయ్యారు.

# కోసినీ.. ఇక మొగులు దిక్కు చూడదు!

- రైతుల 12 ఏండ్ల కల సాకారంచేసిన టీఆర్‌ఎస్ సర్కారు
- కొమురంభీం ఎడమ కాల్వకు నీటి విడుదల
- పట్టుబట్టి ప్రాజెక్టును గాడిలో పెట్టిన మంత్రి హరీశ్‌రావు
- నాలుగు రోజుల్లో పూర్తి స్థాయిలో నిండనున్న కోసినీ
- పాత ఆయకట్టు 550 ఎకరాలతోపాటు కొత్తగా 15వేల ఎకరాలకు సాగునీరు





పాత ఆదిలాబాద్ జిల్లాలోని కోసినీ చెరువు.. నీటి విడుదల సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, అధికారులు

**హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పాత ఆదిలాబాద్ జిల్లాలోని కోసినీ చెరువు పంట పండింది. వర్షాలు పడితే తప్ప నీళ్లు నిండని ఈ చెరువు.. ఇప్పుడు ఏడాది పొడుగునా నీళ్లతో కళకళలాడబోతున్నది. ఇప్పటిదాకా 550 ఎకరాల ఆయకట్టు ఉన్న కోసినీ.. ఇకపై మరో 15వేల ఎకరాలకూ సాగునీరు అందించబోతున్నది. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ప్రాజెక్టు అధికారులు కొమురం భీం ప్రాజెక్టు నుంచి కోసినీకి శనివారం నీటిని విడుదలచేశారు. దీంతో పన్నెండేండ్ల నాటి కల సాకారం అయిందంటూ రైతులు ఆనందంలో మునిగిపోయారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టున్న కొమురం భీం ప్రాజెక్టును రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు గాడిలో పెట్టడంతో ఇప్పుడు కోసినీ జలకళలాడబోతున్నది.

**కాంగ్రెస్ హయాంలో నత్తనడకన పనులు**

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొమురం భీం ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. పది టీఎంసీల సామర్థ్యంతో ఉండే ఈ ప్రాజెక్టు కింద 45,500 ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. ప్రాజెక్టు కుడి కాల్వ కింద ఆరువేల ఎకరాలు, ఎడమ కాల్వ కింద 39,520 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాజెక్టు కోసం అటవీభూములు సహా 9300 ఎకరాల భూమి అవసరమైంది. కీలకమైన భూసేకరణ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించలేదు. ఫలితంగా.. తెలంగాణ ఏర్పడే నాటికి తొమ్మిది వేల ఎకరాలకు కూడా సరిగ్గా సాగునీరు ఇచ్చిన దాఖలాలు లేవు.

**వెంటపడిన హరీశ్‌రావు**

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆదిలాబాద్ జిల్లా ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నిత్యం ఆదిలాబాద్ ప్రాజెక్టులపై సమీక్షించారు. అధికారుల వెంటపడి ప్రాజెక్టుల్లో ఎక్కడెక్కడ సమస్యలున్నాయి? అడ్డంకులేమిటి? అనే అంశాలపై దృష్టిసారించారు. కీలకమైన భూసేకరణను వేగవంతంచేశారు. భూసేకరణ కోసం జిల్లా కలెక్టర్ దగ్గర ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులను అందుబాటులో ఉంచడంతో పనులు పరుగులుతీశాయి. ప్రత్యేక చొరవ చూపడంతో కోర్టు కేసులూ పరిష్కారమయ్యాయి. 130 ఎకరాల అటవీ భూములను కూడా సేకరించడంతో కాల్వల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఇలా చిక్కుముళ్లను విప్పి 940 ఎకరాల సేకరణను పూర్తిచేశారు.

**నాడు 9 వేల ఎకరాలు.. నేడు 24,500 ఎకరాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కింద 9 వేల ఎకరాలలోపు ఆయకట్టుకు నీరందిస్తే.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం 24,500 ఎకరాలకు నీరందించింది. ఈ వానాకాలం పంట సీజన్‌కు ఇది మరింత పెరుగనుంది. దీంతోపాటు ఎడమకాల్వపై 45 కిలోమీటర్ వద్ద ఉన్న కోసినీ చెరువు సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.40 కోట్లు వెచ్చించి.. 19వేల ఎంసీఎఫ్‌టీ నుంచి 1.70 లక్షల ఎంసీఎఫ్‌టీకి పెంచారు. ఇప్పుడు ఎడమ కాల్వ నుంచి కోసినీకి నీటి విడుదల కావడంతో గతంలో ఒక్క పంటకూ నీరందని పాత ఆయకట్టుకు ఇప్పుడు రెండు పంటలకూ సాగునీరు అందనుంది. శనివారంనుంచి ఎడమకాల్వ ద్వారా చెరువుకు 400 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా నాలుగైదు రోజుల్లోనే పూర్తిస్థాయిలో చెరువు నిండనుందని అధికారులు చెప్పారు. కొత్త ఆయకట్టుకు నీరందించేందుకు పనులు త్వరలో పూర్తికానున్నట్లు తెలిపారు.

# కౌలు చట్టాలను మార్చాలి

- భూ యజమానుల భూమికి రక్షణ ఇవ్వాలి
- కౌలుకు చట్టబద్ధతనివ్వాలి
- రాయితీలన్నీ కౌలుదారునికే ఇవ్వాలి
- ఒప్పందకాలంలో పూర్తి హక్కులు కల్పించాలి
- కౌలుదారుల భూమిహక్కు క్లాజ్ తొలగించాలి
- కౌలు వివాదాల్లో ట్రిబ్యునల్‌దే అంతిమ తీర్పు
- వ్యవసాయరంగంలో అభివృద్ధికి ఇదే మార్గం
- నీతిఆయోగ్‌కు తేల్చిచెప్పిన నిపుణుల కమిటీ
- నమూనా చట్టాన్ని రూపొందించిన నీతిఆయోగ్
- అమలు చేస్తున్న ఒడిశా రాష్ట్రం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే కౌలుదారి చట్టాల్లో మార్పులు అవసరమని నీతి ఆయోగ్ నిపుణుల కమిటీ తెలిపింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత చట్టాల్లో భూమిమీద యజమాని హక్కులను హరించివేసేలా ఉన్న క్లాజులను తొలగించాలని, కౌలుదారులకు బ్యాంకు రుణాలు, ప్రకృతి విపత్తుల పరిహారం సహా అన్ని రకాల సాగు ప్రయోజనాలు చేకూరేలా పూర్తి చట్టబద్ధత కల్పించాలని సూచించింది. ప్రస్తుత కౌలు చట్టాల కారణంగానే దేశవ్యాప్తంగా లక్షల ఎకరాల భూములు పడావుగా ఉండిపోతున్నాయని, ఫలితంగా నిరుపేద రైతుకు భూములు కౌలుకు లభించని స్థితి ఏర్పడిందని కమిటీ తన అధ్యయనంలో గమనించింది. ఉన్న కౌలుదారులకు కూడా ప్రభుత్వం ప్రకటించే ఏ వ్యవసాయ రాయితీ దక్కడం లేదని గుర్తించింది. దీన్ని నివారించేందుకు ఏడు సూచనలను చేసింది. ఈ మేరకు నీతి ఆయోగ్ నమూనా వ్యవసాయ భూమి కౌలు చట్టాన్ని ప్రకటించింది.

**ఇదీ నేపథ్యం...**

దేశంలో వ్యవసాయరంగానికి చెందిన వివిధ సమస్యలపై నీతి ఆయోగ్ దృష్టి సారించింది. దీని మీద అధ్యయనానికి డాక్టర్ టీ హక్ చైర్మన్‌గా ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దేశంలోని వివిధ రాష్ట్రాలు పర్యటించి ఆయా ప్రభుత్వాలతో చర్చించింది. క్షేత్రస్థాయిలో వాస్తవికంగా జరుగుతున్నది ఏమిటి? రైతుల కష్టాలు ఏమిటి? ఉత్పాదకత తగ్గడానికి గల కారణాలు, టెనెన్సీ, కౌలుదారీ చట్టాల అమలు తీరుతెన్నులు, లోపాలను అధ్యయనం చేసింది.

**గుర్తించిన అంశాలు...**

కమిటీ అధ్యయనంలో వివిధ అంశాలు వెలికి వచ్చాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో భారీ విస్తీర్ణంలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమి కూడా సాగు చేయడం లేదు. చాలా మంది భూయజమానులు తమ భూములను సేద్యానికి ఇవ్వటం లేదు. దీనితో సేద్యం చేయగలిగిన రైతులకు భూములు లభ్యం కావడం లేదు. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వాళ్లు సేద్యం చేయడం లేదు. కౌలుకు ఇవ్వటం లేదు. ఒక వేళ కౌలుకు ఇచ్చినా ఎలాంటి అగ్రిమెంట్లు లేకుండా ఇస్తున్నారు. దీనితో కౌలు రైతులకు ఏ రక్షణ లేకుండా పోతున్నది. బ్యాంకులకు ఎలాంటి ఆధారం చూపించే అవకాశంలేక పెట్టుబడి కోసం ప్రైవేట్ అప్పులకు వెళ్లి నష్టపోతున్నారు. మరోవైపు ప్రభుత్వం ప్రకృతి విపత్తుల పరిహారం సహా వివిధ కారణాలతో ప్రభుత్వం ఇస్తున్న ఏ రాయితీ కూడా కౌలుదారునికి దక్కడం లేదు. ఇదంతా వ్యవసాయాన్ని కుదేలు చేస్తున్నది.

**ఎందుకిలా...?**

స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో భూస్వాములు, జమీందార్ల చేతుల్లో భూమి కేంద్రీకృతమై ఉండేది. సాగు చేసే రైతులంతా జీతగాళ్లు గానో.. కౌలుదార్లు గానో ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చిన ఆనాటి పరిస్థితుల్లో సాగు చేసే రైతులకే ఆయా భూములపై హక్కులు కల్పించే విధంగా వివిధ రాష్ట్రాలు పోటాపోటీగా చట్టాలు తీసుకువచ్చాయి. ఆ చట్టాల కారణంగా సాగుచేయని భూయజమానులు తమ భూములను కౌలుకు ఇవ్వడానికి భయపడుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిలో కౌలుకు ఇస్తే తమ భూములకు రక్షణ ఉంటుందా? అన్న భయం నెలకొన్నది. ఒకవేళ కౌలుకు ఇవ్వవలిసి వచ్చినా ఎలాంటి రాతకోతలు లేకుండా జాగ్రత్తపడుతున్నారు. కౌలుదారులు స్థానిక అధికారులతో కుమ్మక్కై భూమిపై హక్కుల కోసం భూమి యజమానికి న్యాయపరమైన చిక్కులు సృష్టించిన సందర్భాలు కూడా ఉన్నాయి. రెండవ పంచవర్ష ప్రణాళిక నాటికి జరిపిన అధ్యయనంలో ఈ చట్టాలు కొంత మేరకు మాత్రమే అమలు జరిగినట్టు తేలింది. 1960 నుంచి 1970 వరకు టెనెన్సీ చట్టంలో చేసిన సవరణలు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేదు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చట్టపరంగా చేసిన సవరణలు ఫలితాల నివ్వలేదు సరికదా కౌలుదారుడు నష్టపోయాడు. నూతన కౌలు చట్టాల వల్ల భూయజమాని అభద్రతాభావానికి గురికావడంతో ఎక్కడా కౌలుదారులకు అగ్రిమెంట్ల పద్ధతి అమలుకాలేదు. ఇదంతా టెనెన్సీ చట్టం వల్ల జరుగుతున్న నష్టంగానే కమిటీ గుర్తించింది.

**కమిటీ సూచనలు..**

వ్యవసాయరంగం పురోగమించి ఉత్పత్తి పెరగాలంటే భూయజమానులు తమ భూములను ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా కౌలుకు ఇవ్వాలి. కొద్దిసంవత్సరాలు కౌలుకు ఇస్తే తమ భూములు తమకు కాకుండా కౌలుదారే యజమాని అవుతాడనే భయం పోవాలి. అలాగే భూమిని కౌలుకు తీసుకొని సేద్యం చేసే రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తి రాయితీలు చట్టబద్దంగా అందాలి. వ్యవసాయ పెట్టుబడులకు బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితి రావాలి. అప్పుడే దేశం వ్యవసాయ రంగం పురోగమిస్తుందని నీతిఆయోగ్ భావించింది. ఈ మేరకు నమూనా చట్టాన్ని నీతిఆయోగ్ రూపొందించింది. ఈ చట్టాన్ని ఇప్పటికే ఒడిషా ఆయోదించుకొని అమలు చేస్తుస్తున్నది. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయి.

(నూతన చట్టంలోకి ముఖ్యాంశాలేమిటి? : రేపు)

## హోంగార్డుల సమ్మెతో మాకు సంబంధంలేదు

- సంఘం అధ్యక్షుడు రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొంతమంది హోంగార్డులు సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారని, వారితో తమకు ఎలాంటి సంబంధంలేదని హోంగార్డ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, తమ సంఘం గౌరవాధ్యక్షుడు, శాసనసభ్యులు వీ శ్రీనివాస్‌గౌడ్‌పై తమకు పూర్తినమ్మకం ఉందన్నారు. హోంగార్డుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాత కూడాసమ్మెకు దిగుతామనడం సమంజసంకాదని రాజేందర్ హితవు పలికారు.

## ఒత్తిడిని జయించడంపై రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఉద్యోగులు ఒత్తిడిని ఎలా జయించాలి' అనే అంశంపై శనివారం శిక్షణాతరగతులు నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వవికాస నిపుణుడు బీవీ సత్యనగేశ్ ఆధ్వర్యంలో నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఈ తరగతులను ఏర్పాటు చేశారు. ఒత్తిడిని జయించే టెక్నిక్స్‌ను సత్యనగేశ్ వివరించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని అధిగమించాలనే సంకల్పంతో రెవెన్యూ ఉద్యోగులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేసినట్లు సంఘం అధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## టెట్‌లో 'రామయ్య' ప్రభంజనం



సిరికొండ లక్ష్మీనారాయణ

**ఆర్కేపురం:** తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టీఎస్ టెట్-2017) ఫలితాల్లో తమ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించడంతోపాటు 96 శాతం మంది అర్హత సాధించారని హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ రామయ్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు సిరికొండ లక్ష్మీనారాయణ, సిరికొండ సునీత పేర్కొన్నారు. టెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు వారు అభినందనలు తెలిపారు. గురుకుల మెయిన్స్, డీఎస్సీలో కూడా తమ విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విజయానికి కారణమైన అధ్యాపక బృందానికి, కోఆర్డినేటర్లకు, అడ్మినిస్ట్రేషన్ బృందానికి డైరెక్టర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఈ పాస్ సక్సెస్

- డీలర్ల అక్రమాలకు చెక్
- మహబూబ్‌నగర్‌లో నెలకు రూ.3.5 కోట్లు ఆదా
- మిగతా 5 జిల్లాల్లోనూ..
- 40 రోజుల్లో అన్ని జిల్లాలకు విస్తరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పౌరసరఫరాలశాఖలో అక్రమాలు జరిగేవి. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు అధికారుల పాత్ర ఉండేదని ఆరోపణలు వినిపించాయి. సరుకుల సరఫరాలో మిల్లర్లు, డీలర్లు చేతివాటం చూపిస్తారనే అపవాదు ఉన్నది. ఇది గతం.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ శాఖను ప్రక్షాళన చేసేందుకు నడుంబిగించారు. పౌరసరఫరాలశాఖలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రేషన్‌షాపుల వద్ద ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ పాస్) యంత్రాలను ఏర్పాటుచేశారు. 2016 మార్చిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 1,545 రేషన్‌షాపుల్లో ఏర్పాటుచేసిన ఈ పాస్ యంత్రాల వల్ల ప్రతి నెల రూ.280 కోట్లు ఆదా అవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. వీటిని అన్ని జిల్లాల్లో ఏర్పాటుచేయాలని సంకల్పించారు. తొలిసారి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ పాస్ యంత్రాలను ఏర్పాటుచేశారు. రెండు నెలల్లో ఇక్కడ రూ.7 కోట్లు ఆదా కావటంపై పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ హర్షం వ్యక్తంచేశారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని మరో 40 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ యంత్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


**పౌరసరఫరాల శాఖలో సంస్కరణలు**

పౌరసరఫరాలశాఖపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించి కమిషనర్‌గా సీవీ ఆనంద్‌ను నియమించారు. దీంతో సంస్కరణలు మొదలయ్యాయి. బోగస్ కార్డుల ఏరివేత, ఆధార్‌తో అనుసంధాన ప్రక్రియ చేస్తూనే.. నూతన విధానాలను ప్రవేశపెట్టారు. గతేడాది జీహెచ్‌ఎంసీ పరిధిలో అమల్లోకి వచ్చిన ఈ పాస్ యంత్రాలను జిల్లాలకు పంపించేందుకు రంగం సిద్ధంచేశారు. ఐదు నెలల క్రితం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, పౌరసరఫరాలు, ఫైనాన్స్‌కు సంబంధించిన అధికారులతో కమిటీవేశారు. ప్రస్తుతం ఉన్న ఈ పాస్ యంత్రాల కంటే మరింత అధునాతనంగా రూపొందించాలని, జిల్లాలకు విస్తరించాలని సూచించారు. వాయిస్ ఓవర్, ఐరిస్, నగదురహిత విధానం ఉండేలా మిషన్లు ఉండాలని పేర్కొన్నారు. ఈ తరహా ఫీచర్లు ఉన్న మిషన్లను అద్దె విధానంలో సరఫరా చేసేందుకు ఒయాసిస్ కంపెనీ ముందుకొచ్చింది. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 7న మహబూబ్‌నగర్ జిల్లాలోని 799 రేషన్ దుకాణాల్లో ఏర్పాటుచేశారు. నెలకు రూ.3.5 కోట్ల చొప్పున.. మే, జూన్ నెలలకు రూ.7 కోట్లు ఆదా అయినట్లు అధికారులు గుర్తించారు. ప్రయత్నం సఫలమవడంతో మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో విస్తరించారు. మరో 25 రోజుల్లో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోనూ ఏర్పాట్లు చేస్తుండగా.. అక్టోబర్ చివరికల్లా అన్ని జిల్లాల్లో ఈ పాస్ యంత్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**అక్రమాలకు అడ్డుకట్ట**

పాత పద్ధతిలో రేషన్‌డీలర్లు అక్రమాలకు పాల్పడేందుకు వీలుండేది. కార్డుదారులకు బియ్యం సరఫరా చేయకుండా పక్కదారి పట్టించేవారు. రేషన్ తీసుకోని కోటాను తప్పుడు లెక్కలు చూపి అమ్ముకునేవారు. ఇకమీదట ఇది సాధ్యపడదు. వేలి ముద్రలతోపాటు వాయిస్‌ఓవర్, ఐరిస్ విధానం వల్ల అర్హులకే బియ్యం అందనున్నది. నగదురహిత లావాదేవీలు పూర్తిస్థాయిలోకి అమలులోకి వస్తే రోజువారీ సమాచారం పౌరసరఫరాల భవన్ ఆధీనంలోకి రానున్నది.

### రూ. 800 కోట్లు ఆదా



ఈ పాస్ యంత్రాల వినియోగం సత్ఫలితాలిస్తున్నది. మరిన్ని ఫీచర్లతో కూడిన యంత్రాలను జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. మరో నెలరోజుల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఈ యంత్రాలు అందుబాటులోకి వస్తాయి. సెప్టెంబర్ చివరినాటికి అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసే ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రూ.800 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని అంచనా వేస్తున్నాం. **-సీవీ ఆనంద్, పౌరసరఫరాలశాఖ కమిషనర్**

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 6 ఆగస్టు 2017
WWW.NTNEWS.COM

జిందగీ పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



# ఆదారాల అనుబంధాలు

**రెండు దారాలు.. ఒకటి స్నేహానుబంధానికి గుర్తుగా చేతికి కట్టేదారం.. ఇంకోటి సోదరీ సోదరుల అనుబంధానికి గుర్తుగా, రక్షగా కట్టేదారం..ఈ రోజు ఫ్రెండ్‌షిప్ డే. రేపు రక్షాబంధన్.**

**రెండు దారాలు.. ఆ దారాలే.. అనుబంధాలకు ఆధారాలు. ఈ రెండు పండుగల సందర్భంగా.. పలువురు ప్రముఖులు తమ స్నేహబంధాల గురించి, సోదరీసోదరులతో అనుబంధాల గురించి జిందగీతో పంచుకున్నారు.**

### సెలబ్రేషన్ తక్కువ



చిన్నప్పటి నుంచి హాస్టల్‌లో ఉండి చదివాను. టైమ్‌కు సెలవులు ఇవ్వరు కాబట్టి ఏం చేసుకున్నా ఆ నాలుగు గోడల మధ్యే. ఫ్రెండ్‌షిప్ డే ముందు రోజు బయటికి పంపించేవారు. దాంతో కలర్‌ఫుల్ బ్యాండ్‌లు కొనుక్కొచ్చి ఫ్రెండ్స్‌కి కట్టేది. అందరూ ఎవరెవరు కడుతారు? ఎవరికెన్ని బ్యాండ్స్ వచ్చాయని లెక్క పెట్టుకునేది. పదోతరగతి వరకు నా ఫ్రెండ్‌షిప్ డే అలాగే జరిగింది. హైదరాబాద్ వచ్చినంక ఫ్రెండ్స్ లిస్ట్ పెరిగింది. ఆ రోజు సినిమాకు వెళ్లేవాళ్లం. ఎలాగూ సండేనే కాబట్టి కాలేజ్ బంక్ కొట్టే అవకాశం ఉండకపోయేది. సినిమా అంటే ఇంట్లో వాళ్లు కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పకపోయేది. ఇప్పుడు ఫ్రెండ్స్‌ని కలువడమే తగ్గిపోయింది. కొందరు విదేశాల్లో ఉన్నారు. కొందరు ఇక్కడ, బెంగళూరులో ఉన్నారు. ప్రతి శనివారం ఇక్కడ ఉన్నవాళ్లను ఇద్దరుముగ్గురినైనా కలుస్తా. కలిసి క్రికెట్ ఆడుతాం. అప్పుడప్పుడు బెంగళూరు నుంచి కూడా ఫ్రెండ్స్ వస్తుంటారు. ఫేస్‌బుక్‌లు, వాట్సప్‌లు వచ్చినంక పాత ఫ్రెండ్స్ చాలామందితో టచ్‌లోకి వచ్చా. వాళ్లంతా నన్ను హీరోగా చూసి చాలా సంతోషపడుతున్నారు. నాకు అక్కా చెల్లెళ్లు లేరు కాబట్టి.. మా పెద్దమ్మ కూతురు నాకు రాఖీ కడుతుండేది. నాకు చిన్నప్పుడు రాఖీ కడితే డబ్బులివ్వాలి వంటి విషయాలు తెలియక పోతుండే. అమ్మ చెప్పింది.. రాఖీ కడితే ఏదో ఒక బహుమతి ఇవ్వాలని. అప్పటి నుంచి అక్కకు ఏదో ఒక గిఫ్ట్ ఇస్తున్నాను.

**విజయ్ దేవరకొండ**

### ఇప్పటికీ దాచుకున్నా!

అందరికీ హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే, హ్యాపీ రాఖీ. స్కూల్, కాలేజ్ వరకు బాగా సెలబ్రేట్ చేసుకొనేవాళ్లం. చిన్నప్పుడైతే.. గ్రీటింగ్ కార్డులు ఇవ్వడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ లెక్కేసుకోవడం భలే సరదాగా ఉండేది. మాదొక గర్ల్స్ బ్యాచ్ ఉండేది. ముందు రోజే ఒక షాప్‌కి వెళ్లి బ్యాండ్స్ కొనేవాళ్లం. కచ్చితంగా నాకీ కలర్, ఈ డిజైనే కట్టు అని వాళ్ల చేత కొనిపించేవాళ్లం. ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది. ఆ గ్రీటింగ్ కార్డ్స్, బ్యాండ్స్ ఇప్పటికీ నేను భద్రంగా దాచి పెట్టుకున్నా. ఆ స్నేహం అలా గుర్తుండిపోవాలన్నది నా కోరిక. నా ఫ్రెండ్స్‌లో చాలావరకు విదేశాల్లోనే ఉన్నారు. వాళ్లని చాలా మిస్ అవుతున్నా. నాకు ఒక అక్క, ఒక చెల్లి ఉన్నారు. అందరికంటే వీళ్లిద్దరూ నా బెస్ట్ ఫ్రెండ్స్ అని చెప్పుకోవచ్చు. వాళ్లు నాకె లాంటి కష్టం రాకుండా చూసుకుంటారు. ఇక రాఖీ గురించి అంటారా.. చెప్పా కదా మేం ముగ్గురం ఆడపిల్లలమే! దాంతో కజిన్స్‌కి రాఖీ కట్టేదాన్ని. నేను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు నా క్లాస్‌మెట్ ఒక అబ్బాయికి రాఖీ కట్టా. అతను నాకు టెన్త్‌లో ప్రపోజ్ చేశాడు. నేను షాక్. అన్నయ్యలా అనుకున్న మనిషి అలా చేశాడేంటి అనిపిస్తుంటుంది ఇప్పటికీ.

**ఈషా రెబ్బా**



### రాఖీ పంపిస్తా..



నా చిన్ననాటి స్నేహితులు స్వాతి సేమ్‌వాల్, శ్రావ్యవర్మ, వర్మీనా, సారిక అంటే నాకెంతో ఇష్టం. కెరీర్‌లో నా ఎదుగుదలకు వాళ్ల ప్రోత్సాహం మరువలేనిది. వాళ్లని రోజూ కలువలేకపోయినా, మా స్నేహం ఎంతో ప్రత్యేకమైనది. ఇండస్ట్రీలోనూ నాకు చాలామంది మంచి స్నేహితులున్నారు. జీవితంలో నాకు లభించిన మంచి గిఫ్ట్ నా సోదరుడు. తను నాకెప్పుడూ సపోర్టివ్‌గా ఉంటాడు. అందుకే తనంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. ప్రతి రాఖీ పండుగకు తనతో ఉండలేక పోయినా, రాఖీ పంపిస్తుంటాను.

**లావణ్య త్రిపాఠి**

### ప్రతీ సంవత్సరం పెరుగుతుండాలి..

నాకు నలుగురు అక్కలు. కాబట్టి రాఖీ నాకు పెద్ద పండుగ. చిన్నప్పుడు వాళ్లు పండుగ కోసం వెయిట్ చేస్తుండె. ఎందుకంటే.. ఎంతోకొంత పాకెట్ మనీ వస్తాయి కదా! చిన్నప్పుడు నాన్న ఇచ్చేవాడు.. కాబట్టి సరిపోయింది. ఆడపిల్లలకి ఇస్తే మనకు ఆదాయం పెరుగుతుందంటారు పెద్దలు. అందుకే ప్రతి సంవత్సరం వాళ్లకిచ్చేది పెంచుకుంటూ పోవాలన్నది టార్గెట్‌గా పెట్టుకున్నా. ఇప్పటికీ అలాగే చేస్తున్నా. ఈ సంవత్సరం ఆ రోజు బాగా చూసుకొని పంపాలని అనుకుంటున్నా. కాలేజ్‌లో ఉన్నప్పుడు నేను ప్రపోజ్ చేయాలనుకున్న అమ్మాయి రాఖీ కడుతుందనే భయం నాకు ఎప్పుడూ లేదు. నా ఫేస్ మీద నాకంత నమ్మకం. ఇంటర్ నుంచి కామారెడ్డిలో విశాల్, సిద్ధిపేటలో మహేష్ నాకు బెస్ట్ ఫ్రెండ్స్. ఫ్రెండ్‌షిప్ డే రోజు వారిని మిస్సవుతున్న ఫీలింగ్ ఉంది. కానీ ఖాళీ దొరికితే కామారెడ్డిలో వాలిపోతా. విశాల్ ఇంటి టెర్రస్ మీద క్రికెట్, టెన్నిస్ ఆడుతుంటా. మా ముగ్గురికీ తిండి, సినిమాలంటే పిచ్చి. ఆటలయ్యాక మంచిగా బిర్యానీలు తెప్పించుకుంటాం. మేం వెళ్లిన సినిమాల లిస్ట్ ఉంటుంది కదా! వాటన్నిటి సీడీలు తెప్పించుకుంటాం. తినుకుంటూ ఆ పాత సినిమాలు చూస్తూ ఎంజాయ్ చేస్తాం. ఈ సందర్భంగా ఒక మాట చెప్పాలని ఉంది. ఎంత బిజీగా ఉన్నా ఫ్రెండ్స్ కోసం కొంచెం టైమ్ కేటాయించండి.

**వెన్నెల కిషోర్**



### అక్క ఉంటే..



వాలెంటెన్స్ డే.. ఇంకా ఇతర డేలు తీసుకున్నా పర్టిక్యులర్‌గా ఇద్దరి మనుషుల మధ్య బంధాన్ని గుర్తు చేస్తుంది. కానీ ఫ్రెండ్‌షిప్ డే మాత్రం ఒక్కరితో ఆగిపోదు. నా విషయంలో ఈ సంఖ్య మరీ ఎక్కువ. బంధువుల్లో, ఇండస్ట్రీలో నాకు చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఫ్రెండ్స్ అయితే కేవలం అతడితో బంధం ఆగిపోదు. వాళ్ల ఇంటి వాళ్లు కూడా మనల్ని స్వీకరిస్తారు. మరిన్ని బంధాలు ఏర్పడుతాయి. నాకు 20 సంవత్సరాలున్న ఫ్రెండ్స్ ఉన్నారు, 60 సంవత్సరాల వారూ ఉన్నారు. అంటే.. స్నేహానికి వయసు, కులం, మతంతో పనిలేదు. పైగా అన్ని విషయాలను మనం ఇంట్లో వాళ్లతో షేర్ చేసుకోలేం. అప్పుడు మనల్ని ప్రతిబింబించే ఒక మనిషి కావాలి. అతడే స్నేహితుడు. మంచి, చెడు అతనితో పంచుకుంటాం. ఆలీ తమ్ముడు ఖయ్యూం నాకు మంచి ఫ్రెండ్. అతడు ఆరు సంవత్సరాల వయసు ఉన్నప్పటి నుంచి నాకు బెస్ట్ ఫ్రెండ్. ఇప్పుడు నాని, శర్వా, మనోజ్.. మేం కలిస్తే రచ్చనే. ఫ్రెండ్స్ అంటేనే గోల కదా! కాకపోతే చూడండి శర్వాతో మాత్రమే నేను కలిసి పనిచేశా. మిగతా వాళ్లతో పనిచేయకపోయినా నాకు మంచి ఫ్రెండ్స్ అయ్యారు. అంటే కలిసి పనిచేస్తేనో.. ఇంకేదో అయితేనో ఫ్రెండ్స్ అవ్వరు. ఇద్దరి మనస్తత్వాలు ఒకేలా ఆలోచించినప్పుడే మంచి ఫ్రెండ్స్ అవుతారు. ఇక రాఖీ గురించి చెప్పమంటే.. నాకు అక్కాచెల్లెళ్లు లేరు. మా బాబాయి కూతురు ఉంది. తను కచ్చితంగా రాఖీ కడుతుంది. చిన్నప్పుడు అమ్మని 'అన్నని ఎందుకు కన్నావు.. అక్క ఉంటే బాగుండేది' అని అనేవాడినట. దానికి అన్నయ్య 'అవునమ్మా వీడికి బదులు చెల్లి ఉంటే బాగుండేది' అనేవాడట. ఆ విషయాలు అమ్మ చెబుతుంటే ఇప్పటికీ బాగా నవ్వుకుంటుంటాం.

**అల్లరి నరేష్**

### ఒకరుండాలి..



మనకు కష్టాలొచ్చినప్పుడు వెన్నంటి ఉండేవాడే నిజమైన స్నేహితుడు. అలాంటి స్నేహితుడిని సంపాదించుకోవడం కంటే ఉత్తమముండదమో! 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' నిర్మాత డాక్టర్ రవికిరణ్ నాకు మంచి మిత్రుడు. నన్ను హీరోగా నిలబెట్టేందుకు ఆయన రిస్క్ తీసుకున్నాడు. నన్ను నమ్మినందుకు ఆయనకు నేను సర్వదా కృతజ్ఞుడిని. నా చిన్ననాటి స్నేహితులు ఎంతోమంది ఉన్నారు. నా ప్రతి కష్టంలోనూ అండగా నిలబడ్డారు. అప్పుడు చూసిన సప్తగిరేనా? అనుకుంటున్నారు. వాళ్ల సంతోషం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటుంది. మా టౌన్‌లో గొప్పగా చెబుతుంటారు. చిన్నప్పటి రోజులు గుర్తుచేసుకుంటే నవ్వొస్తుంది. రాఖీ పండుగ గురించి చెప్పాలంటే నాకు అక్కాచెల్లెళ్లు లేరు. ఉన్నది ఒక్క అన్ననే. మా కజిన్స్, ఇంటి చుట్టుపక్కల వాళ్లు రాఖీ తెచ్చి కట్టేవాళ్లు. చేతులకు ఆ మెరుపులు చూస్తుంటే చాలా సంతోషమేసేది.

**సప్తగిరి**

టాకీస్

# నాన్న కలల్ని నాలో చూసుకుంటున్నాడు!



బెల్లంకొండ శ్రీనివాస్

**'ప్రతి సినిమాను ఓ పాఠంలా భావిస్తాను. నాకు తెలియని కొత్త విషయాల్ని నేర్చుకుంటూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నాను. కమర్షియల్ పంథాలో జనరంజకమైన సినిమాలు చేయాలన్నదే నా లక్ష్యం' అన్నారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జయ జానకి నాయక'. బోయపాటి శ్రీను దర్శకుడు. మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 11న ప్రేక్షకులముందుకు రానుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లో సాయి శ్రీనివాస్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి...**

**• 'జయ జానకి నాయక' అంటూ సినిమాకు కవితాత్మకమైన టైటిల్‌ను పెట్టారు. కథా నేపథ్యమేమిటి?**

ప్రాణప్రదంగా ప్రేమించిన అమ్మాయి కోసం ఎంత దూరమైనా వెళ్లే ధీరోదాత్తుడైన యువకుడి కథ ఇది. పవిత్రమైన ప్రేమకు ప్రతీకలా కథ సాగుతుంది. సాఫల్యవైఫల్యాలకు అతీతంగా ప్రేమబంధాన్ని కలకాలం హృదయంలో నిలుపుకోవాలనే ఉదాత్తమైన అంశానికి అందమైన దృశ్యరూపంలా వుంటుంది. కుటుంబ అనుబంధాల నేపథ్యంలో యాక్షన్ ప్రధానంగా చిత్ర కథ నడుస్తుంది.

**• ఈ ప్రేమకథలో మీకు కొత్తగా అనిపించిన పాయింట్?**

ఇప్పటివరకు ఎవరూ స్పృశించని కొత్త కథాంశమిది. స్క్రిప్ట్ విన్నప్పుడే విజయం తథ్యమనే భావన కలిగింది. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలతో పాటు చక్కటి కమర్షియల్ హంగులు వుంటాయి. కెరీర్ కీలక సమయంలో ఇలాంటి గొప్ప కథ దొరుకడం అదృష్టంగా భావిస్తున్నాను.

**• విడుదలకు ముందే ఈ సినిమా మంచి హైప్ సృష్టించుకోవడం ఎలా అనిపిస్తున్నది..?**

నిర్మాణదశలోనే ఈ సినిమా అందరి దృష్టినీ ఆకట్టుకున్నది. వందకు వెయ్యిరెట్లు ప్రేక్షకుల అంచనాల్ని అందుకునే చిత్రమవుతుందనే నమ్మకమున్నది.

**• మీరు నటించిన గత రెండు చిత్రాలు ఆశించిన ఫలితాల్ని సాధించలేదు. ఈ సినిమా విషయంలో ఎలాంటి శ్రద్ధ తీసుకున్నారు?**

ఈ సినిమా కోసం వందశాతం శ్రమించాను. లుక్స్‌తో పాటు సంభాషణలు పలికే విధానంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాను. శారీరక దారుఢ్యం కోసం ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టాను. షూటింగ్ చేస్తున్నప్పుడు ఈ సినిమా నా కోసమే రాసిపెట్టుందేమో అనిపించింది. నన్ను నేను నిరూపించుకోవాలనే తపనతో పనిచేశాను. ఇక జయాపజయాల గురించి నేను పెద్దగా పట్టించుకోను. నా నుంచి శుక్రవారం మంచి సినిమా రావాలని కోరుకుంటాను. సోమవారం వచ్చే సరికి దాని గురించి మరచిపోతాను.

**• బోయపాటి శ్రీను దర్శకత్వంలో పనిచేయడం ఎలా అనిపించింది?**

ఒక సోదరుడిలా ఆయన నాతో కలిసిపోయారు. షూటింగ్ సమయంలో ఆయన ఇచ్చిన సలహాలు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. భావోద్వేగాల్ని ఎలా పండించాలి? ప్రేక్షకుల్ని మెప్పించేలా సెటిల్డ్‌గా ఎలా నటనను ప్రదర్శించాలి? అనే విషయాల్లో బోయపాటి సూచనలు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

**• మీ కెరీర్ కోసం నాన్న బెల్లంకొండ సురేష్ ఎంతగానో తపన పడుతున్నారు. మీరు ఎంచుకునే సినిమాల విషయంలో ఆయన ఎలాంటి సలహాలిస్తారు?**

నాన్నగారు కథ విని బాగుందో లేదో చెబుతారు. సినిమా చేయాలా?వొద్దా? అనే నిర్ణయాన్ని నాకే వదిలివేస్తారు.మంచి కథ దొరికినప్పుడు కష్టపడాలని చెబుతారు. తన కలల్ని నాలో చూసుకుంటూ నాన్న నా కెరీర్ కోసం కష్టపడుతున్నారు. 'ఏ ఫీల్డ్‌లోనూ మీ నాన్నలాంటి వారుండరు. అలాంటి తండ్రి దొరుకడం నీ అదృష్టం' అని నా మిత్రులు ఎప్పుడూ అంటుంటారు.

**• ప్రేమకథా చిత్రమని చెబుతూనే ఇందులో ఐటెంసాంగ్‌తో పాటు అన్ని కమర్షియల్ హంగుల్ని మేళవించారెందుకని...?**

నాకు స్టార్‌డమ్ లేదు. అభిమానగణం కూడా పెద్దగా లేరు. నా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు చేరువకావాలంటే తప్పకుండా అన్ని కమర్షియల్ హంగులూ వుండాల్సిందే. ఇందులో కేథరిన్ ఓ ప్రత్యేక గీతంలో నర్తించింది. ఆ పాటను ఐటెంసాంగ్‌గా భావించడానికి వీల్లేదు.

**• కెరీర్ ఆరంభం నుంచి సీనియర్ కథానాయికలతో జత కడుతున్నారు. ఈ సినిమాలో రకుల్‌ప్రీత్‌సింగ్‌తో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్...?**

మనకంటే సీనియర్స్‌తో కలిసి పనిచేయడం వల్ల నటనలో మరింత పరిణతి కనబరిచే అవకాశం దక్కుతుంది. ఈ సినిమాలో రకుల్‌ప్రీత్‌సింగ్ అభినయానికి ఆస్కారమున్న అద్భుతమైన పాత్రను పోషించింది. మా ఇద్దరి జోడీ అందరిని అలరిస్తుంది.


**• మీ సంస్థలో ఇతర హీరోల సినిమాలకు విరామమిచ్చారెందుకని..?**

వచ్చే ఏడాది మా సంస్థలో బయటి హీరోలతో రెండు భారీ చిత్రాల్ని నిర్మించబోతున్నాం. అందుకు సంబంధించిన కథా చర్చలు కూడా పూర్తయ్యాయి. ఆ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన వివరాల్ని త్వరలో వెల్లడిస్తాను.

**• శ్రీవాస్ దర్శకత్వంలో మీరు నటిస్తున్న తాజా చిత్రం గురించి...?**

ఆ సినిమాకు సంబంధించిన ఇరవైరోజుల షెడ్యూల్ పూర్తయ్యింది. ఇదివరకు ఎప్పుడూ చూడని కొత్త జోనర్‌లో సినిమా వుంటుంది. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్స్ చాలా స్టైలిష్‌గా వుంటాయి.

## గీతాంజలి



**శ్లో. ధనేన కిం యో న దదాతి యాచకే, బలేన కిం యచ్చ రిపుం న బాధతే,**
**శ్రుతేన కిం యో నచ ధర్మ మాచరేత్, కిమాత్మనా యో న జితేంద్రియో భవేత్.**

అర్థించినవారికి ఇవ్వనప్పుడు ఆ ధనము వల్ల ప్రయోజనం ఏమిటి? శత్రువులను జయించలేని బలము ఉండికూడా ప్రయోజనం సున్న. ఎంత చదువు కొన్ననూ ధర్మం ఆచరింపనిచో ఆ జ్ఞానం గంగలో కలిసిపోయినట్టే. ఇంద్రియాలను స్వాధీనం చేసుకోలేని ఆత్మజ్ఞానం వల్ల ఉపయోగం శూన్యమే.

**- హితోపదేశం**

# ఒకరికి ఒకరం

'నీ ఇల్లు నా ఇంటికి ఎంత దూరమో.. నా యిల్లూ నీ యింటికి అంతే దూరం' అనేది తెలుగునాట ఒక సామెత. మనం ఎదుటివారితో కలిసిమెలిసి కలివిడిగా ఉంటేనే వారూ మన పట్ల అలాగే ఉంటారు. మనం వారికి చేదోడు వాదోడుగా ఉంటూ సహాయం, సహకారం అందిస్తూ ఉంటే.. వారి ఇబ్బందుల్లో పాలు పంచుకుంటూ ఉంటే.. మన ఇబ్బందుల్లో వారూ పాలుపంచుకుంటారు. మనం సమాజంతో అంటీముట్టనట్టు ఉన్నా, దూరంగా ఉన్నా సమాజం కూడా మన పట్ల అలాగే ఉంటుంది. ఇందుకు నిదర్శనంగా భిక్షు సంఘంలో ఉండి, ఎవరితోనూ కలివిడిగా లేకుండా, చివరికి పలకరించే దిక్కు లేకుండా అలమటించిన భిక్షువు కథ ఇది.

బాలకుడు బౌద్ధ సంఘంలో చేరి భిక్షువు అయ్యాడు. ఎప్పుడూ తన అధ్యయనం, తన ధ్యానాభ్యాసం తప్ప మరో పని గురించి ఆలోచించేవాడు కాదు. ఎవరైనా ఏదైనా సహాయం అడిగితే కోప్పడేవాడు.

'మిత్రమా! బాలకా! నాకు అనారోగ్యంగా ఉంది. కాస్త ఔషధం తెచ్చిపెట్టు అని అడిగి...

'మిత్రమా! బాగుందయ్యా! నేను సంసారాన్ని వదిలి భిక్షువు అయ్యింది ఇందుకా! నీకు మందు తెచ్చిపెట్టడానికా! అనేవాడు.

మరొకరు, 'మిత్రమా! నేను లేవలేని స్థితిలో ఉన్నాను. నీ చీవరం (బౌద్ధ భిక్షువులు ధరించే వస్త్రం)తో పాటు నాది కూడా ఉతికిపెట్టు' అని అడిగితే..

'కాషాయం కట్టుకున్న నేను, బట్టలు ఉతికేవానిలాకనిపిస్తున్నానా? నీ దేహానికే కాదు, కల్లకు కూడా అనారోగ్యం వచ్చినట్టుంది' అనేవాడు.

ఇలా ఏ ఒక్కరికి చిన్న సహాయం అందించే వాడు కాదు. ఎవర్నీ సహాయం అడిగేవాడూ కాదు.

## బుద్ధమార్గం



కొన్నాళ్లకి అతను జబ్బు పడ్డాడు. అప్పుడు అతను ఎవర్ని అడిగినా ఎవరూ సహాయం అందించలేదు. మంచం పట్టాడు. అటూ ఇటూ తిరగలేకపోయాడు. ఎప్పుడూ వెల్లకిలా పడుకుని ఉండడం వల్ల వీపు పుండ్లు పడింది. చెప్పలేని బాధ. దుర్వాసన.

ఒకరోజున బుద్ధుడు ఆ ఆరామానికి వచ్చాడు. అక్కడ శవంలా పడి ఉన్న బాలకుణ్ణి చూశాడు. వెంటనే ఆనందుని సహాయంతోఅతణ్ణి లేవదీశాడు. స్నానం చేయించాడు. మందు పూసి, కొత్త చీవరం కప్పాడు. పక్క మార్చాడు.

సాక్షాత్తు భగవాన్ బుద్ధుడే అతనికి సేవ చేయడం చూసి, ఆ ఆరామంలోని భిక్షువులు సిగ్గుపడ్డారు. బాలకుని ప్రవర్తన బుద్ధునితో చెప్పారు. బుద్ధుడు బాలకునితో.. 'భిక్షూ! మనం, మన దేహం ఎప్పటికైనా మట్టిలో కలిసిపోయేవే. మన సహాయ సహకారాలూ, మంచి ప్రవర్తనే, కుశలకర్మలే మిగిలి ఉంటాయి' అని చెప్పి, మిగిలిన భిక్షువులతో 'మనం మన కుటుంబాలను వదిలి ధర్మ ప్రచారం కోసం వచ్చాం. మనకు సేవలు చేసే కుటుంబ సభ్యులు - తల్లీ, తండ్రీ, ఆలుబిడ్డలు ఎవ్వరూ ఉండరు. మనకు మనమే అన్నీ. ఒకరికొకరం సేవలు చేసుకోకపోతే ఎలా?' అని ప్రబోధించాడు.

'అచిరం బతాయం కాయః పృథివీ మధిశేష్యతే
క్షుద్రో అపేత విజ్ఞానో నిరర్ధమివ కళింగరం!'

అంటే.. ఈ దేహం, ఈ ప్రాణం ఏదో ఒకనాడు పోయేవే, ఎందుకూ పనికిరాకుండా మట్టిలో కలిసిపోయేవే. కానీ మనం చేసిన మంచి పనులు, సహాయసహకారాలే మిగిలి ఉంటాయి అని బుద్ధుడు ప్రవచించాడు.

ఆనాటి నుండి మిగిలిన భిక్షువులు బాలకునికి సహాయం చేశారు. బాలకుడు త్వరలో కోలుకున్నాడు. ఇక ఆనాటి నుంచి బాలకుడు అందరికీ చేదోడు వాదోడుగా నిలిచేవాడు.

**- బొర్రా గోవర్ధన్**

# చిరునవ్వూ సత్కార్యమే

**భూమ్మీద** పుట్టిన ప్రతి మనిషీ సుఖవంతమైన, సౌభాగ్యవంతమైన, శుభకరమైన జీవితాన్నే కోరుకుంటాడు. కోరుకోవాలి కూడా. కాని కోరుకున్నంత మాత్రాన జీవితం అలా మారిపోతుందా? దానికి మనవంతు ప్రయత్నం తోడవ్వాలి. మన ప్రవర్తన కూడా దానికనుగుణంగా ఉండాలి. అది ఎలా ఉండాలో ముహమ్మద్ ప్రవక్త (స) చెప్పారు. హరాంకు, అంటే నిషిద్ధాలకు దూరంగా ఉంటే మీరు భక్తిపరులవుతారు. అల్లాహ్ మీ అదృష్టంలో రాసినదాని పట్ల సంతృప్తి చెందితే మీరు ఎవరి అవసరమూ లేని సంపన్నులవుతారు. ఇరుగు పొరుగువారితో సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి. ఇతరులు మీ పట్ల ఎలా వ్యవహరించాలని కోరుకుంటారో మీరు కూడా వారితో అలాంటి వైఖరినే కలిగి ఉండాలి. అప్పుడే మీరు పరిపూర్ణ విశ్వాసులవుతారు. అధికంగా నవ్వకూడదు. దీనివల్ల హృదయం నిర్జీవమవుతుంది' అని ప్రవచించారు.

నైతికతకు వ్యతిరేకమైనది. మానవ స్వభావానికి సరిపడనిది, ధర్మవిరుద్ధమైనది. సమాజం హర్షించని ప్రతిదీ నిషిద్ధమే. ఉదాహరణకు, సృష్టికర్తను వదిలేసి సృష్టిరాసుల్ని పూజించడం, తల్లిదండ్రులకు విధేయత చూపకుండా, వారి సేవ చేయకుండా, వారి మాటను ధిక్కరించడం, హింసాదౌర్జన్యాలు, రక్తపాతం, జూదం, మద్యం, వ్యభిచారం, అవినీతి అక్రమాలు, ఇతరుల ఆస్తిని, ముఖ్యంగా అనాథల ఆస్తిని కొల్లగొట్టడం, చాడీలు చెప్పడం, ఇతరుల మత విశ్వాసాలను దెబ్బతీయడం - ఇంకా ఇలాంటి అనేక అమానవీయ కార్యాలన్నీ హరాం. అంటే నిషిద్ధ, అధర్మం. వీటికి దూరంగా ఉండడం నిజంగా గొప్ప ఆరాధన. అందుకే దేవుడు వీటిని నిషేధించాడు. నిషిద్ధాలకు దూరంగా ఉండడం కన్నా భక్తి తత్పరత ఇంకేముంటుంది. ఈ కారణంగానే ప్రవక్త మహనీయులు నిషిద్ధాలకు దూరంగా ఉంటే గొప్ప భక్తిపరులవుతారని చెప్పారు.

## ఖురాన్ మాట



### విశ్వాసులెవరు?

ఇదేవిధంగా దేవుడు మన అదృష్టంలో ఎంత రాస్తే అంత తప్పక లభించి తీరుతుందని, ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా దాన్ని పెంచడం గాని, తగ్గించడం గాని చెయ్యలేరని నమ్మి, ఉన్నంతలోనే తృప్తిపడేవారి మనసులో ఒక విధమైన సంతృప్తి, ప్రశాంతత ఉంటాయి. లేనిదాని కోసం వెంపర్లాట ఉండదు. అందుకే ప్రవక్తవారు ఇలాంటివారిని ఎవరి అవసరమూ లేని సంపన్నులు అని అభివర్ణించారు.

మరో విషయం ఏంటంటే, ఇతరులు మనల్ని గౌరవించాలని, ప్రేమించాలని, ఆదరించాలని ఎలాగైతే మనం కోరుకుంటామో, మనం కూడా వారి పట్ల అలాంటి వైఖరినే కలిగి ఉండాలి. ఎందుకంటే ఎవరి దుర్నడత కారణంగా వారి పొరుగువారు సురక్షితంగా ఉండరో వారు విశ్వాసులు కారు అన్నారు ముహమ్మద్ ప్రవక్త. ఒకరి గౌరవ మర్యాదలపై, ధన ప్రాణాలపై, మత విశ్వాసాలపై నోటి ద్వారా గాని, చేతి ద్వారా గాని దాడిచేసే హక్కు, అధికారం ఎవ్వరికీ లేదు. కనుక మనం మన కోసం ఎలాంటి స్థితిని కోరుకుంటామో, అందరికీ అదే స్థితి ప్రాప్తం కావాలని కోరుకోవాలి. దీనికి భిన్నంగా పరుల కీడు కోరేవారు విశ్వాసులే కారని స్పష్టంగా చెప్పారు ప్రవక్త మహనీయులు.

### అతి నవ్వు వద్దు.. చిరునవ్వే ముద్దు

ప్రవక్త మరో మాట కూడా చెప్పారు. అధికంగా నవ్వకూడదు అని. అంటే మూతి ముడుచుకొని ముభావంగా ఉండమని కాదు దీనర్థం. నవ్వు దివ్య ఔషధమే అయినప్పటికీ మితి మీరితే అనర్థమే అన్నది దీనర్థం. స్వయంగా ప్రవక్త వారి దివ్య వదనంపై సదా చిరునవ్వు తొణికిసలాడుతూ ఉండేది. నువ్వు నీ సోదరుడిని చిరునవ్వుతో పలుకరించడం కూడా సత్కార్యమే అని ఆ మహనీయులు సెలవిచ్చారు. కాని మితిమీరి, అదేపనిగా పగలబడి నవ్వడం మంచిది కాదన్నదే ప్రవక్త ప్రవచన సారాంశం. చిరునవ్వు ఎప్పుడూ అభిలషణీయమే. దైవనామ స్మరణలో హృదయం సజీవంగా ఉంటుంది. అల్లాహ్‌ను విస్మరించి ప్రాపంచిక వినోదంలో మునిగి తేలడం వల్ల హృదయం నిర్జీవమయ్యే ప్రమాదం ఉంది. కనుక ఆణిముత్యాల్లాంటి ఈ విషయాలను గమనంలో ఉంచుకొని ఆచరించగలిగితే జీవితాల్లో శాంతి, సంతృప్తి, శుభాలు నెలకొంటాయి. సమాజంలో సామరస్యం, సౌభ్రాతృత్వం పరిఢవిల్లుతుంది.

**- యం.డి.ఉస్మాన్ ఖాన్**



వ్రతం చేసినా.., నోము నోచినా.. ఏ క్రతువు అయినా స్త్రీలు తమ కోసం తాము చేసుకున్నది లేదు. భర్త, అత్తగారింట సుఖ సంతోషాలు వెల్లివిరియడం కోసం, సౌభాగ్యం కోసమే స్త్రీలు వ్రతాలు చేయడం మనకు కనిపిస్తుంది. ఈ శ్రావణ మాసంలో చేసే వరలక్ష్మీ వ్రతం స్త్రీలకు మరింత విశిష్టమైంది. ఇది స్త్రీల తత్వాన్ని సంపూర్ణంగా ఆవిష్కరిస్తుంది. అయితే శ్రావణమాసం స్త్రీలకు మాత్రమే కాదు.. పురుషులకు కూడా ప్రత్యేకమైనదే. శ్రావణంలో ప్రతి వారమూ పవిత్రమైనదే.

# స్త్రీ తత్వానికి ప్రతీక.. శ్రావణం!

**శ్రావణ** మాసం హిందువుల పవిత్ర మాసాల్లో ఒకటి. శ్రావణ నక్షత్రం విష్ణుమూర్తి జన్మ నక్షత్రంగా హిందువుల విశ్వాసం. ఈ మాసం తెలుగు క్యాలెండర్ ప్రకారం ఐదవ నెల. శ్రావణ మాసం వివాహాలకు, గృహ ప్రవేశాలకు అనువైన ముహూర్తాలు ఉండే కాలం. ఈ నెలలోని మూడు శుక్రవారాలు మహాలక్ష్మి అమ్మవారిని విశేషంగా పూజిస్తారు. ఇందులో రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతానికి విశేషమైన రోజుగా పరిగణిస్తారు. వీటితో పాటు శ్రావణ మంగళవారాలు కొత్తగా వివాహమైన స్త్రీలు శ్రావణ మంగళగౌరి వ్రతాలు ఆచరిస్తారు. ఈ మాసంలో కల సకల ఐశ్వర్యాలను ప్రసాదించబడటానికి వరలక్ష్మి అమ్మవారిని పూజిస్తే, అత్తవారింటి క్షేమం కోసం మంగళగౌరిగా పార్వతి దేవిని పూజిస్తారు స్త్రీలు.

### బ్రహ్మచారులకు విశిష్టమైన కాలం

శ్రావణ మాసం కేవలం స్త్రీలకు మాత్రమే విశేషమైన మాసం అనుకుంటే పొరపాటు. ఈ మాసంలో మగవాళ్లు సోమవారాలు విశేషంగా శివుడిని ఆరాధించడం వల్ల కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయి.

- మొదటి సోమవారం పాడ్యమితో ప్రారంభమవుతుంది. ఈ తిథికి అగ్ని అధిదేవత. దీనివల్ల సత్ఫల ప్రాప్తి కలుగుతుంది.
- రెండవ సోమవారం అష్టమి అధి దేవత. అష్టమాతృకలు ఫలం దుర్గతి నాశనం.
- మూడవ సోమవారం పౌర్ణిమ అధిదేవత చంద్రుడు. ఫలం ధనధాన్య, ఆయురారోగ్య, భోగభాగ్య ప్రాప్తి.
- నాల్గవ సోమవారం సప్తమి అధిదేవత సూర్య భగవానుడు. ఫలం ఆయురారోగ్య వృద్ధి.
- ఐదవ సోమవారం అమావాస్య. అధిదేవతలు పితృదేవతలు. ఫలం సంతాన సౌఖ్యం.

ఈ రోజుల్లో శివాభిషేకం, అర్చన చేయడం వల్ల పైన చెప్పిన ఫలితాలు కలుగుతాయి. విశేషంగా అమావాస్య సోమవారం శివుడిని పూజించినట్లయితే అనంతమైన పాపాలు నశించి శివ సాయుజ్యానికి వెళ్తారని పెద్దల వాక్కు. ఉత్తర భారత దేశంలో శ్రావణ మాసం, సోమవారం శివాభిషేకాలకు ఎంతో ప్రసిద్ధి. మన దక్షిణాదిలో కార్తీక మాసం శివారాధనకు ఎంతటి ప్రాధాన్యం ఉందో, అదే విధంగా ఉత్తరాదిన శ్రావణమాసం అంతే ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. ఈ మాసంలో అన్ని శివాలయాలు భక్తులతో, అభిషేకాలతో కిటకిటలాడుతూ తమ పవిత్రతను చాటుతూ ఉంటాయి.

శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి శ్రావణ పౌర్ణమి. శ్రావణ మాసంలోనే వేదాధ్యయనం కోసం బ్రహ్మచారులకు ఉపాకర్మ అనే సంస్కారాన్ని చేస్తారు. ఆనాటి నుండి వారు గురువు దగ్గర వేదాలు నేర్చుకోవడం ప్రారంభిస్తారు. శ్రవణం అనగా వినడం అనే మరొక అర్థం కూడా ఉంది. వేదాలు విని వల్లె వేస్తారు కాబట్టి ఈ నెలకు శ్రావణ మాసమనే పేరు వచ్చిందని కూడా చెప్పవచ్చు. ఈ రోజున ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో రక్షాబంధన్‌గా మన దగ్గర రాఖీ పౌర్ణమిగా పండుగ జరుపుకొంటారు. ఈ వేడుక అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లకు సంబంధించిన పవిత్రమైన బంధాన్ని గురించి చెబుతుంది. ఈ మాసంలో వచ్చే మరో అతి పెద్ద పండుగ శ్రీకృష్ణాష్టమి. దీన్నే జన్మాష్టమి అని కూడా అంటారు.

### పురాణ గాథ

స్కాంద పురాణంలో పరమేశ్వరుడు వరలక్ష్మీ వ్రతం గురించి పార్వతీ దేవికి వివరించిన వైనం ఉంది. లోకంలో స్త్రీలు సకల ఐశ్వర్యాలను, పుత్ర పౌత్రాదులనూ పొందేందుకు వీలుగా ఏదైనా ఓ వ్రతాన్ని సూచించమని పార్వతీ దేవి ఆదిదేవుణ్ణి కోరుతుంది. అప్పుడు శంకరుడు గిరిజకు వరలక్ష్మి వ్రత మహత్యాన్ని వివరించాడని చెప్తారు. అదే సందర్భంలో శివుడు ఆమెకు చారుమతీ దేవి వృత్తాంతాన్ని తెలియజేశాడంటారు. భర్త పట్ల ఆదరాన్నీ, అత్తమామల పట్ల గౌరవాన్నీ ప్రకటిస్తూ చారుమతి ఉత్తమ ఇల్లాలుగా తన బాధ్యతల్ని నిర్వహిస్తూ ఉండేది. మహాలక్ష్మీ దేవి పట్ల ఎంతో భక్తి శ్రద్ధలు కలిగిన చారుమతి అమ్మవార్ని త్రికరణ శుద్ధిగా పూజిస్తుండేది.


ఆ మహా పతివ్రత పట్ల వరలక్ష్మి దేవికి అనుగ్రహం కలిగి, స్వప్నంలో ఆమెకు సాక్షాత్కరిస్తుంది. శ్రావణ శుక్ల పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారాన తనను ఆరాధిస్తే కోరిన వరాలన్నీ ఇస్తానని ఆమెకు దేవదేవి అభయమిస్తుంది. అమ్మ ఆదేశానుసారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి చారుమతి సమస్త సిరి సంపదల్ని అందుకుందని ఈశ్వరుడు గౌరికి విశదపరచాడని పురాణ కథనం. దాంతో పార్వతీదేవి కూడా ఈ వ్రతాన్ని ఆచరించి వరలక్ష్మి కృపకు పాత్రురాలైందని చెప్తారు.

### స్త్రీ తత్వం - సామాజిక కోణం

స్త్రీ తన జీవిత ప్రయాణంలో తన స్వార్థం కోసం చేసిన ఏ క్రతువు మనకు కనబడదు. చాలామంది గమనించని మరో విషయం ఏంటంటే శ్రావణ మాసంలో చేస్తున్న వరలక్ష్మి వ్రతం కూడా ప్రత్యక్షంగా తమ కుటుంబం కోసం చేస్తున్న క్రియగా కనిపించినా అందులో సామాజిక కోణం ఉంది. తను లక్ష్మీదేవియై ఇతర ముత్తయిదువులను ఇంటికి ఆహ్వానించి వారికి తాంబూలాది సత్కారాలను చేసి, ఎదుటి స్త్రీలలో ఉన్న లక్ష్మీ తత్వాన్ని ఆవిష్కరించడమే వరలక్ష్మీ వ్రతం ఉద్దేశం. ఈ వ్రతం ద్వారా తన ఇల్లే కాదు, సమాజమంతా అష్టైశ్వర్యాలతో తులతూగేలా స్త్రీ తన దివ్యత్వాన్ని చాటుకుంది. మనుష్య ఉపాధిని పొందిన ఎవరైనా కేవలం తన కోసం తాను బతకడమే కాకుండా కుటుంబం కోసం సమాజం కోసం పాటు పడాలని సందేశమిస్తుంది స్త్రీ జీవితం. శ్రావణ మాసంలో ప్రతి స్త్రీలోనూ అమ్మవారి సర్వశక్తులు ప్రచండ స్థాయిలో దేదీప్యమానంగా వెలుగొందుతాయి. ఆరోజు స్త్రీ కుటుంబం కోసం చేసే ఈ వరలక్ష్మీ వ్రతంలో అష్టలక్ష్ములూ చేరి అష్టైశ్వర్యాలను పొందేలా అనుగ్రహిస్తారు. ప్రతి స్త్రీ తన కుటుంబం కోసం ఈ వ్రతం ఆచరించగలిగితే సమాజం బాగుపడుతుంది. ఎందుకంటే కుటుంబమే సమాజం అనే విషయం మనందరికీ తెలిసిందే. సనాతన ధర్మం ఏది చేసినా వ్యక్తిగత, సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొనే చేస్తుందనడానికి తార్కాణమే వరలక్ష్మీ వ్రతం.

**- శ్రీకాంత్ కొణపర్తి**

## సువార్త



# వారి నీతి వారిని కాపాడింది

**మనిషి నైతిక జీవితానికి దైవమిచ్చే ప్రతిఫలం అమూల్యమైనది. దేవుడు ప్రేమించి వరంగా ఇచ్చిన మహోత్కృష్టమైన మానవజన్మకు భక్తుడు చూపే జవాబుదారీతనం దైవాన్ని ఎంతో ఆనందింపజేస్తుంది. ఆయా కాలాల్లో జీవించిన నోవహు, లోతు భక్తుల నైతిక జీవితం గొప్ప ఉపద్రవం నుండి వారిని ఎలా కాపాడిందో, ప్రభువు వారికి ఆశ్రయమై నిలిచిన వైనమిది.**

**తొలి** మానవజాతి భూమి మీద విస్తరించిన క్రమంలో ఆరంభంలో ఉన్న నీతి నియమ జీవన ప్రమాణాలను వదిలేసి దైవాన్నే మరిచి సుఖాసక్తులై, ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు యథేచ్ఛగా జీవిస్తూ ఉంటారు. వీరి మధ్య దైవభక్తి కలిగిన నీతిమంతుడైన నోవహు కుటుంబం కూడా ఉంటుంది. అయితే దేవుని పవిత్ర నేత్రం మితిమీరిన జనుల వికృత వికార చేష్టలను చూస్తూ సహించలేక జల ప్రళయంతో భూమి నుండి నరజాతిని తుడిచివేయ సంకల్పించాడు. యెహోవా తన నిర్ణయానికి ముందు నోవాహుతో 'ఈతరం వారిలో నా యెదుట నీవొక్కడివే నీతిమంతుడవై ఉండుట చూచితివి గనుక నీవు, నీ ఇంటివారు మూడు అంతస్థులు గల ఓడను నిర్మించుకొని సమస్త జీవరాశుల్లో ఒక్కొక్క జతతో పాటు మీరు నావలోకి ప్రవేశించండని చెప్తాడు. దైవాజ్ఞ శిరసావహించిన నోవాహు ఓడలో ప్రవేశించి నావ తలుపులు మూయగానే దేవుడు గొప్ప ప్రళయాన్ని భూమి మీదకి రప్పిస్తాడు. సకల చరాచర జీవులతో పాటు దుష్ట జనాలు శిక్షింపబడతారు. ప్రళయానికి ముందు నోవాహు భక్తుడు నీతిని గురించి పదే పదే బోధించినప్పటికీ వారు నోవాహును అపహాస్యం చేస్తారు. (ఆది.కా 6-9 అధ్యాయాలు). రాత్రింబవళ్లు కురిసిన ప్రచండ వర్షానికి నావ నీటిపై తేలి 150 రోజుల తరువాత అరారాతు శిఖరంపై (ఇది ఆర్మేనియా దేశంలో ఉంది) నిలుస్తుంది. భూమి మీద నీరు ఇంకిపోయినప్పుడు దేవుడు అందరినీ, అన్నింటినీ బయటికి రప్పించి తిరిగి నోవాహుకు సంతానాన్ని వర్ధిల్ల చేస్తాడు. ఆ రీతిగా నోవాహు నీతియుక్త జీవితం ఆయన్ని కాపాడింది.

కాల క్రమంలో తరం వెంబడి తరం వెళ్తున్న దిశలో మళ్లీ పాపబీజం నరజాతిలో మొగ్గ తొడుగుతూ అంతకంతకు పరిపక్వమై మనిషిని ఏలసాగింది. ఇలాంటి సమయంలో ఆనాటి కనాను (ఇశ్రాయేలు) దేశంలో అబ్రహాము, లోతు అనే నీతిమంతులైన ఇద్దరు దేవుని భక్తులు రక్తసంబంధులు ఒకే స్థలంలో పాడి పంటలతో జీవనం సాగిస్తుంటారు. ఆస్తి విస్తరిస్తున్న క్రమంలో రెండు కుటుంబాలు కలిసి జీవించలేని పరిస్థితి. అబ్రహాము, లూతును తనకు ఇష్టమైన స్థలానికి వెళ్తే తాను మరోచోట కాపురముంటానంటాడు. అయితే లోతు కంటికి పచ్చగా కనిపించే యోర్దాను నదీ పరివాహక ప్రాంతం మృత సముద్రానికి దగ్గరలో ఉన్న సొదమొ గొమర్ర స్థలాన్ని ఎన్నుకొని కాపురముంటాడు. ఈ సొదొమ ప్రాంత ప్రజలు నీతిలేని బహు దుర్మార్గులు. కామ వికార చేష్టలతో సమాజాన్ని కలుషితం చేస్తూ దేవుని దృష్టికి దోషులుగా ఉన్నవారు. ఆది.కా.18-19 అధ్యాయాలు.

పూర్తిగా చెడిపోయిన సొదొమ గొమర్ర సమాజాన్ని అగ్ని గంధకాలతో దేవుడు కాల్చివేయ సంకల్పిస్తాడు. ఆ విషయాన్ని అబ్రహాము, లోతులకు ముందే తెలుపుతాడు. లోతును కాపాడమని అబ్రహాము దేవుని ప్రార్థిస్తాడు. అయితే నీతిమంతుడైన లోతు ఆ వక్రజనం మధ్య తన మనస్సాక్షిని నొప్పించుకుంటూ కుటుంబంతో దేవుని యందు గల భక్తి శ్రద్ధలను విడువకపోవడం ప్రభువు చూస్తాడు. ఒకనాడు దేవదూతలు లోతు ఇంటికి అతిథులై వచ్చినప్పుడు ఈ కామాంధులైన ప్రజలు వారిని తమకోసం బయటికి పంపమని లోతును హింసిస్తారు.

అప్పుడు దేవుడు లోతుతో నీవు, నీ ఇంటివారు ఈ పట్టణాన్ని విడిచి వడివడిగా వెనుదిరిగి చూడకుండా వెళ్లిపొమ్మని చెప్తాడు. లోతు వెళ్తున్నాడు గానీ భార్య మాత్రం సొదొమ పట్టణ వైభవాన్ని, ఆస్తిని విడువలేక వెనుదిరిగి చూస్తుంది. దైవాజ్ఞను అతిక్రమించి ఉప్పు స్తంభమైపోతుంది. ఆ రీతిగా లోతు తన నీతి జీవితం వల్ల దేవుని ఉగ్రత నుండి తప్పించుకుని, తనను తాను కాపాడుకోగలిగాడు. దేవుని దృష్టిలో భక్తుని నైతిక జీవితం ఎప్పటికీ మరువబడదు.

**- డా. గుడిపాటి విలియం కేరి**

**ఆహ్వానం: మన సంప్రదాయాలు, సంస్కృతి, పురాణేతిహాసాల్లోని ధర్మసందేహాలు మీకు ఉంటే మాకు రాయండి. నిపుణులైన ఆధ్యాత్మికవేత్తలచే మీ సందేహాలకు సమాధానాలందిస్తాం. భక్తి, ఆధ్యాత్మిక విషయాలు, వేదోపనిషత్తులు, ఇతిహాసాల్లోని అంశాల గురించిన మీ పరిజ్ఞానాన్ని చింతన పాఠకులతో పంచుకోవచ్చు.**
**మీ సందేహాలు, వ్యాసాలు, అభిప్రాయాలను పంపాల్సిన మా చిరునామా : చింతన, నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8&9, రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. ఇ-మెయిల్ : chintana@ntdaily.news**

# సింగరేణిలో 665 ఉద్యోగాలు

ఖమ్మం (కొత్తగూడెం)లోని ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అండర్ గ్రౌండ్ విభాగంలో ఖాళీగా ఉన్న బదిలీ వర్కర్ (పురుషులకు మాత్రమే) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల (ఎస్టీ) నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

**వివరాలు:**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అనేది తెలంగాణ రాష్ట్రంలో బొగ్గును ఉత్పత్తి చేసే కంపెనీ. దీన్ని 51:49 ఈక్విటీ ఆధారంగా తెలంగాణ, కేంద్రం కలిసి ఏర్పాటు చేశాయి. 1886లో హైదరాబాద్ దక్కన్‌గా, 1920లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పేరు మార్చుకొని, 1956 రాష్ట్రస్థాయి పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌గా పరిగణిస్తున్నారు. దీనికి మినీరత్న హోదాను 2006లో కల్పించారు.

- మొత్తం ఖాళీల సంఖ్య: 665. ఈ పోస్టులకు తెలంగాణ రాష్ట్రంలో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగల అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- పోస్టు పేరు: బదిలీ వర్కర్
- అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- పే స్కేల్: రూ. 604.33/- (ఒక రోజుకి)
- వయస్సు: 2017 జనవరి 1 నాటికి 18 నుంచి 45 ఏండ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: తెలుగులో రాతపరీక్ష ద్వారా
- పదోతరగతి స్థాయిలో పరీక్ష ఉంటుంది.
- ఆబ్జెక్టివ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజున పరీక్ష నిర్వహిస్తారు.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా . ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతోపాటు, నిర్ణీత నమూనాలో ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.ఆన్‌లైన్ దరఖాస్తులను సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.

**చిరునామా:** జీఎం, పర్సనల్ /ఆర్‌సీ, ఐఆర్ అండ్ పీఎం, ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రిక్రూట్‌మెంట్ సెల్, కొత్తగూడెం కాలరీస్, భద్రాద్రి కొత్తగూడెం-507101

- దరఖాస్తులు ప్రారంభం: ఆగస్టు7
- దరఖాస్తులకు చివరితేదీ: సెప్టెంబర్ 2
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్‌కు చివరితేదీ: సెప్టెంబర్ 12
- వెబ్‌సైట్: www.scclmines.com

# రైల్ టెల్ కార్పొరేషన్‌లో

రైల్ టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టెక్నికల్ అసిస్టెంట్, టెక్నికల్ లీడ్ పోస్టుల (కాంట్రాక్ట్ ప్రాతిపదికన) భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

**వివరాలు:**

ఇది మినీరత్న కంపెనీ. దీన్ని 2000 సంవత్సరంలో ఏర్పాటు చేశారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 50
- ప్రాజెక్ట్ డైరెక్టర్/ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్-1
- సీనియర్ ఆర్కిటెక్ట్-2
- సీనియర్ ఆర్కిటెక్ట్-డాటాబేస్ అడ్మినిస్ట్రేషన్-1
- సీనియర్ ఈఆర్‌పీ టెక్నో ఫంక్షనల్ (ఒరాకిల్)- 4
- టెక్నికల్ లీడ్ (ఎస్‌ఏపీ, డాట్‌నెట్, ఆండ్రాయిడ్ అప్లికేషన్స్, జావా డెవలపర్, నెట్‌వర్క్/బ్యాండ్‌విడ్త్)- 14
- టెక్నికల్ కన్సల్టెంట్ (ఓఎస్, సర్వర్, హార్డ్‌వేర్ అడ్మినిస్ట్రేషన్, జావా, డాట్‌నెట్, డీబీఏ, ఒరాకిల్, ఈఆర్‌పీ, ఎస్‌ఏపీ, స్టోరేజ్, సెక్యూరిటీ, నెట్‌వర్క్- 25
- ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్- 2
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి బీఈ/బీటెక్, బీఎస్సీ, ఎంసీఏ, బీసీఏ, డిప్లొమాలో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- వయస్సు: 21 నుంచి 40 ఏండ్ల మధ్య ఉండాలి (పోస్టులను బట్టి వేర్వేరుగా వయోపరిమితిలో ఉన్నాయి)
- రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- దరఖాస్తు ఫీజు: రూ. 1000. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: 2017, జూలై 17
- వెబ్‌సైట్: : http://www.railtelindia.com



# నేవీలో ఎస్‌ఎస్‌సీ/పీసీ ఆఫీసర్

- బీఈ/బీటెక్ చేసిన అభ్యర్థులకు నేవీలో ఉద్యోగాలు
- శిక్షణ పూర్తయిన తర్వాత సబ్ లెఫ్టినెంట్ హోదాలో ఉద్యోగం
- మంచి జీతాలు, చాలెంజింగ్ కెరీర్ ఉద్యోగ భద్రత
- చివరితేదీ ఆగస్టు 25






రక్షణశాఖ పరిధిలోని ఇండియన్ నేవీ (ఐఎస్) జనరల్ సర్వీస్/హైడ్రోక్యాడర్‌లో ఖాళీగా ఉన్న షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ (ఎగ్జిక్యూటివ్/టెక్నికల్ బ్రాంచ్), ఎన్‌ఏఐసీలో (పీసీ) ఆఫీసర్ జూన్ 2018లో ప్రారంభించే కోర్సు కింద అర్హత గల అవివాహిత పురుష/మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇండియన్ నేవల్ అకాడమీ విడుదలచేసింది.

**వివరాలు:**

భారత నావికాదళంలో (ఎగ్జిక్యూటివ్/టెక్నికల్ బ్రాంచ్) షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ కోర్సు కేరళ ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీలో జూన్ 2018 నుంచి ప్రారంభమవుతుంది.

విద్యార్హతలు:

- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్ హైడ్రోగ్రఫీ క్యాడర్)
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ (ఎన్‌ఏఐసీ)
★ Reddy/ MBBS/PG *28/6'/ 15Cr *29/ 5'10"/ DM/ 50Cr *30/5'7"/50Cr *30/6'/25Cr *27/ 6'/ 50Cr* 28/5'9"/25Cr* 29/5'8"/50Cr * Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/MBBS/ Res-Doc-USA *27/ 6'/ 50Cr *35/5'6"/50Cr *30/6' *30/5'7" *29/5'7" *30/5'7" *26/5'7" * Cont: K.C.Reddy-Hyd.Ph:9849321309/ 9347807015.

★ Reddy/Australia, *B.Tech/ MS/ Citizen/ 28/5'9"/30Cr *PR/30/5'8"/25Cr/ 6L/Rents*Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/B.Tech/MS/ H1/ USA* 29/ 5'7"/ 150K/ 70Cr *27/5'8"/100K/ 30Cr *31/ 6'/ 150K/ 30Cr *28/5'11"/60Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015.

★ Reddy/B.Tech/IIT/BITS/H1/USA *31/6' /150K/ 30Cr *27/5'10"/25Cr* 25/6'/ 15Cr *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

**వరుడు కావలెను**

★ Reddy/ (Christian) /BHMS/ Doc/ 25/5'6"/ 15Cr (prop) *B.Tech/ 25/ 5'7"/30Cr *23/5'5"/ 15Cr *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/Rich *B.Tech/27/5'3"/ 50Cr *27/ 5'5"/40Cr *29/5'2"/ 100Cr *27/5'7"/ 50Cr *23/ 5'4"/ 50Cr *26/5'6"/ 100Cr*Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/ H1/ MS/ H1/ USA *25/ 5'3"/ 40Cr *27/5'5"/ 25Cr *27/ 5'4"/30Cr *26/5'2"/20Cr *24/5'5"/ 10Cr *28/5'5"/20Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ MBBS/ PG-Rich *26/5'6"/ 10Cr *27/5'7"/100Cr *28/5'5"/50Cr *30/ 5'7"/15Cr *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ MBBS/ Res-doc-USA *25/ 5'4"/ 120Cr *25/5'7"/ 50Cr *28/ 5'5"/ 10Cr *30/ 5'2"/ 10Cr *28/5'3" *27/5'7"/10Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/ 24/5'4"/10Cr *27/ 5'6"/ 25Cr*27/5'5"/20Cr *24/ 5'6"/ 60Cr *25/ 5'7"/ 8Cr *27/5'3"/20Cr *27/ 5'3"/ 10Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech/M.Tech/ 26/5'4" /6Cr *25/ 5'5"/ 5Cr *30/5'2"/20Cr *25/5'6"/ 15Cr *25/5'1"/ 20Cr *26/5'3" *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ B.Tech (IIT) BITS/ 25/5'7"/30Cr *29/5'6" *25/5'6 *29/5'3" *26/5'2" *26/5'5" *26/5'3" *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/ (Diverce)/ B.Tech/ 27/5'6"/25Cr *30/5'6"/45Cr *25/5'5"/ 100K *32/5'2"/25Cr *32/5'2"/1Cr *30/5'2"/10Cr *30/5'3"/30Cr *26/5'3"/ 30Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★ Reddy/MBBS-Needs any Well Settled *22/5'5"/ 15Cr*28/5'5"/50Cr *27/ 5'7"/ 100Cr *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.


**REDDY MARRIAGE BUREAU**
పరిచయం మా వంతు పరిశీలన మీ వంతు
అందమైన రెడ్డి వధూవరులకు సంప్రదించండి
M. Yadagiri Reddy
Plot No. 34, Above:Canara Bank, Phase-I, Ganesh Temple Road, Vanasthalipuram, Hyderabad-70. E-mail: myreddy64@gmail.com
040-24021085, 9985199188

**శివతేజ కుమ్మర మ్యారేజ్ బ్యూరో**
కుమ్మరి కులస్తుల వివాహ పరిచయ వేదిక
1వ, 2వ వివాహ సంబంధాలు చూడబడును
ప్లాట్ నెం. 410, ఇ.నెం.6-2-483, లేక్ వాటర్ ట్యాంక్ ఎదురుగా, వనస్థలిపురం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్. తెలంగాణ రాష్ట్రం
సెల్: 9346771359, 9440452487
తాడూరి ఆగయ్య కుమ్మర, తాడూరి లింగయ్య కుమ్మర


**వధువు కావలెను**

★ Reddy 2nd Marriage : 35Y, 5'10", Degree, 4Acres Land, Marketing, వరునికి తగిన కాపు/ రెడ్డి వధువు కావలెను. 9502948305,7207594437


★ మేరు (దర్జీ) : 2వ, 37Y, 5'3", ప్రభుత్వ టీచరు, హైదరాబాద్‌లో సొంత ఇల్లు కల్గి ప్రభుత్వ టీచర్, వయస్సు 25 నుండి 32 సం॥ల వధువు కావలెను. Ph: 8801491731.

★కుల ప్రసక్తి లేదు: పద్మశాలి సెకండ్ మ్యారేజ్ 38/5'6"/డిగ్రీ/ Tailor & Magician/ 2 పిల్లలు గల అందమైన వరునికి Pvt/Govt. జాబ్ వధువు కావలెను. వైఫ్: Ph:9848925231.

★కేవలం కుల పట్టింపు లేని వారికి మాత్రమే. వ: 45-55 సం॥ వారు మాత్రమే సంప్ర॥ అన్ని కుల ప్రసక్తి లేని వారికి మాత్రమే. ప్లీజ్ శ్రీ రెడ్డి స్పెషల్ కూడా సంప్ర: 7396570769.

★గంగపుత్ర, బెస్త: Age: 29, Ht: 5'10", MBA, Business, 30,000/-PM వరునికి తగిన వధువు కావలెను. Direct సంప్రదించవలెను.సెల్: 8179613892.

★Sunni Shaik Muslim for Second Marriage, 46 Years Old need a Partner issue less age between 30 to 35 Years. Good looking Height above 5'4", Please Call: 9177296080.


**వరుడు కావలెను**

★పద్మశాలి: 30 Yr/5.3 Ht/ డైవర్స్/సూపర్ మార్కెట్ & డ్రైవింగ్/ 4 L P/M, 13 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువు బీపీఎస్ మాకుచే కావలెను కావలెను. (కుల ప్రసక్తి లేని వరుడు) Ph: 9030171338

★కాపు: 28 Yr/5.4 Ht/Un Married/ వాటర్ ప్లాంట్ & సొంత రెస్టారెంట్ (2)/8 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి (కుల ప్రసక్తి లేని వరుడు) కావలెను. Ph: 8125404026

★పద్మశాలి: వయస్సు 32, Hight: 5.2. M.Sc, B.Ed. కెరీ కలర్ వధువుకు సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. సెల్: 9912981290

★మాదిగ: 24-5'4", బీటెక్ డైవర్స్ వధువు కొరకు 35సం॥ల లోపు I, II కుల సంబంధం. స్టైల్ న్యూ జాబ్ గల వరుడు కావలెను. NGKL జిల్లా వారు HY, నిజామాబాద్ వారికి సంప్ర: (డైరెక్ట్). సెల్: 9542801579.

**4 లైన్ల ప్రకటనకు 400/-**
**ప్రతి అదనపు లైనుకు 100/-**
**కళ్యాణమస్తు**
# 8-2-603/1/7, 8, 9, Krishnapuram, Road. No.10 ,Banjara Hills, Hyderabad - 500034.
**8096677819**

**కుమ్మర కళ్యాణ వేదిక**
కుమ్మరి కులస్తుల పెళ్లి సంబంధాల కోసం సంప్రదించండి
దేవరుప్పల యాదగిరి కుమ్మర
బడంగ్‌పేట్, హైదరాబాద్ జిల్లా
Cell: 9640972206

**శ్రీ పద్మశాలి మ్యారేజ్ బ్యూరో**
Regd. No. 864/2009

E-mail: sripadmashalimarriages@gmail.com
పద్మశాలి కులస్తులకు మాత్రమే ప్రత్యేక శ్రద్ధతో సంబంధములు కుదుర్చబడును.
దాసి దయానంద్
# 5-265, Opp: గ్రీన్ బావర్చి రెస్టారెంట్, HMT రోడ్, చింతల్, హైదరాబాద్-54.
8019960999, 9603308999
9030895678, 040-42024047

## శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో
అన్ని కులములు పెండ్లి సంబంధములకు సంప్రదించండి.

H.O : తార్నాక హుడా కాంప్లెక్స్,
srisowbhagya.hyd@gmail.com,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Ex. Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.

**వధువు కావలెను**

★ కాపు : 31Y, 5'9", B.Tech, SWE, USA, 110K PA వరునికి USA/ India వధువు కావలెను. 9248064777

★ మున్నూరుకాపు : 31Y, 5'5", MBA, SWE, 95,000 PM వరునికి వధువు కావలెను. 9246960888

★ పద్మశాలి : 29Y, 5'5", M.Tech, SWE,USA, 4Lakhs PM వరునికి USA/ India వధువు కావలెను. 9030315599

★ గౌడ్స్ : 29Y, 5'7", B.Tech, M.Sc, SWE, 53,000/- PM వరునికి వధువు కావలెను. 9248064777

★ ముదిరాజ్ : 28Y, 5'5", B.Tech, MBA, SWE, 6Lakhs PA వరునికి వధువు కావలెను. 9246960888

★ గంగపుత్ర : 28Y, 5'8", B.Tech, SWE, 10Lakhs PA వరునికి వధువు కావలెను. 9030315599

★ విశ్వబ్రాహ్మణ : 25Y, 5'11", B.Tech, SWE 11.5 Lakhs PA వరునికి వధువు కావలెను. 9248064777

★ నాయీబ్రాహ్మణ : 30Y, 5'10", B.Tech, SWE, 12Lakhs PA వరునికి వధువు కావలెను. 9246960888

★ హిందూ మాల : 30Y, 5'8", MBA, SWE, 55,000 PM వరునికి వధువు కావలెను. 9030315599

★ హిందూ మాదిగ : 30Y, 5'8", MS, SWE, 80,000/- PM వరునికి వధువు కావలెను. 9248064777

**వరుడు కావలెను**

★ మున్నూరుకాపు: 24Y, 5'6", M.Tech, SWE, 7Lakhs PA వధువుకు SWE వరుడు కావలెను. 9248064777

★ పద్మశాలి : 27Y, 5'3", B.Tech, SWE, 6.5 Lakhs PA వధువుకు వరుడు కావలెను. 9246960888

★ గౌడ్స్ : 25Y, 5'5", B.Tech, SWE, 25,000 PM వధువుకు వరుడు కావలెను. 9030315599

★ ముదిరాజ్: 29Y, 5'4", M.Sc, M.Ed, Lecturer, 20,000 PM వధువుకు వరుడు కావలెను. 9248064777

★ గంగపుత్ర : 25Y, 5'4", M.Tech, Assistant Professor, 20,000/-PM వధువుకు వరుడు కావలెను. 9246960888

★ విశ్వబ్రాహ్మణ : 25Y, 5'2", B.Tech, SWE, 4 Lakhs PA వధువుకు వరుడు కావలెను. 9030315599

★ నాయీబ్రాహ్మణ: 26Y, 5'6",B.Tech, MBA, Manager, 40,000 PM వధువుకు వరుడు కావలెను. 9248064777

★ హిందూ మాల : 24Y, 5'4", M.Pharmacy, 16,000/- PM వధువుకు వరుడు కావలెను. 9246960888

★ హిందూ మాదిగ: 25Y, 5'4", M.Tech, SWE, 30,000 PM వధువుకు వరుడు కావలెను.9030315599

★ కాపు రెండవ పెళ్లి: 35Y, 5'3", MBA, HR, 60,000 PM వధువుకు Caste no bar వరుడు కావలెను. 9248064777

## స్వప్న వివాహ వేదిక (మాదిగ ప్రత్యేకత)
★ గణేష్ టెంపుల్, సికింద్రాబాద్ స్టేషన్,
Cell No.: 9392897111,
(Email: snvivahavedica@gmail.com)
Time: 10 am to 7 pm Tuesday Holiday

కేవలం మాదిగ దేశ, విదేశ, మొదటి, రెండు, 2వ, డాక్టర్స్, ఇంజనీర్స్, MBA, PG, డిగ్రీ & అన్ని తరగతుల వారికి వివాహ సంబంధాలు త్వరగా కుదర్చగల నమ్మకమైన సంస్థ 'స్వప్న వివాహ వేదిక'.

**వధువు కావలెను**

★ మాదిగ: 1986, 5'8", కలర్ Fair Q: M.Tech, Job BSNL ఇంజనీర్ జీతం 45,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1985, 5'8", కలర్ Fair Q: B.Tech Job Govt Bank ఆఫీసర్ జీతం 7.2 LK P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1982, 5'6", కలర్ M.Fair Q: M.Sc Job MS ME Asst Director Govt Emp జీతం 50,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1988, 5'7", కలర్ M.Fair Q: B.Tech (EEE) Job AE TS Genco Govt Emp జీతం : 70,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011.

★ మాదిగ: 1990, 5'6", కలర్ Fair Q: M.Sc (Agri) Job Agricultural Extension Officer Govt Emp జీతం : 30,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1987, 5'4", కలర్ M.Fair Q: B.Tech (Civil Eng) Job Technical Officer in ECIL Govt Emp జీతం : 60,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1987, 5'7", కలర్ Fair Q: MBBS Job Asst Divisional Medical Officer in (Railways) జీతం 90,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1989, 5'11", కలర్ M.Fair Q: MBBS Job Airindia Govt Emp జీతం 65,000 P/M, గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ : 1985, 6'0", కలర్ Fair Q: B.Tech ECE Job SWE జీతం 11Lk P/A గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ 2వ సంబంధం మాదిగ : 1972, 5'5", కలర్ Fair Q: B.Tech Job Railway Govt Emp జీతం 70,000 P/M గల వరునికి తగిన వధువు కావలెను. 9392897111 / 7032568011(WAP).

**వరుడు కావలెను**

★ మాదిగ: 1987, 5'3", కలర్ M.Fair Q: BAMS MD Final year గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011.

★ మాదిగ: 1987, 5'3", కలర్ Fair Q: B.Ed Job PET Govt టీచర్ జీతం 35,000 P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011.

★ మాదిగ: 1990, 5'5", కలర్ Fair Q: B.Tech (ECE) Job USA SWE జీతం 3LK P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011.

★ మాదిగ: 1991, 5'1", కలర్ M.Fair Q: M.Tech, IIT Job SWE జీతం 10Lack P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1991, 5'4", కలర్ Fair Q: M.Tech Job Asst Professor జీతం 20,000 P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1992, 5'3", కలర్ Fair Q: B.Tech ECE Job ICICI Bank జీతం 20,000 P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ: 1993, 5'3", కలర్ Fair Q: B.Tech Job Accenture జీతం 3.8LK P/A గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ 2వ సంబంధం: 1992, 5'3", కలర్ Fair Q: B.Sc, Job Pvt జీతం : 12,000 P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011.

★ మాదిగ 2వ సంబంధం: 1986, 5'3", కలర్ Fair Q: BE Job Assistant Manager in SWE జీతం : 5.5LK PA గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

★ మాదిగ 2వ సంబంధం: 1970, 5'5", కలర్ Fair Q: BA Job Govt Emp జీతం 30,000 P/M గల వధువుకి తగిన వరుడు కావలెను. 9392897111/ 7032568011(WAP).

## సాయి తేజ మ్యారేజ్ బ్యూరో
అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్రదించండి :-
**SAI TEJA MARRIAGE BUREAU**
RTC 'X' Roads, Sahara Bakery Line, Street-7, Hyderabad, T.S.
సంప్ర : 9666551031, 7075254535
E-mail: saiteja.mb@gmail.com

**అమ్మాయిలు**

★ ముదిరాజ్: 1992, 5'3", B.Tech, SWE నెలకు 40 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1991, 5'4", M.Tech, Assistant Professor నెలకు 50 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ S.C మాదిగ : 1978, 5'5", M.Tech, Govt Job నెలకు 50 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1991, 5'4", (EEE) B.Tech, Amazon Manager నెలకు 50 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1986, 5'6", MBA, Finance SWE నెలకు 35వేలు 10 లక్షలు కట్నం ఇచ్చు అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1992, 5'3", B.Tech, Central Govt Job USA National Park Services నెలకి 4 లక్షలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1995, 5'5", B.Tech, Mechanical SWE నెలకు 35 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ గౌడ: 1990, 5'4", Degree Govt Job నెలకు 40 వేలు గల అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1984, 5'4", MBA, SWE నెలకు 30 వేలు 15 లక్షలు కట్నం ఇచ్చు అందమైన అమ్మాయికి అబ్బాయి కావలెను. 9666551031

★ ముదిరాజ్: 1993, 5'3", B.Tech, 40 లక్షలు కట్నం ఇచ్చు అందమైన అమ్మాయికి Well Settled అబ్బాయి కావలెను. 9666551031

**అబ్బాయిలు**

★ ముదిరాజ్: 1987, 5'9", M.Tech, Assistant Professor నెలకు 50వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ గౌడ: 1985, 5'6", B.Tech, (ECE) SWE in Banglore P/M 1Lakh గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1987 5'7", B.Tech, SWE in Capgemini నెలకి 90 వేలు 5 కోట్ల Property Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1985 5'10", Diploma (IT) Central Govt Job నెలకి 45 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ S.C మాల : 1986 5'8", MCA Central Govt Job నెలకి 35 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535(కుల ప్రసక్తి లేదు)

★ ముదిరాజ్: 1988 5'10", M.Tech (IIIT) SWE USA నెలకి 4లక్షలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1989 5'7", M.Tech Govt Job Lecturer నెలకి 75 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ ముదిరాజ్: 1985 5'7", M.Sc, Anatomy BPT Doctor నెలకు 60 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ S.C మాదిగ: 1984 5'9", B.Tech MBA Central Govt Job SBI Manager నెలకి 60 వేలు గల Well Settled అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

★ రెండవ పెండ్లి : గౌడ 1976 5'8", M.Sc, SWE Asst Manager నెలకి 75 వేలు గల అబ్బాయికి అమ్మాయి కావలెను. 7075254535

## SPK మ్యారేజ్ లైన్స్
దేశ, విదేశ, ఇంజనీర్స్, డాక్టర్స్, యాక్టర్స్, లాయర్స్, Govt., Pvt., & బిజినెస్ 1వ, 2వ సంబంధాలు చూడబడును. Good Family Settlements (అన్నికులములు చూడబడును)

Address: Shop No. 336, 3rd Floor, LPT Market, L.B.Nagar, Hyderabad
Cell: 9885073575
Whatsaap: 8686605482
E-mail: spkmarriagelines@gmail.com
ప్రశాంతి నేత

**వధువు కావలెను**

★ పద్మశాలి (డైవర్స్) : Q : M.Pharmacy, 29, 5'5", Govt Job, 70,000 PM వరునికి Any Govt Job వధువు కావలెను. Ph : 7286054756.

★ పద్మశాలి : Q : M.Tech (IIT), 32, 5'8", S/W Job, 1.5L PM వరునికి S/W వధువు కావలెను. Ph : 7286054756.

★ పద్మశాలి : Q : MBBS, MD, 30, 5'7", 1L PM వరునికి MBBS వధువు కావలెను. Ph : 7286054756.

★ పద్మశాలి : Q : MS, (USA), 32, 5'10", S/W 150K వరునికి MS (USA) S/W వధువు కావలెను. Ph : 7286054756

★ పద్మశాలి : Q : M.Pharmacy, 29, 5'8", ఫార్మసీ Job 60,000 PM Own House వరునికి తగిన వధువు కావలెను. Ph : 7286054756.

★ పద్మశాలి (డైవర్స్) : Q : B.Tech, 37, 5'8", S/W Job : 70,000 PM వరునికి తగిన వధువు కావలెను. Ph : 7286054756.

★ వైశ్యాస్ : Q : MBA, 29,5'6", Job, 60,000 PM వరునికి తగిన వధువు కావలెను. Ph : 7286054756.

★ బ్రాహ్మిన్స్ : Q : B.Tech, 30, 5'10", Own House, 50,000 PM వరునికి తగిన వధువు కావలెను. Ph : 7286054756.

★ రెడ్డి : Q : B.Tech, 32, 5'6", Govt Job, 60,000 PM Own House వరునికి తగిన వధువు కావలెను. Ph : 7286054756.

★ ఆంధ్ర పద్మశాలి : Q : Degree, 37,5'6", Job in Hyd 35,000 PM వరునికి Any Study వధువు కావలెను (అర్జెంటు). Ph : 7286054756.

**వరుడు కావలెను**

★ పద్మశాలి (డైవర్స్) : Q : Degree, 41, 5'2", Job, 25,000/- PM వధువుకి Govt, S/W Own House Settled in Hyd వరుడు కావలెను. (అర్జెంట్) Ph : 8686605482.

★ పద్మశాలి : Q : MBA, 29,5'3", Job, 30,000 PM వధువుకి Govt, S/W Own House వరుడు కావలెను. Ph : 8686605482.

★ పద్మశాలి : Q : M.Tech (IIT), 28, 5'3", Job 50,000 PM వధువుకి S/W వరుడు కావలెను. Ph : 8686605482.

★ పద్మశాలి : Q : M.Pharmacy, 25, 5'2", Job, 35,000/- PM, వధువుకి S/W Govt MS- Business Own House Settled in Hyd వరుడు కావలెను. Ph : 8686605482.

★ పద్మశాలి : Q : MBBS (MD), 27,5'2", Pursuing, వధువుకి MBBS, MD Own House Settled వరుడు కావలెను. Ph : 8686605482.

★ పద్మశాలి (డైవర్స్) : Q : B.Tech, MBA, 29,/5'4", Job, 60,000/- PM వధువుకి S/W Govt వరుడు కావలెను. Ph : 8686605482.

★ పద్మశాలి (డైవర్స్) : Q : MBA, 28/ 5'3", వధువుకి S/W వరుడు కావలెను. Ph : 8686605482.

★ మేర (దర్జీ) : (డైవర్స్) Q : B.Tech, 27/ 5'4", వధువుకి తగిన వరుడు కావలెను. Ph : 8686605482.

★ రెడ్డి (డైవర్స్) : Q : MS (USA), 37/5'3", Job S/W 6L PM వధువుకి Any Study Well Settled వరుడు కావలెను. Ph : 8686605482.(అర్జెంటు)

★ గౌడ్ : Q : M.Tech, 26/5'6", Job, 35,000 PM వధువుకి MS(USA), S/W Well Settled వరుడు కావలెను. Ph : 8686605482.(అర్జెంటు)

## బంగారం ధరలు

ఢిల్లీ

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 29,420 |
| 22 క్యారెట్లు | 29,270 |
| వెండి (కిలో) | 38,325 |

## కోడిగుడ్ల ధరలు

| | నెక్ | హెచ్ఎల్ఎఫ్ఏ |
|---|---|---|
| హైదరాబాద్ | 313-00 | 313-00 |
| రంగారెడ్డి | 313-00 | 313-00 |
| మెదక్ | 313-00 | 313-00 |
| కరీంనగర్ | 315-00 | --- |
| వరంగల్ | 315-00 | --- |
| రిటైల్ ప్రైస్ | 3-75 | 3-75 |

## చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర | 75.00 |
| రిటైల్ లైవ్ | 89.00 |
| డ్రెస్డ్ | 125.00 |
| స్కిన్‌లెస్ | 145.00 |

## పెరిగిన ఆంధ్రా సిమెంట్స్ నష్టం

**హైదరాబాద్, ఆగస్టు 5:** రాష్ట్రానికి చెందిన ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ ఆంధ్రా సిమెంట్స్ నష్టాల పరంపర కొనసాగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను (ఏప్రిల్-జూన్) రూ.25.42 కోట్ల నష్టం వచ్చినట్లు సంస్థ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలోనూ రూ.20.85 కోట్లు నష్టపోయింది. అమ్మకాల్లో మాత్రం సంస్థకు ఊరట లభించింది. గత త్రైమాసికంలో సంస్థ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 26.10 శాతం పెరిగి రూ.108.50 కోట్లకు చేరుకున్నాయి.

# గోరక్షకుల హింస సమాజానికి చేటు

## పెద్దనోట్ల రద్దు కంటే ఇదే ప్రమాదకరం: కౌశిక్ బసు

**ముంబై, ఆగస్టు 5:**



పెద్ద నోట్ల రద్దు వంటి విధానపరమైన తప్పుడు నిర్ణయాలకంటే సామాజిక నష్టాలు ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయని ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు అన్నారు. ఈమధ్యకాలంలో గోరక్షణ పేరుతో పలు చోట్ల మనుషుల్ని కొట్టి చంపిన (లించింగ్) హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. బీజేపీ అధికారంలోకి వచ్చాకే దేశంలో ఈ తరహా ఘటనలు పెరిగాయని, హిందుస్థాన్‌ను లించిస్థాన్‌గా మార్చేశారంటూ మోదీ సర్కారును పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. ఈ నేపథ్యంలో బసు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం రాత్రి ముంబైలో జరిగిన లలిత్ దోషి 23వ స్మారకోపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'దేశంలో తాజా సామాజిక పరిణామాలు కలవరపెడుతున్నాయి. గోరక్షణ పేరిట మనుషుల్ని కొట్టి చంపిన సంఘటనలు అమెరికాలో ఉన్న నన్నెంతో నిరుత్సాహపరిచాయి. ఆర్థిక వ్యవస్థపై సామాజిక నష్టాల ప్రభావాన్ని తుడిపేసేందుకు పెద్ద నోట్ల రద్దు లేదా ఇతర తప్పుడు పాలసీల వల్ల కలిగే నష్టాన్ని పూడ్చడానికంటే ఎక్కువకాలం పడుతుంది' అని అన్నారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై బహిరంగ చర్చ జరుగాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ పేద దేశమే అయినప్పటికీ..శాస్త్రీయ ధోరణి, పరిశోధనపరంగా గౌరవంగా ఉంది. ఆ భావనను మార్చుకునే పరిస్థితి కల్పించవద్దని బసు పేర్కొన్నారు.

**పెద్ద నోట్ల రద్దు.. చాలా పెద్ద తప్పు**

పెద్ద నోట్ల రద్దు నిర్ణయం 'చాలా పెద్ద తప్పు' అని కౌశిక్ బసు అన్నారు. ఆర్థిక వ్యవస్థకు తగిలిన అతిపెద్ద షాక్ అని, ఫలితంగా వృద్ధి మందగించిందన్నారు. ఇప్పటికే భారత జీడీపీ 8 శాతం దాటి ఉండాల్సిందని, పెద్ద నోట్ల రద్దు కారణంగా 6 శాతానికి పడిపోయిందన్నారు. మరి కొన్నాళ్లపాటు వృద్ధిరేటు ఇదే స్థాయిలో కొనసాగవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో స్థిర ధరల ఆధారిత వృద్ధిరేటు 6.1 శాతంగా నమోదైంది. స్వల్పకాలికంగా చూస్తే.. పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక వృద్ధి తిరోగమనబాట పట్టడమే కాకుండా, ప్రభుత్వ ఉద్దేశాలేవీ నెరవేరలేదన్నారు.

**జీఎస్టీ, దివాలా చట్టం ప్రగతికారకం**

దేశంలో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) చట్టం అమలును ముందడుగుగా అభివర్ణించారు కౌశిక్ బసు. అయితే, జీఎస్టీ చట్టాన్ని పక్కాగా రూపొందించలేదని, సంక్లిష్టంగా ఉందన్నారు. తొలినాళ్లలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ క్రమంగా అవి సమసిపోవచ్చన్నారు. జీఎస్టీ హయాంలో రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఎత్తివేతతో సరుకు రవాణా మెరుగుపడటంతోపాటు లావాదేవీల ఖర్చు తగ్గనుండటంతో భారీ ప్రయోజనాలు చేకూరనున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈమధ్య అమలు చేసిన దివాలా చట్టం కూడా ఆర్థిక వ్యవస్థ పురోగతికి దోహదపడనుందన్నారు.

## బీఎస్ఎన్ఎల్ రక్షాబంధన్ ఆఫర్లు


**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్.. రక్షాబంధన్ సందర్భంగా ప్రీపెయిడ్ వినియోగదారులకు నూతన ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో ఎస్టీవీ-74, ఎస్టీవీ-188, ఎస్టీవీ-289, ఎస్టీవీ-389 రీచార్జ్ ఆఫర్లు ఉన్నాయని టెలికం సర్కిల్ సీజీఎం ఎల్ అనంతరాం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ఐదు రోజుల కాలపరిమితి కలిగిన ఎస్టీవీ-74 రీచార్జ్‌తో 1జీబీ డాటా, 74 నిమిషాల టాక్‌టైంతోపాటు సొంత నెట్‌వర్క్ పరిధిలో అన్‌లిమిటెడ్ కాల్స్ చేసుకోవచ్చు. 14 రోజుల కాలపరిమితి కలిగిన ఎస్టీవీ-188తో రూ.189 టాక్‌టైంతో పాటు మెయిన్ బ్యాలెన్స్‌లో రూ.31, 1 జీబీ ఉచిత డాటా లభించనుంది. 28 రోజుల పరిమితి కలిగిన ఎస్టీవీ-289తో రూ. 289 టాక్‌టైంతో పాటు మెయిన్ బ్యాలెన్స్‌లో రూ.51, ఒక జీబీ ఉచిత డాటా అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. నెల రోజుల కాలపరిమితి కలిగిన ఎస్టీవీ-389తో రూ.389 టాక్‌టైంతో పాటు మెయిన్ బ్యాలెన్స్‌లో రూ.71, 1 జీబీ ఫ్రీ డాటా లభించనుంది.

## సిండికేట్ బ్యాంక్ నష్టం 263 కోట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రభుత్వ రంగ సంస్థ సిండికేట్ బ్యాంక్ ఆర్థిక ఫలితాలకు మొండి బకాయిల సెగ తగిలింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో రూ.263.19 కోట్ల నష్టం వచ్చినట్లు ప్రకటించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు అధికమవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చిందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి రూ.79.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో ఆదాయం రూ.6,419.12 కోట్ల స్థాయి నుంచి రూ.6,171.49 కోట్లకు పడిపోయినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. గత త్రైమాసికంలో మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ నిధుల కేటాయింపులు ఏడాది ప్రాతిపదికన 79 శాతం పెరిగి రూ.1,385.66 కోట్లకు చేరుకున్నాయి. అంతక్రితం ఏడాది ఈ విలువ రూ. 774.41 కోట్లుగా ఉంది. గడిచిన త్రైమాసికంలో కార్పొరేట్, హోల్‌సేల్ బ్యాంకింగ్ సేవలు అందించడం ద్వారా రూ.2,088.98 కోట్ల ఆదాయం సమకూరగా, రిటైల్ బ్యాంకింగ్ సేవలతో రూ.1,984.67 కోట్లు ఆర్జించింది. బ్యాంక్ జారీ చేసిన మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏఎస్) వాటా 7.53 శాతం నుంచి 9.96 శాతానికి పెరుగగా.. నికర ఎన్‌పీఏ 5.04 శాతం నుంచి 6.27 శాతానికి చేరుకుంది.

## ఉద్యోగులనూ ఉచితంగా సేవ చేయమంటారు..

### బాబా రాందేవ్ గురించి పతంజలి మాజీ సీఈవో ఎస్‌కే పాత్ర



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ ఆధ్వర్యంలో నడుస్తున్న పతంజలి మాజీ సీఈవో ఎస్‌కే పాత్ర.. సంస్థ లోగుట్టును బయటపెట్టారు. ఉద్యోగులను జీతం లేకుండా ఉచితంగా సేవ చేయాలని బాబా రాందేవ్ కోరుకుంటారన్నారు. 'పతంజలి సంస్థ తన ఉద్యోగులకు చాలా తక్కువ జీతం చెల్లిస్తుంది. బాబాజీ ఉద్యోగాన్ని కూడా సేవగానే భావిస్తారు. ఉదాహరణకు.. నేను అక్కడ రెండు బాధ్యతలు చేపట్టా. పతంజలి ఆయుర్వేద, పతంజలి ఫుడ్‌పార్క్‌ల కార్యకలాపాలను పర్యవేక్షించా. రెండు ఉద్యోగాలకు వేతనం చెల్లిస్తామని వారు మొదటి హామీ ఇచ్చారు. అయితే, 'పాత్రాజీ ఇక్కడికి సేవ చేయడానికి వచ్చారు. ఇప్పుడు జీతం కూడా అందుకుంటున్నారు. త్వరలో ఆయన అదికూడా తీసుకోరు' అని బాబాజీ అందరితో అనేవారు. కానీ నేను వెంటనే స్పందించి నాకు జీతం కావాలి అనే వాడిని. నాకోసం కాదు. నాకో కుటుంబం ఉంది. వారి బాగోగులు చూసేందుకైనా డబ్బులు కావాలికదా. దాంతో బాబాజీ నాపై జాలిపడి ఒక ఉద్యోగానికి మాత్రం జీతం చెల్లించేవారు. అయినప్పటికీ ఆయన.. నేను ఉచితంగా సేవ చేయాలని కోరుకునేవారు' అని ది మింట్ డైలీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పాత్ర వెల్లడించారు. 'వాళ్లు చెప్పేదానికి, చేసేదానికి ఎంతో తేడా ఉంటుంది. అది నాకు ఇబ్బంది కలిగించింది. ఫలితంగా నేను సంస్థ నుంచి బయటికొచ్చేశాను' అని ఆయన చెప్పారు. ఐఐటీ, ఐఐఎం పట్టభద్రుడైన ఎస్‌కే పాత్ర.. 2011 నుంచి 2014 మధ్య కాలంలో పతంజలి ఆయుర్వేద లిమిటెడ్‌కు సీఈవోగా, పతంజలి ఫుడ్ పార్క్‌కు ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు.

## చిన్న బ్యాంకుల విలీనం ఎంఎస్‌ఎంఈ రంగానికి దెబ్బే



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** చిన్న బ్యాంకులు విలీనమైతే ఎంఎస్‌ఎంఈ రంగానికి భారీ దెబ్బ అని సర్వేలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న చిన్న స్థాయి బ్యాంకులను విలీనం చేస్తే తక్కువ మొత్తాల్లో రుణాలు తీసుకునే ప్రజలు, సంస్థలపై తీవ్రస్థాయిలో ప్రభావం పడనున్నదని ఆర్థిక సేవల సంస్థ రిసర్జంట్ ఇండియా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. స్థానికులకు తక్కువ మొత్తాల్లో రుణాలు ఇవ్వడానికి పెద్ద బ్యాంకులు అంతగా ఆసక్తి చూపడం లేదని, అలాగే అత్యధికంగా ఫీజును వసూలు చేస్తుండటం సామాన్యులపై ప్రభావం పడనున్నదని ఈ సర్వేలో తెలిపింది. ఈ నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈలు రుణాలు తీసుకోవడం అంత సులభంకాదని, దీంతో వారి గుర్తింపు తగ్గే ప్రమాదం ఉందని రిసర్జంట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి ప్రకాశ్ తెలిపారు. దేశీయ తయారీ రంగంలో ఉపాధి లభిస్తున్న కార్మికుల్లో 45 శాతం ఎంఎస్‌ఎంఈ రంగానికి చెందిన వారే. అలాగే ఎగుమతుల్లో వాటా 40 శాతంగా ఉంది. వృద్ధిరేటులో 8 శాతం వాటా కలిగివున్నాయి.

# అక్షరాల పదిలక్షలు

- రాజన్న సిరిసిల్లలో ఒకేరోజు మెగా ప్లాంటేషన్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** హరితహారంలో జిల్లాను అగ్రభాగాన నిలుపాలన్న మంత్రి కేటీఆర్ పిలుపునకు స్పందించి కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలో పది లక్షల మొక్కలు నాటారు రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు. వేములవాడ మండలం నాంపల్లి గుట్టపై ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, ఆలయ ఈవో దూస రాజేశ్వర్ మొక్కలు నాటా రు. సిరిసిల్ల మండలం పెద్దూరులో ఎస్పీ విశ్వజిత్, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ చిక్కాల రామారావు మొక్కలు నాటారు. ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా నాంపల్లి గుట్టపై మొక్కనాటుతున్న వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్



మహబూబ్‌నగర్ డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న అటవీ శాఖ మంత్రి జోగురామన్న తదితరులు



మేడ్చల్ జిల్లా నాచారం పారిశ్రామిక వాడలో మొక్కనాటుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు



వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నీళ్లపల్లిలో హరితహారంలో పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి



రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద నిర్వహించిన హరితహారంలో పాల్గొన్న వీసీ ప్రవీణ్‌రావు తదితరులు



## ప్రముఖ సాహితీవేత్త
# హరిశివకుమార్ కన్నుమూత



హరిశివకుమార్(ఫైల్)

**వరంగల్ చౌరస్తా:** ప్రముఖ సాహితీవేత్త, చరిత్రకారుడు, కాకతీయ విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ హరిశివకుమార్(80)శనివారం ఉదయం ఊపిరితిత్తుల సమస్యతో కన్నుమూశారు. ఆయన కాకతీయుల చరిత్రను నేటి తరాలకు శాస్త్రీయ ఆధారాలతో చేరువ చేసేలా రచనలు చేశారు. కాకతీయ కళాతోరణం విశేషాలను వివరణాత్మకంగా అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అవతరణ వేడుకల్లో తెలంగాణ సాహితీ అవార్డుతో సత్కరించింది. ఆయన కాకతీయ వైభోగం, ఓరుగల్లు అసలు చరిత్ర, ఓరుగల్లు దర్శనీయ స్థలాలు అనే పలు రచనలు చేశారు. అంతే కాకుండా సాహిత్య, కళారంగాలకు సంబంధించి సుమారు 400 పైచిలుకు పుస్తకాలు రచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు లెక్చరర్, రీడర్, ప్రొఫెసర్‌గా సుమారు 37 సంవత్సరాల పాటు సేవలందించారు.



హరిశివకుమార్ పార్థివదేహం

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని యాగం

**బీర్కూర్:** అన్నం పెట్టే రైతన్న సుఖంగా ఉంటేనే అందరం బాగుంటామని, వర్షాలు బాగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, అందుకే వరుణయాగం చేపట్టినట్టు వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఆయన సతీసమేతంగా శనివారం వరుణయాగం నిర్వహించారు. గత ఏడాది తెలంగాణ తిరుమల దేవస్థానంలో వరుణయాగం చేసిన తరువాతే వర్షాలు పుష్కలంగా కురిశాయని అన్నారు.



వరుణయాగం నిర్వహిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు



హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీఆర్ఎస్ శ్రేణులు

## ఇసుక, పేకాటను ప్రోత్సహించిన ఘనత ఉత్తమ్‌దే

**హుజూర్‌నగర్, నమస్తేతెలంగాణ:** ఇసుక, పేకాటను ప్రోత్సహించిన ఘనత టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిదేనని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు అల్లం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ కోర్టుల్లో కేసులు వేయడాన్ని నిరసిస్తూ శనివారం హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ ఇంటిని ముట్టడించడానికి ర్యాలీగా వెళ్తున్న టీఆర్ఎస్ నాయకులను రాజీవ్‌చౌక్‌లో పోలీసులు అడ్డుకున్నారు. బంగారు తెలంగాణకు అడ్డుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీని, ఉత్తమ్‌ను రాష్ట్రం నుంచి తరిమేయాలని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు.



## భారీ హ్యూమన్ కార్
### గిన్నిస్ బుక్ రికార్డ్ కోసం..

**సిద్ధార్థనగర్(వరంగల్):** కాజీపేటలోని ఫాతిమానగర్ సెయింట్ గ్యాబ్రియేల్ స్కూలు మైదానంలో అతిపెద్ద మానవ ఆకారం కారును ప్రదర్శించారు. 'సఫల్ భారత్' ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పారుపెల్లి కిషోర్ ఆధ్వర్యంలో శనివారం 8 పాఠశాలల నుంచి 3250 మంది విద్యార్థులు, 100 మంది ఎన్‌సీసీ కెడెట్స్ పాల్గొని అతిపెద్ద మానవ కారు ఆకారాన్ని ప్రదర్శించారన్నారు. గతంలో లార్జెస్ట్ హ్యూమన్ కారు ఇమేజ్‌ను చెన్నైకి చెందిన 1660 మంది విద్యార్థులతో 3 నిమిషాల ప్రదర్శన చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించారని, ఇప్పుడు సఫల్ భారత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3250 మంది విద్యార్థులతో 10 నిమిషాల పాటు ప్రదర్శన నిర్వహించారు.

# అబ్బురపడ్డ ఐఏఎస్‌లు

- కాళేశ్వరం 6, 8 ప్యాకేజీ పనుల పరిశీలన
- ఇప్పటివరకు ఇటువంటి పనులు చూడలేదని వెల్లడి
- కాళేశ్వరంతో రాష్ట్ర ప్రజల కల సాకారం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఏకే గోయల్

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, రామడుగు, నమస్తే తెలంగాణ:**


ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఏకే గోయల్ తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా జరుగుతున్న పనులను శనివారం ఐఏఎస్, ఐపీఎస్‌ల బృందం సందర్శించింది. ముందుగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ శివారులో ఎనిమిదో ప్యాకేజీలో భాగంగా పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. 150 అడుగుల లోపల జరుగుతున్న పనులను నిశితంగా పరిశీలించిన బృందం సభ్యులు అబ్బుర పడ్డారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్న తీరు, తద్వారా వచ్చే ఫలితాలు, ఇంజినీరింగ్ విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి బయలు దేరి వెళ్లిన బృందం ఆరో ప్యాకేజీలో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని కుక్కలగూడురు, మేడారం వద్ద పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా ఏకే గోయల్ మాట్లాడుతూ 58 సంవత్సరాల పాలనలో ఎక్కడా ఈ తరహాలో ప్రాజెక్టుల నిర్మాణం జరుగలేదన్నారు. గత ప్రభుత్వం పోతిరెడ్డిపాడు చేపట్టినా అది అచరణలో విఫలమైందన్నారు. మేడిగడ్డ వద్ద 2082 టీఎంసీల నీటి లభ్యత ఉందని, అందుకే ఎత్తిపోతల ద్వారా ఆ నీటిని వినియోగించి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు ఈ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల నుంచి వచ్చిన ఈ ప్రాజెక్టు తెలంగాణకు ఒక గొప్ప వరంలాంటిదన్నారు. ఈ పథకాన్ని సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసేందుకు ప్రభుత్వం అహర్నిషలు కృషిచేస్తున్నదన్నారు. భారీ నీటిపారుదల శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు, నీటిపారుల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి పనుల ప్రగతిపై ప్రత్యేక దృష్టిపెడుతున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, సంబంధిత శాఖ కార్యదర్శి అజయ్‌మిశ్రా సహకారంతో ఈ ఎత్తిపోతలకు కావాల్సిన విద్యుదుత్పాదనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మహారాష్ట్ర సర్కారు గోదావరి నదిపై అనేక ప్రాజెక్టులను నిర్మాణం చేపట్టిందని తద్వారా ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఎండిపోయే దశకు చేరుకుందన్నారు. నీటి సౌలభ్యం లేని తెలంగాణను ఊహించుకోవడమే భయంకరంగా ఉంటుందన్నారు.అందుకే సీఎం కేసీఆర్ అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సలహాలు తీసుకొని ఒక్కో పనికి నిర్ణీత వ్యవధిని నిర్ణయించారని, ఆ దిశగా పనులు చేయిస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ ప్రజల కల సాకారం కానుందన్నారు. పర్యటనలో రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, హెచ్ఎం అండ్ ఎఫ్‌డబ్ల్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్వర్ తివారి, రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి రాజీవ్ త్రివేది, ఎల్ఈటీ అండ్ ఎఫ్ విభాగం ప్రధాన కార్యదర్శి శంకర్ గోయల్, టీఆర్ అండ్ బీ విభాగం ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, బీసీడబ్ల్యూ విభాగం ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, ఐటీఈ అండ్ సీ విభాగం ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఐ అండ్ క్యాడ్ విభాగం ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, హోంశాఖ కార్యదర్శి అనిత రాజేంద్ర, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, శిక్షణ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.





కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ టన్నెల్‌లో పనుల గురించి అడిగి తెలుసుకుంటున్న ఐఏఎస్ అధికారులు.. టన్నెల్ లోపలికి నడుచుకుంటూ వెళ్తున్న ఐఏఎస్ అధికారులు

## ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు



(జూన్1 నుంచి ఇప్పటివరకు 314.967 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

### కృష్ణా బేసిన్

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తినీటిమట్టం (అడుగుల్లో) | ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో) | పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుతం (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 21003 | 21003 | 1705 | 1704.72 | 128.72 | 128.19 |
| నారాయణపూర్ | 19432 | 17562 | 1615 | 1614.34 | 37.646 | 37.12 |
| జూరాల | 6610 | 4318 | 1045 | 1037.76 | 9.66 | 5.653 |
| తుంగభద్ర | 4757 | 224 | 1633 | 1613.18 | 100.86 | 41.70 |
| శ్రీశైలం | 74 | 74 | 885 | 778 | 215.807 | 19.62 |
| నాగార్జునసాగర్ | 0 | 505 | 590 | 500.50 | 312.045 | 116.10 |
| పులిచింతల | 0 | 4860 | 175 | 113.85 | 45.77 | 2.52 |
| ప్రకాశం బ్యారేజీ | 7632 | 7632 | 57.05 | 54.05 | 3.070 | 2.28 |

### గోదావరి బేసిన్

| ప్రాజెక్టు | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | పూర్తినీటిమట్టం (అడుగుల్లో) | ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో) | పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో) | ప్రస్తుతం (టీఎంసీల్లో) |
|---|---|---|---|---|---|---|
| జైక్వాడ్ | 7002 | 3298 | 1522 | 1512.06 | 102.732 | 66.40 |
| కడెం | 0 | 165 | 700 | 687.23 | 7.6 | 4.714 |
| ఎస్సారెస్పీ | 0 | 632 | 1091 | 1055.30 | 90.313 | 9.51 |
| సింగూరు | 0 | 345 | 1717.93 | 1708.96 | 29.91 | 17.84 |
| నిజాంసాగర్ | 0 | 35 | 1405 | 1380.30 | 17.803 | 1.35 |
| ఎల్లంపల్లి | 217 | 418 | 485 | 471.98 | 20.175 | 10.44 |
| లోయర్‌మానేరు | 0 | 129 | 920 | 893.60 | 24.07 | 7.374 |
| ధవళేశ్వరం | 46173 | 46173 | 45 | 45 | 2.93 | 2.93 |



ఆదిలాబాద్‌లో మంత్రి జోగురామన్నకు రాఖీకట్టి హెల్మెట్‌ను అందజేస్తున్న తెలంగాణ జాగృతి మహిళా విభాగం జిల్లా కన్వీనర్ బద్దం కల్పనరెడ్డి



మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి ఎమ్మెల్యే దయాకర్‌రావుకు రాఖీ కడుతున్న విద్యార్థిని. చిత్రంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డికి హెల్మెట్ అందజేస్తున్న జాగృతి జిల్లా అధ్యక్షురాలు నళిని

## రాఖీ కట్టి.. హెల్మెట్ ఇచ్చి
### పలుచోట్ల సిస్టర్స్ ఫర్ చేంజ్‌పై అవగాహన

**ఆదిలాబాద్ టౌన్:** రాఖీ పండుగ ప్రతి సోదరుడికి రక్షగా నిలువాలని ఎంపీ కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపును ఆచరణలోకి తేస్తూ ఆడపడుచులంతా వారి సోదరులకు హెల్మెట్లు బహూకరించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై తెలంగాణ జాగృతి విస్తృత ప్రచారం కల్పిస్తున్నది. ఆదిలాబాద్‌లో రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగురామన్నకు జాగృతి మహిళా విభాగం జిల్లా కన్వీనర్ బద్దం కల్పనరెడ్డి రాఖీ కట్టి హెల్మెట్‌ను అందజేశారు. అనంతరం మంత్రి హెల్మెట్ ధరించి బుల్లెట్ బైక్ నడిపారు. నిజామాబాద్‌లో జాగృతి జిల్లా శాఖ భారీ ర్యాలీ నిర్వహించింది. నెహ్రూపార్క్ వద్ద నిర్వహించిన అవగాహన సదస్సుకు ఏసీపీ ఆనంద్‌కుమార్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, మేయర్ ఆకుల సుజాత హాజరై మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు కళాశాల విద్యార్థులు రాఖీలు కట్టి హెల్మెట్లను అందించారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు నళిని రాఖీ కట్టి హెల్మెట్‌ను కానుకగా అందించారు.



నిజామాబాద్‌లో నిర్వహించిన సిస్టర్ ఫర్ చేంజ్ అవగాహనలో పాల్గొన్న ఏసీపీ ఆనంద్, మేయర్ ఆకుల సుజాత, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి తదితరులు

# ఉన్నతవిద్యలో సంస్కరణలు అవసరం

### కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ చంద్రకాంత్ కొకాటే


**హన్మకొండ, నమస్తే తెలంగాణ :** ఉన్నతవిద్యలో సంస్కరణలు తీసుకురావాలని, ఇందుకోసం రాధాకృష్ణన్ కమిటీ, కొఠారి కమిటీ సిఫారసులను అమలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ చంద్రకాంత్ కొకాటే అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త, కేయూ మాజీ వీసీ డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ స్మారకోపన్యాసం శనివారం కేయూ సెనెట్ హాల్‌లో వీసీ సాయన్న అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొకాటే ఆయన మాట్లాడుతూ 'భారతదేశంలో ఉన్నత విద్య – ప్రస్తుత పరిస్థితి, సవాళ్లు' అనే అంశంపై మాట్లాడారు. డాక్టర్ జయశంకర్ వీసీగా, రిజిస్ట్రార్‌గా కాకతీయ వర్సిటీకి విశేషమైన సేవలందించారన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నదని, మరిన్ని విశ్వవిద్యాలయాల ఏర్పాటు అవసరమని అన్నారు. ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా సిలబస్‌లో మార్పులు రావాలని, బేసిక్ రీసెర్చ్ విషయంలో మనం ఎంతో వెనకబడి ఉన్నామని, జాతీయ స్థాయిలో ఎన్నో పరిశోధనా సంస్థల నిధులను పూర్తిగా వినియోగించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కే పురుషోత్తం, మాజీ వీసీ లింగమూర్తి, మాజీ రిజిస్ట్రార్ శంకరయ్య, బండా ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.




శనివారం కేయూ సెనెట్‌హాలులో 'ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్మారకోపన్యాసం'లో మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ చంద్రకాంత్ కొకాటే

## విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

**మోతె:** విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురం గ్రామంలో శనివారం విద్యుత్ అధికారులు లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకొని కొత్త స్తంభాలకు వైర్లు లాగుతున్నారు. అదే గ్రామానికి చెందిన పెద్దెటి శ్రీకాంత్ (22), వీరబోయిన మహేశ్ (19), గంగరబోయిన వెంకన్న, మున్నా వెంకటేశ్ అనే నలుగురు అధికారులకు సమాచారం ఇవ్వకుండా శ్రీకాంత్ బావి వద్ద విద్యుత్ వైర్లు లాగుతున్నారు. ఈ క్రమంలో వైర్లు లాగడం పూర్తయిన అధికారులు ఎల్‌సీ వాపస్ తీసుకోగా విద్యుత్ సరఫరా అయ్యి శ్రీకాంత్, మహేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, వెంకన్న, వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్ తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై గఫూర్ తెలిపారు.



# ‘విజయే’ందర్

ప్రోబాక్సింగ్‌లో విజ్జూ వరుసగా 9వ విజయం

చైనా బాక్సర్ చిత్తు




**ముంబై:** పెట్టని కోట లాంటి చైనా గోడ బద్దలైంది. ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో అపజయమెరుగని ధీరునిగా దూసుకెళుతున్న విజేందర్‌సింగ్..చైనా బాక్సర్ జుల్ఫికర్ మైమైటీయాలీ భరతం పట్టాడు. శనివారం ఆఖరు వరకు హోరాహోరీగా సాగిన ‘ఆసియా యుద్ధం’లో సింగ్ జయకేతనం ఎగురవేశాడు. పది రౌండ్ల పాటు అభిమానులను అలరించిన ఈ ఉత్కంఠభరిత పోరులో విజ్జూ వైపే రిఫరీలు మొగ్గుచూపారు. దీంతో తన డబ్ల్యూబీవో ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్‌వెయిట్ టైటిల్‌ను నిలబెట్టుకోవడంతో పాటు ప్రత్యర్థిదైన ఓరియంటల్ సూపర్ మిడిల్‌వెయిట్ టైటిల్‌నూ అందుకున్నాడు. విజేందర్‌కిది వరుసగా తొమ్మిదో విజయం. చైనా వస్తువుల మన్నిక ఏంటో తెలుసు కదా అని బౌట్‌కు ముందు వ్యాఖ్యానించిన విజ్జూ, అదే రీతిలో చైనా బాక్సర్‌తో పోటీపడ్డాడు. తొలి మూడు రౌండ్లలో ఇద్దరు బాక్సర్లు ఒకరిపై ఒకరు పదునైన పంచ్‌లు సంధించుకోవడంతో ఆధిక్యం ఎవరిదో స్పష్టంగా తెలియలేదు. నాలుగో రౌండ్‌లో ఒక్కసారిగా పుంజుకున్న విజ్జూ..జుల్ఫికర్‌పై ఎదురుదాడికి దిగడంతో సరైన సమాధానం లేకపోయింది. ఈ హర్యానా బాక్సర్ జోరును మరింత పెంచడంతో చైనా బాక్సర్ ఒక్కసారిగా డిఫెన్స్‌లో పడిపోయాడు. ఈ దశలో జుల్ఫికర్.. దురుసుగా దాడికి దిగడంతో విజ్జూ ఒక్కసారిగా కూలిపోయాడు. ఓవైపు ముక్కు నుంచి రక్తం కారుతున్నా..ఆత్మవిశ్వాసం కోల్పోకుండా అపార అనుభవంతో జాబ్స్, హుక్స్‌తో సింగ్ చెలరేగాడు. ఎత్తును తనకు అనుకూలంగా మలుచుకున్న విజేందర్..క్లీన్‌పంచ్‌లతో చైనా బాక్సర్‌ను చిత్తుచేశాడు. బౌట్ ముగిసి రిఫరీలు విజేందర్‌ను విజేతగా ప్రకటించిన తర్వాత స్టేడియం మొత్తం హోరెత్తింది.

**అఖిల్, జితేందర్ అరంగేట్రం అదుర్స్**

భారత బాక్సర్లు అఖిల్ కుమార్, జితేందర్ కుమార్‌ల ప్రొబాక్సింగ్ అరంగేట్రం అదిరింది. ఈ ఇద్దరు తమ ప్రత్యర్థులను నాకౌట్ చేసి విజయం సాధించారు. జూనియర్ వెల్టర్‌వెయిట్ కేటగిరి పోరులో అఖిల్.. ఆస్ట్రేలియా బాక్సర్ టి గిల్‌క్రిస్ట్‌ను చిత్తుచేశాడు. జితేందర్ లైట్‌వెయిట్ కేటగిరి బౌట్‌లో తానెట్ లిఖిత్‌కామ్‌పోర్న్‌పై టెక్నికల్ నాకౌట్ పద్ధతిలో గెలిచాడు.

# మన చేతుల్లోనే!



**శ్రీలంక ఫాలో ఆన్**

**రెండో ఇన్నింగ్స్‌లో 209/2**

**తొలి ఇన్నింగ్స్‌లో 183కే ఆలౌట్**

**బ్యాట్స్‌మెన్ ఇచ్చిన భారీస్కోరుకు అండగా నిలిచిన భారత బౌలర్లు రెండో టెస్టును దాదాపుగా చేతుల్లోకి తీసుకున్నారు. కరుణరత్నే, మెండిస్ రెండో ఇన్నింగ్స్‌లో పోరాటం చేసినా.. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఆతిథ్య జట్టు ఇంకా పెద్ద మొత్తంలో పరుగులు చేయాల్సి ఉంది. కాబట్టి అద్భుతం జరిగితే తప్ప ఈ మ్యాచ్‌లో లంకకు ఓటమి తప్పకపోవచ్చు.**

**కొలంబో:**

భారత బౌలర్ల ధాటికి విలవిలలాడిన లంకేయులు.. రెండో టెస్టులో ఫాలో ఆన్‌లో పడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే చేతులెత్తేసినా.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుశాల్ మెండిస్ (135 బంతుల్లో 110; 17 ఫోర్లు), కరుణరత్నే (92 బ్యాటింగ్) వీరోచితంగా పోరాడారు. రెండు సెషన్ల పాటు వికెట్ ఇవ్వకుండా టీమ్‌ఇండియా బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఫలితంగా శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 60 ఓవర్లలో 2 వికెట్లకు 209 పరుగులు చేసింది. పుష్పకుమార (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఇన్నింగ్స్ ఓటమిని తప్పించుకోవాలంటే లంక ఇంకా 230 పరుగులు చేయాల్సి ఉంది.

అంతకుముందు 50/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన లంక తొలి ఇన్నింగ్స్‌లో 49.4 ఓవర్లలో 183 పరుగులకే కుప్పకూలింది. దీంతో విరాట్‌సేనకు 439 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. డే 5, 6 ఓవర్లలో వరుసగా చండిమల్ (10), మెండిస్ (24)ను ఔట్ చేయడంతో భారత్ వికెట్ల పతనాన్ని కొనసాగించింది. ఈ దశలో మాథ్యూస్ (26), డిక్‌వెల్లా (51) ఎదురుదాడి చేసినా.. జడేజా (2/84), అశ్విన్ (5/69) అద్భుతంగా కట్టడి చేశారు. ఐదో వికెట్‌కు 53 పరుగులు జోడించాకా మాథ్యూస్ ఔటయ్యాడు. తర్వాత పెరీరా (25) కాసేపు ప్రతిఘటించినా మిగతా వారి సహకారం కరువైంది.

**మెండిస్, కరుణరత్నే పోరాటం**

లంచ్ తర్వాత రెండో ఇన్నింగ్స్‌కు వచ్చిన లంకకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కొత్త బంతిని పంచుకున్న ఉమేశ్-అశ్విన్ ఆతిథ్య జట్టుపై బాగా ఒత్తిడి పెంచారు. ఫలితంగా మూడో ఓవర్‌లోనే ఓపెనర్ ఉపుల్ తరంగ (2)ను ఉమేశ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఈ పరిణామంతో కాస్త కంగారుపడ్డ లంక ఇన్నింగ్స్‌కు కరుణరత్నే, మెండిస్ ప్రాణం పోశారు. భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్న ఈ ఇద్దరు కీలక భాగస్వామ్యంతో మ్యాచ్‌పై ఆశలు పెంచారు. ఉమేశ్-అశ్విన్ ప్రభావం తగ్గడంతో షమీ-జడేజా కాంబినేషన్‌ను రంగంలోకి తెచ్చినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. 11 పరుగుల వద్ద మెండిస్ ఇచ్చిన క్యాచ్‌ను మిడాన్‌లో ధవన్ వదిలేశాడు. పూర్తి ఏకాగ్రత్తతో ఆడిన ఈ ఇద్దరు.. చెత్త బంతులను మాత్రమే షాట్లుగా మలిచారు. దీంతో 24వ ఓవర్‌లో లంక 100 పరుగులకు చేరింది. కొద్దిసేపటి తర్వాత మెండిస్ డీఆర్‌ఎస్ ద్వారా ఎల్బీ నుంచి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ అర్ధసెంచరీలు పూర్తి చేసుకుని 118/1 స్కోరుతో టీ విరామానికి వెళ్లారు.

టీ తర్వాత కరుణరత్నే గేమ్ ప్లాన్‌కు కట్టుబడితే.. మెండిస్ అటాకింగ్ మొదలుపెట్టాడు. ఓవర్‌కు మూడున్నర పరుగుల రన్‌రేట్ నమోదు చేయడంతో స్కోరు బోర్డు వేగంగా కదిలింది. స్పిన్నర్లను ఎక్కువగా ఉపయోగించిన కోహ్లీ.. పేసర్లను షార్ట్ స్పెల్‌తో రొటేట్ చేశాడు. అయినా లంకేయులు వికెట్ ఇవ్వలేదు. ఫలితంగా మెండిస్ 120 బంతుల్లో మూడో టెస్టు సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మరికొద్ది నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా పాండ్యా ఈ జంటను విడదీశాడు. అద్భుతమైన ఆఫ్ కట్టర్‌కు మెండిస్ వికెట్ సమర్పించుకున్నాడు. దీంతో రెండో వికెట్‌కు 191 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.



2

**భారత్ తరఫున వేగంగా 150 వికెట్లు తీసిన రెండో బౌలర్ రవీంద్ర జడేజా. 32 మ్యాచ్‌ల్లో జడ్డూ ఈ ఘనత అందుకున్నాడు. అశ్విన్ (29), ప్రసన్న (34), కుంబ్లే (34), హర్భజన్ (35) ఈ జాబితాలో ఉన్నారు. లెఫ్టార్మ్ స్పిన్నర్లలో ఈ ఫీట్‌ను సాధించిన తొలి బౌలర్‌గా జడేజా రికార్డులకెక్కాడు. వినూ మన్కడ్ (40), బిషన్ బేడీ (41), రవిశాస్త్రి (78)లను అధిగమించాడు.**



కరుణరత్నే (92★)

మెండిస్ (110)

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 622/9 డిక్లేర్డ్

**శ్రీలంక తొలి ఇన్నింగ్స్:** కరుణరత్నే (సి) రహానే (బి) అశ్విన్ 25, తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0, మెండిస్ (సి) కోహ్లీ (బి) ఉమేశ్ 24, చండిమల్ (సి) పాండ్యా (బి) జడేజా 10, మాథ్యూస్ (సి) పుజార (బి) అశ్విన్ 26, డిక్‌వెల్లా (బి) షమీ 51, డిసిల్వా (బి) జడేజా 0, పెరీరా (బి) అశ్విన్ 25, హెరాత్ (బి) షమీ 2, పుష్పకుమార నాటౌట్ 15, ఫెర్నాండో (బి) అశ్విన్ 0, **ఎక్స్‌ట్రాలు:** 5, **మొత్తం:** 49.4 ఓవర్లలో 183 ఆలౌట్; **వికెట్లపతనం:** 1-0, 2-33, 3-60, 4-64, 5-117, 6-122, 7-150, 8-152, 9-171, 10-183; **బౌలింగ్:** షమీ 6-1-13-2, అశ్విన్ 16.4-3-69-5, జడేజా 22-6-84-2, ఉమేశ్ 5-1-12-1.

**శ్రీలంక రెండో ఇన్నింగ్స్:** కరుణరత్నే బ్యాటింగ్ 92, తరంగ (బి) ఉమేశ్ 2, మెండిస్ (సి) సాహా (బి) పాండ్యా 110, పుష్పకుమార బ్యాటింగ్ 2, **ఎక్స్‌ట్రాలు:** 3, **మొత్తం:** 60 ఓవర్లలో 209/2; **వికెట్లపతనం:** 1-7, 2-198; **బౌలింగ్:** ఉమేశ్ 9-2-29-1, అశ్విన్ 24-6-79-0, షమీ 6-2-13-0, జడేజా 16-2-76-0, పాండ్యా 5-0-12-1.

## ముగ్గురికి ద్రోణాచార్య

**సిఫారసు చేసిన కేంద్ర క్రీడాశాఖ**

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ద్రోణాచార్య అవార్డు కోసం అథ్లెటిక్స్ కోచ్ రామక్రిష్ణన్ గాంధీ, సత్యనారాయణ, హీరానంద్ కటారియా పేర్లను సిఫారసు చేశారు. దాదాపు దశాబ్దం పాటు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తరఫున పలువురు అథ్లెట్లను తీర్చిదిద్దిన 55 ఏండ్ల గాంధీ గతేడాది మరణించారు. గతేడాది జపాన్‌లోజరిగిన ఆసియా రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన గుర్మీత్ సింగ్, కాంస్యం నెగ్గిన బల్జీందర్ సింగ్‌లు గాంధీ దగ్గరే తర్ఫీదు పొందారు. మరోవైపు రియో పారాలింపిక్స్(2016) హైజంప్‌లో పసిడి పతకంతో మెరిసిన మరియప్పన్ తంగవేలు అద్భుత ప్రదర్శన వెనుక మెంటార్ సత్యనారాయణ కృషి ఉంది. జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్న తంగవేలును దేశం గర్వించే అథ్లెట్‌గా ఆయన తీర్చిదిద్దాడు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులకు గాను ప్రసాద్ (బ్యాడ్మింటన్), భూషణ్ మొహంతీ (బాక్సింగ్), రాఫెల్ (హాకీ), సంజయ్ చక్రవర్తి (షూటింగ్), రోషన్ లాల్ (రెజ్లింగ్) పేర్లను ప్రతిపాదించారు. ధ్యాన్‌చంద్ అవార్డు కింద భూపిందర్‌సింగ్ (అథ్లెటిక్స్), షాహిద్ హకీమ్ (ఫుట్‌బాల్), సుమరయి (హాకీ) పేర్ల సిఫారసుకు వచ్చాయి.

## ఐటాకు ఇదేం కొత్తకాదు

**అర్జున అవార్డుకు తన పేరును సకాలంలో పంపలేదంటూ బోపన్న ఆగ్రహం**



**న్యూఢిల్లీ:** క్రీడా పురస్కారం అర్జున ఎంపిక విషయంలో మరోసారి తనకు అన్యాయం జరిగిందంటూ అఖిల భారత టెన్నిస్ సమాఖ్య (ఐటా)పై వెటరన్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. నిర్ణీత గడువులోగా తన పేరును అర్జున అవార్డుకు సిఫారసు చేయలేదంటూ ఏఐటీఏపై బోపన్న నిప్పులు చెరిగాడు. వాస్తవానికి అవార్డు కోసం పేర్లు ప్రతిపాదించేందుకు ఏప్రిల్ 28 తుది గడువు. అయితే ఇంచియాన్ (2014) ఆసియా క్రీడల్లో రెండు పతకాలు సాధించిన సాకేత్ మైనేని పేరును నిర్ణీత తేదీలోగా పంపిన ఐటా..బోపన్న పేరును మాత్రం అతను ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన తర్వాత అంటే జూన్ 14న పంపింది. దీంతో బోపన్న పేరును పరిగణనలోకి తీసుకోని అవార్డుల కమిటీ.. సాకేత్ పేరును అర్జునకు ఎంపికచేసింది. ‘అంతర్జాతీయ వేదికలపై దేశ గౌరవాన్ని ఇనుమడింపజేసేందుకు ప్రొఫెషనల్ ఆటగాళ్లమైన మేం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాం. కానీ కావాల్సిన గుర్తింపు దక్కడంలో మాత్రం ఎప్పుడూ నిరాశే ఎదురవుతున్నది. నిర్ణీత గడువులోగా పేరును పంపించడంలో ఐటా పూర్తిగా విఫలమైంది. నా విషయంలో ఇలా చేయడం ఐటాకు ఇదేం కొత్తేం కాదు, గతంలోనూ ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయి’ అని బోపన్న ఆరోపించాడు. ఐటా మాత్రం తన నిర్ణయాన్ని సమర్థించుకున్నది. ‘బోపన్న పేరును అర్జున అవార్డుకు ఆలస్యంగా ప్రతిపాదించాం. దేశం తరపున ప్రాతినిధ్యం వహించే ఆసియా క్రీడలు లాంటి వాటిలో అతను పతకాలు సాధించకపోవడమే దీనికి కారణం. అతను జూన్‌లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ టైటిల్ గెలిచాడు. అయితే, అప్పటికే అవార్డుకు సిఫారసు గడువు ముగిసింది. అయినా కూడా అతని గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ప్రపంచ చాంపియన్‌షిప్ కింద పరిగణిస్తూ ఆలస్యంగానైనా పేరును ప్రతిపాదించాం. మొదట అసలు నిబంధనలు ఏంటో తెలుసుకుని అతను మాట్లాడితే బాగుంటుంది’ అని ఐటా జనరల్ సెక్రెటరీ హిరణ్మయ్ ఛటర్జీ దీటుగా బదులిచ్చాడు.

## కార్ల్‌సన్‌తో ఆనంద్ గేమ్ డ్రా

**సెయింట్ లూయిస్ (యూఎస్‌ఏ):** భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ సిన్‌క్వెఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో వరుసగా మూడో డ్రా నమోదుచేశాడు. ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో శనివారం జరిగిన మూడోరౌండ్ గేమ్‌ను ఆనంద్ 66ఎత్తుల్లో డ్రాగా ముగించాడు. మొత్తం 10మంది ఆటగాళ్లు పోటీపడుతున్న ఈ రౌండ్ రాబిన్ టోర్నమెంట్‌లో ఇంకా ఆరు రౌండ్లు మిగిలి ఉన్నాయి.

# వారెవా.. ఫరా






ఫరా భార్య, పిల్లల ఆనందం

- ■ బ్రిటన్ స్టార్‌దే 10వేల మీటర్ల రేసు
- ■ తొలిరోజు భారత్‌కు నిరాశే
- ■ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

**లండన్:** బ్రిటన్ స్టార్ అథ్లెట్ మో ఫరా మళ్లీ గర్జించాడు. ఈ నల్లజాతి వజ్రం వరుసగా మూడోసారి 10,000 మీటర్ల రేసులో ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. శనివారం ఉదయం జరిగిన పదివేల మీటర్ల ఫైనల్ రేసును ఫరా 26 నిమిషాల 49.51 సెకన్ల టైమింగ్‌తో ముగించి స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. కెరీర్‌లో చివరి ప్రపంచ చాంపియన్‌షిప్ ఆడుతున్న ఫరా వరుసగా మూడోసారి విజేతగా నిలిచి సుదూర పరుగులో తనకు తిరుగులేదని మరోసారి చాటుకున్నాడు. 34ఏండ్ల ఫరాకిది అంతర్జాతీయ వేదికపై వరుసగా పదో స్వర్ణ పతకం కావడం విశేషం. 2012 ఒలింపిక్స్‌లో ఇదే స్టేడియంలో స్వర్ణ పతకాన్ని ముద్దాడిన ఫరా.. రేసు ఆరంభంలో కొంత ఒత్తిడికి గురైనట్లు కనిపించినా చివర్లో మాత్రం వేగాన్ని పెంచి గమ్యాన్ని చేరాడు. ఉగాండాకు చెందిన 20ఏండ్ల యువ కెరటం జోషువా చెప్టెగి.. ఫరా కంటే మూడుసెకన్లు వెనుకబడి రజత పతకానికి పరిమితమయ్యాడు. కెన్యా అథ్లెట్ పాల్ తనూయి కాంస్య పతకం సరిపెట్టుకున్నాడు. ఈ చాంపియన్‌షిప్‌లోనే 5000 మీటర్లలోనూ పోటీపడనున్న ఫరా.. ఆ రేసులోనూ స్వర్ణ పతకం సాధించి కెరీర్‌కు గ్రాండ్‌గా వీడ్కోలు పలకాలన్న పట్టుదలతో ఉన్నాడు. ఈ రేసులోనూ విజేతగా నిలిస్తే వరుసగా మూడో ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ ‘డబుల్’ (10వేలు, 5వేల మీటర్లలో స్వర్ణం) సాధించిన అథ్లెట్‌గా రికార్డు అందుకుంటాడు. ఫరాకిది 10వేల మీటర్ల రేసులో నాలుగో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం. తొలిసారిగా 2011లో రజతం సాధించిన ఫరా.. ఆ తర్వాత వరుసగా మూడు చాంపియన్‌షిప్స్‌లోనూ పసిడి నెగ్గాడు. 2016 రియో ఒలింపిక్స్‌లోనూ ఫరా స్వర్ణ పతకంతో మెరిసిన సంగతి తెలిసిందే. ‘మరోసారి బ్రిటన్ గర్వపడేలా చేశాను. నా ఈ సుదీర్ఘ ప్రయాణం ఇంత అద్భుతంగా సాగినందుకు చాలా సంతోషంగా ఉంది’ అని ఫైనల్ ముగిశాక ఫరా అన్నాడు. 5వేల మీటర్ల ఫైనల్ ఈనెల 13న జరుగనుంది.




ద్యుతీ

## ద్యుతీ హీట్స్‌లోనే ఔట్

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నిరాశే ఎదురైంది. బరిలోకి దిగిన ముగ్గురు భారత అథ్లెట్లు ద్యుతీ చాంద్, మహ్మద్ అనాస్, స్వప్నా బర్మన్‌లు తమ విభాగాల్లో ఫైనల్స్ చేరడంలో విఫలమయ్యారు. చివరి నిమిషంలో అనూహ్యంగా లండన్ టిక్కెట్ దక్కించుకున్న ఒడిశా స్టార్ స్ప్రింటర్ ద్యుతీ చాంద్ మహిళల 100 మీటర్లలో కనీసం సెమీస్ కూడా చేరకుండా తొలిరౌండ్‌లోనే వెనుదిరిగింది. ద్యుతీ 12.07 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 5వ నంబర్ హీట్స్‌లో ఆరోస్థానంలో నిలిచి నిరాశపరిచింది. మొత్తం ఆరు హీట్స్‌లో టాప్ త్రీలో నిలిచిన అథ్లెట్లు మాత్రమే సెమీస్ చేరుతారు. 47మంది అథ్లెట్లలో ద్యుతీ 38వ స్థానానికి పరిమితమై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక పురుషుల 400 మీటర్ల రేసులో భారత అథ్లెట్ మహ్మద్ అనాస్ 45.98 సెకన్ల టైమింగ్ నమోదుచేసి సెమీస్‌కు ముందే వెనుదిరిగాడు. హెప్టాథ్లాన్‌లో భారత అమ్మాయి స్వప్నా బర్మన్ మొత్తం 31మందిలో 27వ స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## కాంస్య పతక పోరులో మనీశ్, సాజన్

**న్యూఢిల్లీ:** ఫిన్‌లాండ్ వేదికగా జరుగుతున్న ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారత రెజ్లర్లు మనీశ్, సాజన్ కాంస్య పతక పోరులో నిలిచారు. 60కిలోల గ్రీకో-రోమన్ విభాగంలో మనీశ్ వరుసగా మూడు బౌట్లు గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లాడు. అయితే సెమీస్‌లో మనీశ్ 1-3తో ఇరాన్ రెజ్లర్ కీరామత్ మోరాద్ చేతిలో ఓడిపోయాడు. కాంస్య పతక పోరులో హసన్ అహ్మద్(ఈజిప్టు)తో మనీశ్ తలపడుతాడు. ఇక సాజన్(74కి) తన తొలి బౌట్‌లోనే 2-10తో అక్జోల్ మక్మదోవ్(కిర్గిస్థాన్) చేతిలో ఓడాడు. అయితే మక్మదోవ్ ఫైనల్ చేరడంతో దక్కిన రెప్‌చేజ్ అవకాశాన్ని సాజన్ సద్వినియోగం చేసుకున్నాడు. సాజన్ కాంస్య పతకం కోసం అలీ ఉస్మాన్(టర్కీ) అమీతుమీ తేల్చుకోనున్నాడు.

## మిట్టల్ గోల్డెన్ షాట్

**న్యూఢిల్లీ:** ఆసియా షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ అంకుర్ మిట్టల్ పసిడి పతకాలతో మెరిశాడు. కజకిస్థాన్ వేదికగా జరిగిన పురుషుల డబుల్ ట్రాప్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో మిట్టల్ 71 పాయింట్లతో స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక డబుల్ ట్రాప్ టీమ్ విభాగంలోనూ అంకుర్ మిట్టల్‌తో కూడిన భారత జట్టుకు స్వర్ణ పతకం దక్కింది.



## యు ముంబా అదుర్స్

**నాగ్‌పూర్:** ప్రొ కబడ్డీ లీగ్ ఐదో సీజన్‌లో యు ముంబా దూసుకుపోతున్నది. శనివారం దబాంగ్ ఢిల్లీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 36-22 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ అనూప్ కుమార్, రైడర్ షాబీర్ ఏడేసి పాయింట్లతో చెలరేగడంతో యు ముంబాకు గెలుపు సులువైంది. ఢిల్లీ కెప్టెన్ మిరాజ్ 7 పాయింట్లు సాధించినా మిగిలినోళ్లు రాణించకపోవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు.

**జోరుగా యూపీ యోధ**

ఈ సీజన్‌తో అరంగేట్రం చేసిన యూపీ యోధ జట్టు వరుసగా రెండో విజయాన్నందుకుంది. బెంగళూరు బుల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 32-27 స్కోరుతో నెగ్గింది. యూపీ జట్టులో కెప్టెన్ నితిన్ తోమార్ 9 రైడింగ్ పాయింట్లతో చెలరేగి విజయంలో కీలకపాత్ర పోషించాడు.



## ట్రంప్‌కు హర్యానా నుంచి రాఖీలు!



ట్రంప్‌కు పంపించనున్న రాఖీలు

**గుర్గావ్, ఆగస్టు 5:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు రాఖీ అంటే ఏమిటో తెలియక పోవచ్చు కానీ, ఆయన ఈసారి రాఖీ పండుగలో పాల్గొనే అవకాశం ఉంది. మన దేశం నుంచి ఆయనకు రాఖీలు అందనున్నాయి. హర్యానా రాష్ట్రంలోని వెనుకబడిన పాంతమైన మేవాట్‌లో మారుమూలన ఉన్న 'ట్రంప్' గ్రామానికి చెందిన విద్యార్థినులు 1001 రాఖీలను ఆయన కోసం ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. వాటిపై ట్రంప్ ఫొటోలుంటాయి. తాము పంపే రాఖీలతో భారత- అమెరికాల సంబంధాలు మరింత పటిష్ఠమవుతాయని వారు ఆశిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కోసం ఆయన ఫొటోతో కూడిన 500 రాఖీలను కూడా విద్యార్థినులు తయారు చేస్తున్నారు. 1800 జనాభా ఉన్న ఈ గ్రామం అసలు పేరు మరోరా.. కానీ సులభ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆ గ్రామాన్ని దత్తత తీసుకొని దానికి ట్రంప్ పేరు పెట్టింది.

## ఎల్పీజీ-ఆధార్ అనుసంధానానికి డెడ్‌లైన్

- ఉజ్వల యోజన లబ్ధిదారులకు సెప్టెంబర్ 30 వరకు గడువు
- మరణ ధ్రువపత్రానికి ఆధార్ తప్పనిసరి కాదు : కేంద్రం


**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ఉచిత ఎల్పీజీ పొందుతున్న పేదలు ఆధార్‌ను అనుసంధానించేందుకు ఇచ్చిన గడువును కేంద్రం పొడిగించింది. సెప్టెంబర్ 30 నాటికి పేదలు తమ గ్యాస్ కనెక్షన్లకు విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్)ను జతచేసుకోవాలని సూచించింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఆధార్ లేని నిరుపేదలు సబ్సిడీ గ్యాస్ కనెక్షన్లు పొందవచ్చని, అయితే మే 31కల్లా ఆధార్ గుర్తింపు సంఖ్యను పొంది అనుసంధానించాల్సి ఉంటుందని కేంద్రం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువును సెప్టెంబర్ 30కి పొడిగిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేసింది.

**డెత్‌సర్టిఫికెట్‌కు ఆధార్ తప్పనిసరి కాదు**

అక్టోబర్ 1 నుంచి మరణ ధ్రువీకరణ పత్రానికి ఆధార్‌ను అనుసంధానిస్తూ కేంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆధార్ విశిష్ట గుర్తింపు సంఖ్యను కానీ లేదా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సంఖ్యను కానీ జత చేయాల్సి ఉంటుందని పేర్కొన్నది. అయితే, మరణధ్రువీకరణ ప్రతానికి ఆధార్ తప్పనిసరి కాదని కేంద్రం వివరణను ఇచ్చింది. ఒకవేళ మరణించిన వ్యక్తికి సంబంధించిన ఆధార్ లేనిపక్షంలో, కుటుంబ సభ్యులు డిక్లరేషన్ సర్టిఫికెట్ జతచేయాల్సి ఉంటుందని తెలిపింది.

## యోగా గురువు.. వ్యాపార సామ్రాజ్యాధిపతి!

- బాబా రామ్‌దేవ్ జీవితంపై 'గాడ్‌మెన్ టు టైకూన్' పుస్తకం




**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** యోగాగురువుగా కొనసాగుతూ పతంజలి వ్యాపార సామ్రాజ్యాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మికగురువు బాబా రామ్‌దేవ్ జీవితంలోని బయటకు తెలియని ఎన్నో విషయాలను క్రోడీకరించి ప్రియాంక పాఠక్ నారాయణ్ అనే జర్నలిస్టు 'గాడ్‌మ్యాన్ టు టైకూన్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ బాబా రామ్‌దేవ్' పేరుతో పుస్తకం రాశారు. ఇందులోని అనేక అంశాలను ప్రియాంక మీడియాతో పంచుకున్నారు. 'యోగాను బోధించే గురువులే కరువైన సమయంలో బాబా రాందేవ్ దానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారు. వ్యాధులను తక్కువ ధరకే తగ్గించుకునే మార్గాలను చూపించారు. అంతేకాదు అనేక మంది యోగా గురువులను తయారు చేశారు. బాబా రాందేవ్ జీవితాన్ని ప్రభావితంచేసిన వ్యక్తులు నలుగురు. శంకర్‌దేవ్ నిర్మించి ఇచ్చిన ఆశ్రమంలోనే రామ్‌దేవ్ యోగా బోధనను ప్రారంభించారు. రెండో వ్యక్తి కరమ్‌వీర్.. వేలాది మంది ముందు యోగా ఎలా నేర్పాలో రామ్‌దేవ్‌కు నేర్పించిన గురువు. మూడోవ్యక్తి రాజీవ్ దీక్షిత్.. ఆర్థిక, రాజకీయ విషయాలను నేర్పించారు. నాలుగోవ్యక్తి ఆచార్య బాలకృష్ణ.. బాబా రాందేవ్‌కు తన జీవితంలోని ప్రతి సందర్భంలోనూ కీలకమైన వ్యక్తి. వ్యాపారవేత్తగా ఆయన లక్ష్యం పతంజలి ఉత్పత్తులను సామాన్యులకు చేర్చడమే. అందుకోసం తక్కువ ధరలకే వస్తువులను విక్రయించాలని నిర్ణయించడం వ్యాపారపరంగా అసాధారణ నిర్ణయం. రామ్‌దేవ్ జీవితాన్ని గమనిస్తే డబ్బు, అధికారం, రాజకీయం, మతం అనేవి భారతదేశంలో ఎలా పనిచేస్తాయనేది తెలుస్తుంది' అని ప్రియాంక తెలిపారు.



**చేపలు పట్టిన పుతిన్**

రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ ఇటీవల కొన్ని రోజులపాటు విధులకు దూరంగా సరదాగా గడిపారు. సైబీరియాలోని టైవా ప్రాంతంలో చేపలు పట్టారు. ఈ ఫొటోను రష్యా అధికార వార్తాసంస్థ శనివారం విడుదల చేసింది.



# సైనిక చర్యకు చైనా మొగ్గు

- డోక్లాంపై ఆ దేశ అధికార పత్రికలో వ్యాసం



**బీజింగ్, ఆగస్టు 5:** భారత్, చైనా మధ్య డోక్లాం వివాదం రోజురోజుకు ముదురుతున్నది. ఇరుదేశాల మధ్య ఇన్ని రోజులు మాటల యుద్ధం జరుగగా.. తాజాగా భారత్‌పై స్వల్పస్థాయి యుద్ధానికి చైనా వ్యూహం పన్నుతున్నట్లు తెలుస్తున్నది. భారత్, చైనా, భూటాన్ ముక్కోణపు జంక్షన్‌లోని డోక్లాం నుంచి ఎలాగైనా భారత బలగాలను తరిమివేయాలని, ఇందుకుగాను రెండు వారాల్లోగా స్వల్పస్థాయి సైనిక చర్య చేపట్టాలని చైనా యోచిస్తున్నట్లు ఆ దేశ అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్‌లో ఒక వ్యాసం ప్రచురితమైంది. షాంఘై అకాడమీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన పరిశోధక విద్యార్థి హూ జియాంగ్ ఈ వ్యాసాన్ని రాశారు. కొన్నేండ్లుగా భారత్ అవలంబిస్తూ వ్యవహరిస్తున్నదని, చైనా ఆశోపన విధానానికి అనుగుణంగా భారత్ ఎదురుకు లేదని వ్యాసంలో పేర్కొన్నారు. అంతేగాక డోక్లాం విషయంలో ఇటీవల భారత విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ చేసిన ప్రకటనలను పరిశీలిస్తే, వివాదానికి భారత్ మొగ్గు చూపుతున్నట్లు అర్థమవుతున్నదని తెలిపారు. ఇరుదేశాల సైనికులు ముందుగా వెనక్కి వెళ్లాలని, తర్వాతే చర్చలు జరుగుతాయని సుష్మా పేర్కొన్నట్లు చెప్పారు. వచ్చే నెలలో చైనాలో బ్రిక్స్ దేశాల సమావేశం జరుగనున్న నేపథ్యంలో భారత్‌ను హెచ్చరిస్తూ గ్లోబల్ టైమ్స్ వ్యాసాన్ని ప్రచురించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. శుక్రవారం చైనా రక్షణశాఖ అధికార ప్రతినిధి కూడా భారత్‌ను హెచ్చరిస్తూ తమ సహనం తుది దశకు చేరుకున్నదని పేర్కొన్న విషయం తెలిసిందే.

## చర్చలతో సమస్యకు పరిష్కారం

- 'సంవాద్' వీడియో సందేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రపంచంలోని దేశాలు, వివిధ సమాజాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అంతర్గత సంబంధాలు, ఒకరిపై ఒకరు ఆధారపడి జీవిస్తున్న 21వ శతాబ్దంలో.. ఉగ్రవాదం మొదలుకొని పర్యావరణ మార్పుల వరకు అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. అత్యంత కష్టతరమైన సమస్యలను కూడా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చనేది పురాతన కాలం నుంచి భారత్‌లో వస్తున్న సంప్రదాయమని చెప్పారు. శనివారం మయన్మార్‌లోని యాంగాన్‌లో 'సంక్షోభ నివారణ, పర్యావరణ స్పృహ' అనే అంశంపై జరిగిన రెండో అంతర్జాతీయ సదస్సుకు మోదీ వీడియో సందేశం పంపించారు. చర్చలు, అభిప్రాయాలను పంచుకోవటం అనే ప్రక్రియను పునాదిగా చేసుకుని భారతీయ ప్రాచీన తర్కశాస్త్రం నిర్మాణం అయిందని మోదీ చెప్పారు. సంక్షోభ నివారణకు, అభిప్రాయ భేదాలకు ఇది ఒక నమూనాగా నిలిచిందన్నారు. వివిధ మతాలు, నాగరికతలు, ఆధ్యాత్మిక భావధారలు సుదీర్ఘమైన మానవ ఆలోచనా పరంపర మూలంగా నిలిచిందని, ఈ వెలుగులోనే సమాధానలను అన్వేషించాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన ప్రసంగంలో కృష్ణుడు, రాముడు, బుద్ధుడు, ప్రహ్లాదుడి పేర్లను మోదీ ప్రస్తావించారు. ఆధునిక సమాజంలోని ప్రతి ఒక్కరు పర్యావరణ చట్టాలు, నిబంధనలపై అవగాహన, పర్యావరణ స్పృహను కలిగి ఉండాలని సూచించారు.

# పాక్ మంత్రివర్గంలో హిందువుకు చోటు

- రెండు దశాబ్దాలలో ఇదే తొలిసారి
- ప్రమాణ స్వీకారం చేసిన దర్శన్‌లాల్



**ఇస్లామాబాద్, ఆగస్టు 5:** పాకిస్థాన్ ప్రభుత్వంలో తొలిసారి ఓ హిందువుకు స్థానం లభించింది. నూతన ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ శుక్రవారం మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. మంత్రిమండలిలో దర్శన్‌లాల్ అనే హిందువుకు అవకాశం కల్పించారు. గడిచిన 20 ఏండ్లలో ఓ హిందువు పాకిస్థాన్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. అధికార పీఎంఎల్-ఎన్ తరఫున రెండు సార్లు జాతీయ అసెంబ్లీకి గెలుపొందిన దర్శన్‌లాల్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

**ఎవరీ దర్శన్‌లాల్?**

పాకిస్థాన్ నూతన మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న దర్శన్ రావల్ అలియాస్ దర్శన్‌లాల్ సింధ్ రాష్ట్రంలోని ఘోట్కీ జిల్లా మీర్పూర్ మథేలో పట్టానికి చెందినవారు. 65 ఏండ్ల ఆయన వృత్తిరీత్యా వైద్యుడు. మైనారిటీలకు రిజర్వ్ చేసిన స్థానం నుంచి ఆయన జాతీయ అసెంబ్లీలో అడుగు పెట్టారు. తొలిసారి కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దర్శన్‌లాల్‌కు పాకిస్థాన్‌లోని నాలుగు రాష్ట్రాలను సమన్వయం చేసే బాధ్యతను అప్పగిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

## హత్యాసదృశమైన దాడి

- రాహుల్‌గాంధీపై దాడిని తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్
- బీజేపీ రాజకీయాల తీరు ఇది.. చేయించింది వాళ్లే : రాహుల్
- దాడికి పాల్పడిన బీజేపీ నేత అరెస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** గుజరాత్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీపై జరిగిన రాళ్లదాడిని ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇది హత్యా సదృశమైన దాడి అని, దీని వెనుక బీజేపీ, ఆర్‌ఎస్సెస్‌ల హస్తం ఉన్నదని పేర్కొన్నది. బీజేపీ, ఆర్‌ఎస్సెస్ కార్యకర్తలే తన వాహనాలపై దాడి చేయించారని రాహుల్‌గాంధీ శనివారం పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీరు రాజకీయాలకు ఇదో నిదర్శనమన్నారు. 'వాళ్ల మనుషులే చేశారు. కాబట్టే వాళ్లు దాడిని ఖండించడంలేదు' అని అన్నారు. రాళ్లదాడికి నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తల భావనలను ప్రభుత్వం గౌరవించాలని తరువాత రాహుల్ ట్వీట్ చేశారు. అయినా ఈ విషయం గురించి ఆలోచించకుండా వరదబాధితులకు సాయం చేయడంపై దృష్టిసారించాలని తమ పార్టీవారికి ఆయన ఉద్బోధించారు. ఈ దాడికి సంబంధించి బనస్కాంత జిల్లా బీజేపీ యువమోర్చా కార్యదర్శి జయేశ్ దర్జీ అలియాస్ అనిల్ రాథోడ్‌ను అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ నీరజ్ బాద్గుజార్ శనివారం తెలిపారు. దాడిని ఖండిస్తూ ఢిల్లీ, అహ్మదాబాద్‌లతోపాటు దేశవ్యాప్తంగా యువజన కాంగ్రెస్ నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. మరోవైపు రాజస్థాన్‌లో వరదలకు గురైన జాలోర్, బర్మేర్ సిరోహి తదితర ప్రాంతాలను రాహుల్ గాంధీ శనివారం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు.

# ముగ్గురు ఉగ్రవాదులు హతం

- పోలీసు అధికారికి గాయాలు
- కశ్మీర్‌లో ఘటన


**సోపోర్, ఆగస్టు 5:** జమ్ముకశ్మీర్‌లోని సోపోర్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు లష్కరే తాయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. ఓ పోలీసు కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. సోపోర్‌లోని అమర్‌గఢ్‌లో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో సైనికులు, సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి పోలీసులు సోదాలు నిర్వహించారు. తనిఖీలు చేపడుతున్న పోలీసులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో పోలీసులు ఎదురుకాల్పులు జరుపడంతో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు.

**కాల్పుల్లో ముగ్గురు యువకులకు గాయాలు**

కశ్మీర్‌లోని బందిపుర జిల్లాలో శనివారం ఉదయం సైనికుల వాహనం ఎస్కే బాల అనే ప్రాంతం నుంచి వెళ్తుండగా కొందరు యువకులు రాళ్లతో దాడిచేశారు. దీంతో సైనికులు కాల్పులు జరుపడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం స్థానిక దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## చట్టాలను అతిక్రమించలేదు

- సోదాలు చేసినా.. అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు
- వెల్లడించిన మంత్రి శివకుమార్
- కర్ణాటక అమాత్యుడి ఇళ్లపై ముగిసిన ఐటీ సోదాలు



**బెంగళూరు, ఆగస్టు 5:** తాను చట్టాలను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించలేదని, చివరకు నిజమే గెలుస్తుందని కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ అన్నారు. పన్ను ఎగవేత ఆరోపణల కేసులో భాగంగా ఆదాయం పన్ను అధికారులు గత బుధవారం నుంచి శనివారం వరకు శివకుమార్‌కు సంబంధించిన ఇండ్లలో సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం తన నివాసం వద్ద శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లోనే పార్టీ నేతలంతా తన వెన్నంటే ఉన్నారని, పార్టీని ఇరుకున పెట్టాల్సిన అవసరం తనకు లేదని స్పష్టంచేశారు. తనకు సంబంధించిన ఆస్తులపై సోదాలు జరిపారని, కానీ అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదని, వివరాలు తెలుసుకున్నాక అన్నీ చెప్తానని అన్నారు. 70 నుంచి 80 ప్రాంతాల్లో సోదాలు చేసినట్టు మీడియా ద్వారానే తెలుసుకున్నట్టు వివరించారు. అనంతరం మంత్రి శివకుమార్.. గుజరాత్ ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్స్‌కు వెళ్లి వారితో కలిశారు. వారంతా కలిసి గవర్నర్ విజుభాయ్ వాలాతో భేటీ అయి.. తర్వాత రిసార్ట్స్‌కు చేరుకున్నారు. కాగా, ఉద్దేశపూర్వకంగానే ఐటీ దాడులతో బీజేపీ.. భయాందోళనకు గురిచేయాలని చూస్తున్నదని గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. 43 మంది శాసనసభ్యులతో కలిసి ఎమ్మెల్యే శక్తీసిన్హ్ గోహిల్ శనివారం మీడియాతో మాట్లాడారు. శివకుమార్ 30 ఏండ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తున్నారని చెప్పారు. ఐటీ దాడులతో.. బీజేపీ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నదని చెప్పారు.

# జీవితంలో తియ్యదనాన్ని హరించే 'చక్కెర' వ్యాధి

## షుగర్ వ్యాధి: వెంటనే జాగ్రత్తపడితే 'డయాబెటిస్'పై పూర్తి అదుపు

శ్రీరామ్ (49) అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీ క్రియేటివ్ డైరెక్టర్. జాతీయస్థాయిలో గుర్తింపుతోసహా విజయవంతమైన వృత్తి నిపుణుడిగా తన హోదాకు తగ్గరీతిలో నగర శివార్లలోని విల్లాకొని నివాసాన్ని అక్కడికి మార్చాడు. ఆఫీసుకు వచ్చివెళ్లేందుకు రోజూ దాదాపు రెండు గంటలపాటు నలభై కి.మీ. ప్రయాణం, సమయాభావం తీవ్రమైన ఒత్తిడి కలిగించాయి. ఉత్సాహంగా పనిచేస్తూ టీమును ఉత్తేజ పరిచే వ్యక్తి కాస్తా తరచూ నీరసపడి పోతున్నాడు. హఠాత్తుగా శరీరం బరువు తగ్గిపోయింది. విపరీతమైన దాహం, తరచూ మూత్రానికి వెళ్లాల్సిరావటంతో ఇబ్బందిగా అనిపించింది. ఈ మార్పులతో ఆందోళన చెంది డాక్టరును కలవగా పరీక్షలుచేసి శ్రీరామ్ టైప్-2 డయాబెటిస్ ఉన్నట్లు నిర్ధారించి చికిత్స ప్రారంభించారు. డాక్టర్ సూచనల మేరకు మందులు వేసుకుంటుండటం, జీవనశైలిలో మార్పుచేసుకోవటం వల్ల పరిస్థితి మెరుగుపడటం మొదలయ్యింది. కానీ ఇటువంటి పరిస్థితే ఎదురైన చాలా మంది ఇది సాధారణ బలహీనత (జనరల్ వీక్నెస్) అనుకుని పెద్ద పొరపాటు చేస్తున్నారు. పేరులో తీపి (మధు-షుగర్)తో జీవితంలో చేదును నింపే ఆరోగ్యానికి తీరని నష్టం కలిగించే మధుమేహ (డయాబెటిస్) విస్తరించటానికి అవకాశం కల్పిస్తున్నారు.

**డయాబిటిస్‌లో రకాలు – తీవ్రత:**

వైద్యులు డయాబెటిస్ మిలిటస్ అని పేర్కొనే మధుమేహం జీవితాంతం వెంటాడే దీర్ఘవ్యాధి ఇది ఆహారం ద్వారా అందే శక్తిని ఉయోగించుకునే శరీర సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. దీనిలో టైప్-1, టైప్-2, టైప్-3 డయాబెటిస్ అని మూడు రకాలు ఉన్నాయి. వీటిలో సాధారణ భాషలో షుగర్ వ్యాధికి మారుపేరుగా ఉన్న టైప్-2 డయాబెటిస్ అత్యధిక సంఖ్యాకుల (95శాతం మంది)ను వేధిస్తున్న వ్యాధి. ఇది ఇపుడు మనదేశంతోసహా ప్రపంచదేశాలలో మానవవనరులకు తీరని నష్టం కలిగిస్తూ కుంటుబాలపై తీరని ఆర్థిక భారాన్ని మోపుతున్న ప్రధాన వ్యాధిగా తయారయ్యింది. ప్రపంచ జనాభాలో 8.5 శాతం మంది, మొత్తం 39 కోట్ల మంది మధుమేహ వ్యాధి పీడితులేనని అంచనా. మనదేశానికి వస్తే జనాభాలో 7శాతం, 6.2 కోట్ల మందికి డయాబెటిస్ ఉన్నది. వ్యాధిగ్రస్తులలో సగం మందికి అసలు తాము మధుమేహ వ్యాధి పీడితులం అన్న విషయం కూడా తెలియక పోవటం ఈ వ్యాధికి సంబంధించి విషాదకర అంశం. ఏటా 10 లక్షల మంది భారతీయులు ఈ వ్యాధి వల్ల అకాల మరణం పాలవుతున్నారు. మధు మేహం వ్యాధిలో రకాలు ఏమిటి? ఇవి ఎందుకు వస్తున్నాయి? ఈ వ్యాధివల్ల ఎదురయ్యే ఇతర ప్రమాదాలు ఏమిటి? దీని బారినపడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికితే డయాబెటిస్ గూర్చి వైద్యనిపుణులు ఎందుకు అంతగా ఆందోళన చెంది హెచ్చరిస్తున్నారో తెలిసి జాగ్రత్త పడగలుగుతాం.



**ఎందువల్ల వస్తుంది?**

మధుమేహ వ్యాధి మూడు రకాలు: వీటిలో మొదటిదైన టైప్ -1 డయాబెటిస్. ఇది ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయాల్సిన క్లోమం విఫలం అవటం వల్ల వస్తుంది. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ క్లోమంపై దాడిచేయటం(ఆటో ఇమ్యూన్) వల్ల ఇన్సులిన్ తయారుచేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీనిని ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్ అని కూడా అంటున్నారు. వ్యక్తి చిన్న వయస్సులో ఉన్నప్పుడే మొదలయ్యే ఈ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుండటాన్ని గుర్తించారు. శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఏర్పడటం వల్ల రెండో రకపు మధుమేహమైన టైప్-2 డయాబెటిస్ ఏర్పడుతుంది. దీనిలో శరీరం తనకు అవసరమైన ఇన్సులిన్ ఉత్పత్తి చేసుకున్నా దానికి స్పందిచగల శక్తిని కోల్పోయి ఉపయోగించుకోవటంలో విఫలం అవుతుంది. మన దేశంలో సగటున 43 సం. వయస్సులో ఈ వ్యాధికి గురవుతున్నారు. అయితే ఇటీవలి సంవత్సరాలో ఊబకాయం వల్ల కొందరు పిల్లలు కూడా టైప్-2 మధుమేహం బారిన పడుతున్నారు. నాన్ ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటిస్ అని పేర్కొనే ఈ వ్యాధి టైప్-1 మధుమేహం అంతటి తీవ్రమైనది కాదు. అయినప్పటికీ తీవ్రమైన ఆరోగ్య సమస్యలను మాత్రం సృష్టించి దీర్ఘకాలంతో తీరని నష్టాన్ని కలిగించగలుగుతుంది. ఇక చివరిదైన టైప్-3 డయాబెటిస్ గర్భధారణ వల్ల ఏర్పడుతుంది. ఈ వ్యాధి తాత్కాలికమైనది. గర్భవతులలో 2 నుంచి 10 శాతం మందిలో కనిపించే ఈ వ్యాధిని గెస్టేషనల్ డయాబెటిస్ అంటున్నారు. గర్భధారణ తరువాత మధ్య, చివరి దశలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ వల్ల వచ్చే ఈ డయాబెటిస్‌ను అదుపుచేయటం గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని కాపాడటానికి అత్యవసరం.



**మధుమేహం-ఎందుకింత ప్రమాదం:**

ఈ మూడూ రకాల డయాబెటిస్‌ల వల్ల శరీరంలో వ్యక్తమయ్యే ఫలితం ఒకటి ఉంది. మన ఆహారంగా తీసుకున్న పిండిపదార్థాలను శరీరం సాధారణంగా గ్లూకోస్ అనే ప్రత్యేక చక్కెరగా విడగొడుతుంటుంది. ఈ గ్లూకోసే మన దేహానికి అవసరమైన శక్తిని అందిస్తుంది. అయితే ఇందుకోసం శరీర కణాలకు ఇన్సులిన్ అనే హార్మోన్ అవసరం అవుతుంది. డయాబెటిస్ వల్ల శరీరం ఇన్సులిన్‌ను తయారు చేసుకోలేకపోవటమో లేక ఉత్పత్తయిన ఇన్సులిన్ ఉపయోగించుకోలేకపోవటమో జరుగుతుంది. కొన్నిసార్లు ఈ రెండు లక్షణాలూ కనిపిస్తాయి. శరీరం గ్లూకోస్‌ను వాడుకోలేకపోవటం వల్ల రక్తంలో దాని పరిమాణం పెరుగుతుంది. రక్తంలో గ్లూకోస్ శాతం పెరగటం మూత్రపిండాలు, గుండె, కళ్లు, నాడీమండలంలోని అతిచిన్న రక్తనాళాలకు నష్టం కలిగిస్తుంది.అందువల్లనే మధుమేహాన్ని గుర్తించి చికిత్స చేయని పక్షంలో అది గుండె వ్యాధులకు, పక్షవాతానికి, మూత్రపిండాల వ్యాధులకు, అంధత్వానికి, పాదాలలోని నాడులు-రక్తకేశనాళికల వ్యాధుల (డయాబెటిక్ ఫుట్ లాంటి) కు దారితీస్తుంది.

**దీనికి చికిత్స ఏమిటి?**

మధుమేహం తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతుందన్నది ఆందోళన కలిగించే విషయం. అయితే నల్లని మబ్బులాగా కమ్ముకువచ్చే ఈ సమస్యకు ఆధునిక వైద్యం పరిష్కారం చూపించి అదుపులో ఉంచగలుగుతుందన్న అంశం ఆ మబ్బుకు వెండి అంచులా కనిపిస్తుంది. డయాబెటిస్‌ను గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభించటం ద్వారా వ్యాధి మరింత విస్తరించకుండా అదుపుచేయటమే కాకుండా పూర్తి సాధారణ జీవితం గడపవచ్చునని యశోద ఆస్పత్రిలోని ఎండోక్రైనాలజీ అండ్ డయాబెటిస్ విభాగం వైద్య నిపుణులు చెప్పారు. మధుమేహ వ్యాధికి సంబంధించి అత్యాధునిక చికిత్సా పద్ధతులు అభివృద్ధి చెందాయని, ఉత్తమ ఫలితాలను ఇవ్వగల మందుల అందుబాటులోకి వచ్చాయని చెబుతూ వారు ఆ మందులను వాడటం, సూచించిన ఆహార, విహార నియమాలను పాటించటం ద్వారా మధుమేహ వ్యాధి దాడిని ఖచ్చితంగా నియంత్రించవచ్చునని వివరించారు.

**డయాబెటిస్‌ను నిరోధించడం ఎలా?**

కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం ద్వారా అత్యధికులలో కనిపించే టైప్-2 డయాబెటిస్ బారిన పడకుండా చూసుకోవచ్చు. ఇందులో మొదటిది శరీర బరువును అదుపులో ఉంచుకోవటం. వ్యక్తి పొడవు, శరీరపు బరువు ఆధారంగా లెక్కించే బి.ఎం.ఐ.(బాడీ మాస్ ఇండెక్స్) బి.ఎం.ఐ. 25 కి.గ్రా/ఎం2 లోపు ఉండేట్లు చూసుకోవాలి. అధిక బరువు దశ (బి.ఎం.ఐ. 25 కి.గ్రా/ఎం2 నుంచి 30కి.గ్రా /ఎం2 వరకూ)కు చేరుకున్న పక్షంలో వెంటనే పోషకాహార, వ్యాయామ నిపుణుల సాయంతో బరువును తగ్గించుకునేందుకు పూనుకోవాలి. శరీరం బరువు అదుపులేకుండా పెరిగిపోయి ఊబకాయం ఏర్పడితే డాక్టర్లను కలిసి బరువును తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ అవకాశాలను తెలుసుకుని పాటించాలి. దీనితోపాటు మితిమీరిన పిండిపదార్థాలు-కొవ్వు అధికంగా ఉండే అనారోగ్యకరమైన ఆహారాన్ని తగ్గించి పళ్లు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి. మద్యపానం, రాత్రిళ్లు ఎక్కువ సమయం మెలుకువగా ఉండే జీవనశైలిని మార్చుకోవాలి. మొత్తం మీద చూస్తే అత్యధిక సంఖ్యాకులకు సంబంధించి మధుమేహ వ్యాధి రాకుండా జాగ్రత్తపడవచ్చు. అనివార్యంగా ఆ వ్యాధి బారినపడ్డా వెంటనే డాక్టరును సంప్రదించి చికిత్స పొందటం ద్వార ఆ వ్యాధిని అదుపులో ఉంచుకుని సాధారణ జీవితం గడపవచ్చు.



